thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 318 కరీంనగర్ శుక్రవారం, 24 జనవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## త్వరలో 'రైల్వే సూపర్ యాప్' ఆవిష్కరణ

న్యూఢిల్లీ : రైల్వే సేవలన్నీ ఒకే చోట లభ్యమయ్యే 'సూపర్ యాప్' త్వరలో అందుబాటులోకి రానుంది. టిక్కెట్ల బుకింగ్, రిజర్వేషన్లు, ప్లాట్‌ఫారం టిక్కెట్లు, కేటరింగ్... తదితర సేవలన్నింటినీ సమన్వయపరిచి ఒకే యాప్ రూపంలో ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. 'క్రిస్' సంస్థ ఈ నూతన యాప్ రూపకల్పనలో నిమగ్నమయింది. ఈ సమగ్ర మొబైల్ అప్లికేషన్ వచ్చే నెలలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ల ద్వారా ప్రయాణికులకు సేవలు అందుతున్నాయి. ఒక్కో సేవకు ఒక్కో అప్లికేషన్ ఉండడంతో వాటన్నింటినీ సమన్వయపరిచి సమగ్రమైన యాప్‌ను రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## భారతీయుల గోల్డెన్ ఎరా మొదలైంది.. చంద్రబాబు కీలక వ్యాఖ్యలు..



ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం ఇండియా బ్రాండ్ అత్యంత పటిష్టంగా ఉందన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు . భారతీయుల గోల్డెన్ ఎరా మొదలైందన్నారు.. దావోస్ వేదిక గా భారత్ తరపున నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు... రాజకీయాల్లో వారసత్వం ఉండదని.. చుట్టూ ఉన్న పరిస్థితి వల్ల అవకాశాలు వస్తాయన్నారు చంద్రబాబు.. పెట్టుబడుల కోసం రాష్ట్రాలు పోటీపడినా ఇండియా ఫస్ట్ అన్నదే తమ విధానం అన్నారు.. .అంతర్జాతీయంగా ఇండియా బ్రాండ్ అత్యంత పటిష్టంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. పని చేసే యువత ఉన్న దేశంగా భారత్ కు స్వర్ణయుగం మొదలైందని అన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని.. ఇక నుంచి అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. దావోస్ వేదికగా భారత్ తరపున నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి చంద్రబాబు మాట్లాడారు. గతంలో దావోస్ కు ఒకరిద్దరు సీఎంలు, కేంద్రమంత్రులు వచ్చేవారని.. చరిత్రలో మొదటిసారి భారత్ తరపున అందరం కలిసి మాట్లాడుతున్నామని చెప్పారు. దేశంలో వివిధ పార్టీల నుంచి వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చినా.. దావోస్ అందరం ఒక్కటేనన్నారు. దావోస్ నుంచి పెట్టుబడులు రాబట్టేందుకు దేశంలో అన్ని రాష్ట్రాలు పోటీపడుతున్నా టీమ్ ఇండియాగా అందరిది ఒకే లక్ష్యం అన్నారు. భారత్ నుంచి దావోస్ సదస్సుకు హాజరు అవుతున్న వారిలో తానే సీనియర్ ను అని సీఎం సరదాగా వ్యాఖ్యానించారు. 1997 నుంచి దావోస్ లో ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరు అవుతున్నట్టు ఆయన తెలిపారు. గతంలో భారత్ కు చాలా తక్కువ గుర్తింపు ఉండేదనీ ఇప్పుడు భారత్ కు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. బలమైన ఆర్థిక వ్యవస్థగా 2028 నాటికి భారత్ కు ఇంక్రిమెంటల్ గ్రోత్ రేట్ సానుకూలమైన అంశం అన్నారు. ప్రపంచంలో ఇప్పుడు ఇండియా అన్ స్టాపబుల్ అంటూ సీఎం చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో వారసత్వం పరిస్థితి వల్ల వస్తుందన్నారు..

చుట్టూ ఉన్న పరిస్థితి వల్ల అవకాశాలు వస్తాయన్నారు.. రాజకీయాలు జీవనోపాధి కాదన్నారు సీఎం చంద్రబాబు. ఎవరైనా ఒకసారి మోసం చేసి అధికారంలోకి రావచ్చని.. ప్రతిసారీ అది సాధ్యం కాదన్నారు.. వికసిత భారత్ విజన్ తో వృద్ధి రేటు కోసం అంతా కలిసి పనిచేస్తే దేశాభివృద్ధి సాధ్యమేనని అన్నారు చంద్రబాబు... సుస్థిర వాతావరణం కోసం 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం గా భారత్ పని చేసేందుకు లక్ష్యంగా పెట్టుకుందని.. అందులో 165 గిగా వాట్లు విద్యుత్ ఏపీలోనే ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నామని సీఎం అన్నారు. దావోస్ లో భారత్ లోని వివిధ రాష్ట్రాలు పెట్టుబడుల కోసం పోటీ పడుతున్నాయని.. కానీ, అంతా ఐక్యంగా దేశం కోసం కలిసి పనిచేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రులు గా తాము వేర్వేరు పార్టీలకు చెందిన వారం అయినా ఐక్యంగా ఆలోచించేది దేశం కోసం ప్రజల కోసమని వ్యాఖ్యానించారు. ఆరోగ్యం, వ్యవసాయం, మానవాభివృద్ధి లో డీప్ టెక్ లాంటి సాంకేతికత రావాలని అన్నారు. పెట్టుబడులు ఆకర్షించడంలో, వృద్ధిరేటులో ఏపీ చాలా కృషి చేయాల్సి ఉందన్నారు. మరోవైపు ప్రపంచం నుంచి తీసుకెళ్ళడం కంటే దానికే సాంకేతికతను భారత్ అందిస్తోందని అన్నారు. వనరులు అవకాశాలను ప్రపంచానికి చూపుతున్నామని అన్నారు. 2047 కల్లా రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుందని అన్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోంది. గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ విశేష కృషి చేస్తోందన్నారు చంద్రబాబు.. దాదాపు అన్ని టెక్ కంపెనీల సీఈవోలు భారత సంతతికి చెందినవారే. సాంకేతికతను ముందుగా అందిపుచ్చుకున్న దేశంగా భారత్ ప్రయోజనాలు పొందుతోంది. వ్యాపార దక్షత, నైపుణ్యాలు ఉన్న యువత, జనాభా ఎక్కువగా ఉండటం భారత్ కు వరాలు. ప్రపంచం మొత్తానికి ఇండియా సేవలందిస్తోంది. ప్రపంచంలో అన్ని ప్రాంతాల ప్రజలకు అత్యంత ఆమోదయోగ్యులు భారతీయులే అన్నారు.. ఇక, దావోస్ పర్యటన ముగించుకుని ఇవాళ రాత్రి ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ చేరుకుంటారు.. లోకేష్ ఇవాళ, రేపు కూడా దావోస్ లో ఉండే అవకాశం ఉంది.




## తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ.. సమీకరణలో సరికొత్త రికార్డు

ప్రపంచ ఆర్థిక ఫోరం వేదికగా తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడుల రికార్డు నమోదు చేసింది. 16 ప్రముఖ కంపెనీలు సుమారు రూ.1.78 లక్షల కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ప్రాజెక్టుల వల్ల సుమారు 49,550 మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, ఆశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు దావోస్ పర్యటనలో పాల్గొన్నారు.

# మరో భారీ పెట్టుబడి!




## అమెజాన్‌తో కీలక ఒప్పందం!!

హైదరాబాద్ : సైలెంట్ గా తనపని తాను చేసుకుంటూ ముందుకు సాగడంలో ఎవరైనా సీఎం రేవంత్ రెడ్డి తరువాతే అంటారు కాంగ్రెస్ నాయకులు. హంగామా ఉండదు.. ఆడంబరం కోరుకోరు.. అనుకున్న లక్ష్యాన్ని సాధించకుండ ఉండరు సీఎం రేవంత్ రెడ్డి. ఈ మాట అంటున్నది కూడ తెలంగాణ కాంగ్రెస్. విదేశీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ప్రపంచంలోనే పేరు గాంచిన సంస్థల ప్రతినిధులను ఒప్పించడమే. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అనుక్షణం పెట్టుబడుల సాధనపై దృష్టి సారించి సక్సెస్ అయ్యారు. తాజాగా మరో సంస్థతో ఏకంగా రూ. 60 వేల కోట్ల పెట్టుబడులను సాధించారు. దీనితో కాంగ్రెస్ సోషల్ మీడియా.. ఇది మా సీఎం సార్ ఘనత అంటూ ప్రచారం సాగిస్తున్నారు. ఇంతకు భారీ ఒప్పందం ఏమిటో తెలుసుకుందాం. సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్ పర్యటనలో అమెజాన్ తో భారీ ఒప్పందం కుదుర్చుకున్నారు. దావోస్ వేదికపై తెలంగాణకు ఇప్పటికే భారీగా పెట్టుబడులు వెల్లువల రాగా, అమెజాన్ తో ఒప్పందం కుదిరింది. హైదరాబాద్ లో ఏకంగా రూ.60,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అమెజాన్ కంపెనీ అంగీకరించింది. డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులు అమెజాన్ వెబ్ సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైఖేల్ పుంకేతో భేటీ అయ్యారు. దాదాపు రూ. 60000 కోట్ల పెట్టుబడుల ప్రణాళికలతో హైదరాబాద్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ తమ డేటా సెంటర్‌లను పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. భవిష్యత్తులో అర్టిఫిషియల్ ఆధారిత క్లౌడ్ సేవల వృద్ధికి ఈ డేటా సెంటర్లు కీలకంగా మారనున్నాయి. తెలంగాణలో తన క్లౌడ్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి 2030 నాటికి 4.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులను అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇప్పటికే ప్రకటించింది. ఒక బిలియన్ పెట్టుబడులతో రాష్ట్రంలో మూడు సెంటర్లను గతంలోనే అభివృద్ధి చేసింది. ఈ మూడు కేంద్రాలు ఇప్పటికే పనిచేస్తున్నాయి. కొత్తగా చేపట్టే విస్తరణ ప్రణాళికలకు అవసరమైన భూమిని కేటాయించాలని అమెజాన్ వెబ్ సర్వీసెస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. ఈ అభ్యర్థనను రాష్ట్ర ప్రభుత్వం అందుకు అంగీకరించింది. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అమెజాన్ వంటి ప్రపంచ దిగ్గజ కంపెనీలు మన రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ తో ప్రజా ప్రభుత్వం ఏడాదిగా చేపట్టిన ప్రయత్నాలు ఫలించాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో హైదరాబాద్ దేశంలో డేటా సెంటర్ల కేంద్రంగా తిరుగులేని గుర్తింపు సాధిస్తుందని ఐటీ మంత్రి డి. శ్రీధర్ బాబు అన్నారు. అలాగే హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ భారీ విస్తరణ దిశగా నిర్ణయం తీసుకుంది. పోచారంలో ఉన్న ఇన్ఫోసిస్ క్యాంపస్ లో అదనంగా 17 వేల ఉద్యోగాలు కల్పించేందుకు ఇన్ఫోసిస్ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు విస్తరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమైన ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేష్ సంగ్రాజ్కా ఈ మేరకు ప్రకటించారు. ఈ ఒప్పందంలో భాగంగా ఫస్ట్ ఫేజ్‌లో ఇన్ఫోసిస్ సంస్థ రూ.750 కోట్ల పెట్టుబడితో కొత్త ఐటీ భవనాల నిర్మాణం సాగుతుంది.

ఈ ఒప్పందంపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేసే లక్ష్యంతో అన్ని రంగాల్లో ప్రముఖ సంస్థలు, పారిశ్రామిక దిగ్గజాలకు ప్రభుత్వం తగినంత మద్దతు ఇస్తుందన్నారు.




# రూటు మార్చిన మోదీ!

## టార్గెట్ ఫిక్స్..!!

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు కౌంట్ డౌన్ కొనసాగుతోంది. వచ్చే నెల 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ సారి ఎన్నికల్లో త్రిముఖ పోటీ కనిపిస్తోంది. మూడు పార్టీలు ఇప్పటికే ఓటర్లను ఆకట్టుకోవటానికి భారీగా హామీలు గుప్పించాయి. మేనిఫెస్టోలు విడుదల చేసాయి. ఇక, బీజేపీ ఢిల్లీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రధాని మోదీ ఢిల్లీలో ప్రచారానికి సిద్ధం అవుతున్నారు. బీజేపీకి చెందిన ముఖ్య నాయకత్వం ఢిల్లీలో మోహరిస్తోంది. కొత్త వ్యూహాలతో కేజ్రీవాల్ టార్గెట్ గా బీజేపీ ప్రణాళికలు అమలు చేస్తోంది.

**ప్రతిష్ఠాత్మక పోరు :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కీలక దశకు చేరింది. బీజేపీ, ఆప్, కాంగ్రెస్ మధ్య ఇక్కడ త్రిముఖ పోటీ కొనసాగుతోంది. కేజ్రీవాల్ ముందుగానే ఎన్నికల బరిలోకి దిగారు. బీజేపీ లక్ష్యంగా ఆప్ వ్యూహాలు అమలు చేస్తోంది. మహిళలు, యువత, మధ్య తరగతి ఓటర్లను దక్కించుకోవటమే లక్ష్యంగా కేజ్రీవాల్ హామీలు ఇస్తున్నారు. దీనికి కౌంటర్ గా బీజేపీ, కాంగ్రెస్ సైతం తమ హామీలను ప్రకటించాయి. ఢిల్లీ ఓటర్లలో సగానికి పైగా ఉన్న మహిళల కోసం మూడు పార్టీలు పోటీ పడి హామీ లను కురిపిస్తున్నాయి. అదే విధంగా వరుసగా హర్యానా, మహారాష్ట్రలో గెలిచిన బీజేపీ ఇప్పుడు ఢిల్లీ పైన గురి పెట్టింది.

**మోదీ ప్రచార షెడ్యూల్ :** ఈ నెలఖరు నుంచి ప్రధాని మోదీతో పాటుగా బీజేపీ అగ్ర నాయకత్వం ఢిల్లీలో మొహరించనుంది. ఇందు కోసం ప్రధాని మోదీ షెడ్యూల్ దాదాపు ఖరారైంది. ప్రధానితో పాటుగా అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రచారం కోసం రానున్నారు. ప్రధాని మోదీ ఈ నెల 29, 31, ఫిబ్రవరి 2న ఢిల్లీలో ఎన్నికల సభల్లో పాల్గొంటారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. అటు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ 15 ఎన్నికల సభల్లో ప్రసంగించేలా షెడ్యూల్ సిద్దం చేసారు. అదే విధంగా అమిత్ షా, నడ్డా సైతం ఎంపిక చేసిన ప్రాంతాల్లో జరిగే ఎన్నికల ప్రచారం.. సభల్లో పాల్గొంటారని బీజేపీ నేతలు వెల్లడించారు.

**హోరెత్తుతున్న ప్రచారం :** బీజేపీని టార్గెట్ చేస్తూ కేజ్రీవాల్ ప్రచారం చేస్తున్న వేళ ప్రధాని మోదీ కొత్త వ్యూహంతో ఢిల్లీ ప్రచార బరిలోకి దిగుతున్నారు. ఇప్పటికే ఢిల్లీలో గెలుపు తమదేనని మోదీ ధీమా వ్యక్తం చేసారు. కాగా, ఫిబ్రవరి 1న కేంద్రం ప్రవేశ పెట్టే బడ్జెట్ సైతం ఈ ఎన్నికల పైన ప్రభావం చూపనుంది. ఈ బడ్జెట్ వేళ ఆప్ ఇప్పటికే కేంద్రం ముందు ఏడు డిమాండ్లను ఉంచింది.

ప్రధాని మోదీ ప్రచారంతో ఢిల్లీ ఎన్నికల పోరు కొత్త టర్న్ తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న కౌంటింగ్ కు నిర్ణయించారు. దీంతో, ఢిల్లీ ఎన్నికల వేళ వచ్చే వారం రాజకీయంగా కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.

చురకలు

శుక్రవారం 24 జనవరి 2025




తెలంగాణలో భారీ పెట్టుబడికి దిగ్గజ సంస్థ అమెజాన్ ముందుకొచ్చింది. దావోస్‌లో అమెజాన్ వెబ్‌సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైకేల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రూ.60వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అమెజాన్ అంగీకారం తెలిపింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం జరిగింది. ఈ పెట్టుబడితో రాష్ట్రంలో డేటా సెంటర్లను అమెజాన్ విస్తరించనుంది. వీటికి అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మరోవైపు ఇన్ఫోసిస్ సీఎఫ్‌వో సంగ్రాజ్‌తో తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు. పోచారంలో ఐటీ క్యాంపస్ విస్తరణకు ఇన్ఫోసిస్ అంగీకారం తెలిపింది. రూ.750కోట్లతో మొదటి దశ విస్తరణ చేపడతామని ఆ సంస్థ తెలిపింది. దీంతో కొత్తగా 17వేల ఉద్యోగాలు రానున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

## దావోస్‌లో 10 సంస్థలతో ఒప్పందం.. తెలంగాణకు రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులు




హైదరాబాద్, జనవరి 23: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన విజయవంతంగా పూర్తైంది. దావోస్‌లో తెలంగాణకు పెట్టుబడులు వెల్లువెత్తాయి. మూడు రోజుల దావోస్ పర్యటనలో భాగంగా పలు దిగ్గజ కంపెనీల అధిపతులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా వారిని కోరారు. అలాగే పలు కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా ముందుకు వచ్చాయి. తెలంగాణాకు భారీగా పెట్టుబడులు ఆకర్షించడంలో తెలంగాణ రైజింగ్ బృందం సక్సెస్ అయింది. మొత్తం పది కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందాలు చేసుకుంది. దాదాపు రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. కొత్త ఒప్పందాలతో 46 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత రికార్డు స్థాయిలో పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

అయితే గత ఏడాదితో పోలిస్తే పెట్టుబడులు మూడింతలు మించాయని చెప్పుకోవచ్చు. మరోవైపు ఈరోజుతో సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ముగియనుంది.

**పది ప్రముఖ సంస్థలు ఇవే..** 1. సన్ పెట్రో కెమికల్స్: భారీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటు. నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో ప్లాంట్లు. 3400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో విద్యుత్తు. 5440 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు. రూ. 45,500 కోట్ల పెట్టుబడులు, 7,000 ఉద్యోగాలు 2.అమెజాన్ వెబ్ సర్వీసెస్: ఏఐ, క్లౌడ్ సర్వీసెస్ డేటా సెంటర్లలోభారీ పెట్టుబడులు. రూ. 60,000 కోట్లు. 3. కంట్రోల్ ఎస్ : తెలంగాణలో అత్యాధునిక ఏఐ డేటాసెంటర్ క్లస్టర్. 400 మెగా వాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్. రూ. 10,000 కోట్లు, 3,600 మందికి ఉపాధి. 4. జేఎస్ డబ్ల్యూ సంస్థ: రాష్ట్రంలో మానవరహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ – రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు క్రియాశీలంగా మారనుంది. రూ.800 కోట్ల పెట్టుబడులు, 200 ఉద్యోగాలు. 5. స్కైరూట్ ఏరో స్పేస్: తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ మరియు టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు. రూ.500 కోట్ల పెట్టుబడులు. 6. మేఘా ఇంజనీరింగ్ (%వీజు×రా%) మూడు కీలక ఒప్పందాలు. రాష్ట్రంలో 2160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్ట్. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్రాజెక్టు. అనంతగిరిలో వరల్డ్ క్లాస్ లగ్జరీ వెల్నెస్ రిసార్ట్. రూ.15000 కోట్ల పెట్టుబడులు, 5250 మందికి ఉపాధి. 7. హెచ్‌సీఎల్ టెక్ సెంటర్: హైటెక్ సిటీలో3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్. 5000 మందికి ఉపాధి. 8. విప్రో : హైదరాబాద్‌లో విప్రో కంపెనీ విస్తరణ. గోపనపల్లి క్యాంపస్‌లో కొత్త ఐటీ సెంటర్. 5,000 మందికి ఉద్యోగాలు. 9. ఇన్ఫోసిస్: హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ క్యాంపస్ విస్తరణ. పోచారంలో ఐటీ క్యాంపస్‌లో కొత్త సెంటర్. రూ. 750 కోట్ల పెట్టుబడులు, 17,000 ఉద్యోగాలు. 10. యూనిలివర్ కంపెనీ: కామారెడ్డి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్. రాష్ట్రంలో బాటిల్ క్యాప్‌లను ఉత్పత్తి చేసే కొత్త తయారీ యూనిట్ ఏర్పాటు. దాదాపు వెయ్యి ఉద్యోగాలు.

## మంచి చేయాలని చూస్తుంటే అడ్డుకుంటున్నారు: మంత్రి తుమ్మల ఆగ్రహం..



యాదాద్రి: తెలంగాణ రాష్ట్రంలో అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని చూస్తుంటే బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకుంటున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేని సిగ్గులేని నేతలు గ్రామసభలకు అడ్డుతగులుతున్నారని మంత్రి ఘాటుగా స్పందించారు. దీక్షలు, నిరసనల పేరుతో అడుగడుగునా అడ్డం పడుతున్నారని తుమ్మల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పదేళ్ల విధ్వంస పాలనకు గురైన రాష్ట్రాన్ని ఆదుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. అందుకే తెలంగాణ రైతాంగాన్ని ఆదుకునేందుకు రుణమాఫీ చేసినట్లు చెప్పుకొచ్చారు.

**ఎందుకు చేయలేదు..** అన్నదాతలకు మేలు చేస్తుంటే నల్లగొండలో రైతు దీక్ష చేస్తున్నారంటూ మంత్రి తుమ్మల నిప్పులు చెరిగారు. నల్లగొండ రైతు దీక్ష చేయాలని భావిస్తున్న బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు అధికారంలో ఉండి రైతులకు రుణమాఫీ ఎందుకు చేయలేదని మంత్రి నిలదీశారు. జనవరి 26 నుంచి అన్నదాతలకు రైతు భరోసా ఇవ్వనున్నట్లు మంత్రి తుమ్మల మరోసారి గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డును తాకట్టుపెట్టి కొంతమంది రైతులకు రైతు బంధు వేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో దొడ్డు బియ్యం మాఫియా ఉందని, అందుకే ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తీసుకువస్తారని మంత్రి తుమ్మల ధీమా వ్యక్తం చేశారు.

**మంత్రుల జోక్యం ఉండదు..** రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మంత్రులుగా తమ జోక్యం ఉండదని, న్యాయంగా అర్హులైన వారందరికీ మంజూరు చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అధికారులు ప్రజాపాలన సభల్లో ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులను గుర్తిస్తారని మంత్రి తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ 15వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం జరిగేలా సాఫ్‌వేర్ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.2 లక్షలకు పైగా ఇంకా రుణమాఫీ కాని రైతులకు మార్చి నెలలో షెడ్యూల్ పెట్టి రుణమాఫీ చేస్తామని చెప్పుకొచ్చారు.

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని, ముందు సమస్యలను అధికారులు, తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజా సమస్యలు పరిష్కరించడం తన బాధ్యతంటూ మంత్రి పొన్నం చెప్పారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్.. అసలు విషయం ఏంటంటే..

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. దావోస్ పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి తనను ఐటీ ఉద్యోగి అంటూ మాట్లాడడంపై కేటీఆర్ ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. తనను ఒక ఐటీ ఉద్యోగి అంటూ తక్కువ చేసి మాట్లాడొచ్చని అనుకునేవాళ్లకు ఒకటే చెప్పదలుచుకున్నా.. ఐటీ పరిశ్రమలలో ఉండాలంటే నిజమైన ప్రతిభ, విద్య, అంకితభావం అనేవి ఎంతో అవసరం అని మాజీ మంత్రి చెప్పారు. కానీ డబ్బులతో ఎమ్మెల్యేలను కొనడానికి, ఢిల్లీ బాసులకి డబ్బుల సంచులు పంపడానికి ఇవేమీ అవసరం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ.."ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐటీ ఉద్యోగులు ఎంతో కష్టపడి వారి జీవనోపాధిని పొందుతున్నారు. ఐటీ, ఐటీ అనుబంధ సంస్థల్లో ఉన్న అక్కాచెల్లెళ్లకు, అన్నాదమ్ముళ్లకు సలాం.. మీ మేధస్సు, అవిశ్రాంత శ్రమే ఆధునిక సాంకేతిక ప్రపంచానికి వెన్నెముక. మీరు లేకుంటే ప్రగతి రథచక్రాలు ఆగిపోతాయి. మీ విద్యార్హతలు, నిబద్ధతకు కొందరు యాక్సిడెంటల్ రాజకీయ నాయకులు సరితూగరు. అలాంటి వాళ్లు ప్రవేశపెట్టే అనాలోచిత విధానాలకు మనం భారీ మూల్యం చెల్లించుకుంటున్నాం. నా విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, ఐటీలో నా నేపథ్యం, ముఖ్యంగా ఐటీ రంగంలో ఉన్న ఉద్యోగులు నాకు ఎప్పటికీ గర్వకారణం" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. కాగా, దావోస్ పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను పొలిటీషియన్‌ను కాబట్టి పాలసీ మేకర్‌లాగా ఉంటానని, కేటీఆర్ ఐటీ ఉద్యోగం చేశారు కాబట్టి ఆయన ఆలోచనలు ఓ ఉద్యోగి లాగానే ఉంటాయని వ్యాఖ్యానించారు.

## ఇద్దరు కుమార్తెలను చంపి తల్లి ఆత్మహత్య



మధిర, మధిర రూరల్: ఖమ్మం జిల్లా మధిర మండలం నిదాన పురంలో విషాదం చోటుచేసుకుంది. తల్లి తన ఇద్దరు కుమార్తెలను చంపి ఆపై తాను ఉరేసుకుంది. చోరీ కేసులో ప్రేజా (35) భర్త షేక్ బాజీని పోలీసులు పీఎస్‌కు తీసుకెళ్లారు.

అవమానభారంతో ఇద్దరు కుమార్తెలు మెహ్రూల్ (7), మెహక్ (6)లను చంపేసి ఆ తర్వాత ప్రేజా బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.




## లాస్ ఏంజెలెస్‌లో మళ్లీ మొదలైన కార్చిచ్చు.. గంటల్లో వేల ఎకరాలకు మంటలు

కాలిఫోర్నియా: అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో ఇటీవల చెలరేగిన కార్చిచ్చు ఇంకా శాంతించడం లేదు. దీనికి తోడు తాజాగా మరో ప్రాంతంలో కొత్తగా మంటలు చెలరేగాయి దీంతో మళ్లీ ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. కాస్టాయిక్ లేక్ సమీపంలోని కొండల ప్రాంతం నుంచి అగ్నికీలలు విస్తరిస్తున్నాయని అధికారులు వెల్లడించారు. ఇవి కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే 8వేలకు పైగా ఎకరాలకు వ్యాపించినట్లు తెలిపారు. దీంతో ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు వెంటనే నివాసాలను ఖాళీ చేయాలని హెచ్చరించారు. కాస్టాయిక్ లేక్ సమీపంలో బుధవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. కొన్ని గంటల వ్యవధిలోనే ఈ అగ్నికీలలు 39 చదరపు కిలోమీటర్ల మేర ఉన్న చెట్లను, పొదలను బూడిద చేశాయని అధికారులు వెల్లడించారు. తాజాగా కార్చిచ్చు మొదలైన ప్రాంతం.. ఇటీవల అగ్నికి ఆహుతైన ఈటన్, పాలిసేడ్స్‌కు కేవలం 64 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఈ ప్రాంతాల్లో మంటలు ఇంకా ఆరలేదు. దీనికి తోడు, దక్షిణ కాలిఫోర్నియా నుంచి వీస్తున్న బలమైన గాలులు మరింత ప్రమాదకరంగా మారాయి. గాలి బలంగా వీస్తుండటంతో మంటలు ఒక చోటు నుంచి మరో చోటుకు వేగంగా వ్యాపిస్తున్నాయి. అగ్నికీలల తీవ్రత దృష్ట్యా మంటలను అదుపు చేయడం అతి కష్టంగా మారిందని అధికారులు వెల్లడించారు. అయితే, అగ్నిమాపక సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. తాజా కార్చిచ్చుతో దాదాపు 50వేల మందికి పైగా ప్రజలు నివాసాలు ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ గంటకు 67 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) నాటికి ఇది గంటకు 96 కిలోమీటర్లకు పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే విమానాలతో వాటర్ బాంబులను జారవిడుస్తూ మంటలను అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు.

ఇటీవల లాస్ ఏంజెలెస్‌లోని హాలీవుడ్ సహా పలు ప్రాంతాల్లో భీకర కార్చిచ్చు చెలరేగిన సంగతి తెలిసిందే. ఆ మంటల ధాటికి 14వేల నిర్మాణాలు బూడిదయ్యాయి. 28 మంది ప్రాణాలు కోల్పోయారు. పాలిసేడ్స్‌లో మంటలను 68శాతం అదుపు చేయగా.. ఈటన్‌లో ఫైర్‌ను 91 శాతం అదుపులోకి తీసుకొచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ, గాలుల కారణంగా ఇవి మళ్లీ తీవ్రమవుతున్నాయి.



## ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్.. మావోయిస్టు అగ్రనేత చంద్రహాస్ మృతి

హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దులో ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గరియాబంద్, నౌపాడ జిల్లాల్లో భద్రతాబలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ చలపతితో పాటు కీలక నాయకులు మరణించారు. ఈ ఎన్‌కౌంటర్‌లోనే మావోయిస్టు మరో అగ్ర నేత కూడా మృతిచెందినట్లు తాజాగా తెలిసింది. తెలంగాణకు చెందిన చంద్రహాస్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ పరిధి యాప్రాల్ వాసి ప్రమోద్ అలియాస్ చంద్రహాస్ మరణించినట్లు పోలీసులు నిర్ధారించారు. అతడు ఒడిశాతో పాటు ఈస్ట్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జ్‌గా ఉన్న అతడి తలపై రూ.20లక్షల రివార్డ్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 20 మందికి పైగా మావోయిస్టులు మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. వీరిలో 17 మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌కు తరలించారు. మిగతా మృతదేహాల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది.

## డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మకు జైలు శిక్ష




దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు బిగ్ షాక్ తగిలింది. ముంబైలోని అంధేరీ మేజిస్ట్రేట్ కోర్టు చెక్ బౌన్స్ కేసులో వర్మను దోషిగా తేలుస్తూ మూడు నెలల జైలు శిక్ష విధించింది. 2018లో మహేశ్ చంద్ర అనే వ్యక్తి ఫిర్యాదు చేయగా వర్మపై కేసు నమోదు అయింది. అప్పటి నుంచి ఒక్కసారి కూడా ఆర్జీవీ విచారణకు హాజరుకాలేదు. దీంతో ఆగ్రహించిన న్యాయస్థానం ఆయనకు నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. ఫిర్యాదుదారునికి 3 నెలల్లో రూ.3.72లక్షల పరిహారం ఇవ్వాలని, లేదంటే మరో 3 నెలల జైలు శిక్ష అనుభవించాలని సంచలన తీర్పు ఇచ్చింది. అయితే, దీనిపై వర్మ ఎలా రియాక్ట్ అవుతారో తెలియాల్సి ఉంది. గత ఏడేళ్లుగా ఈ కేసుపై కోర్టులో వాదనలు జరుగుతున్నా ఏనాడూ కోర్టుకు హాజరుకానీ ఆర్జీవీ ఈ తీర్పుపై ఎలా స్పందిస్తారోనని ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉంటే, అటు ఏపీలోనూ వర్మపై కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్ లో పోస్టు చేశాడని టీడీపీ మండల కార్యదర్శి రామలింగం మద్దిపాడు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై ఏడు సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, తనపై నమోదైన కేసు కొట్టేయాలని వర్మ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం ఆ పిటిషన్‌ను తిరస్కరించింది.

## సినీ ప్రముఖుల కార్యాలయాల్లో మూడో రోజూ కొనసాగుతున్న ఐటీ దాడులు




హైదరాబాద్: హైదరాబాద్‌లో మూడో రోజు గురువారం ఐటీ దాడులు కొనసాగుతున్నాయి. ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు , మైత్రీ మూవీస్, మ్యాంగో మీడియా ఆఫీసుల్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు సోదాలు చేశారు. నిర్మాణ సంస్థల ఆదాయం, పన్ను చెల్లింపు మధ్య తేడా ఉన్నట్లు గుర్తించారు. పలు సంస్థలకు చెందిన వ్యాపార లావాదేవీల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు లాకర్లను కూడా ఐటీ అధికారులు తనిఖీ చేస్తున్నారు. ప్రాథమిక ఆధారాలతో కేసు నమోదు చేశాకే ఈ బృందాలు సోదాలు జరుపుతున్నాయి.

## పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు.. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు



పటాన్‌చెరు అర్బన్: పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు చోటు చేసుకుంది. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా పార్టీలోని ఒక వర్గం హైవేపై ధర్నా చేసింది. పార్టీలో తొలి నుంచి ఉన్న నాయకులను గుర్తించడంలేదంటూ వారు ఆరోపించారు.

మరోవైపు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ కార్యకర్తలు యత్నించారు. వారిని గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ముగ్గురు కార్యకర్తలు మాత్రం ఆఫీసు గోడ దూకి లోపలికి వెళ్లారు. అక్కడి కుర్చీలను ధ్వంసం చేశారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు.

# జనవరి 24...జాతీయ బాలికా దినోత్సవం




జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 24న నిర్వహించ బడుతుంది. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై ఈ బాలికా దినోత్సవం రోజున అవగాహన కల్పిస్తారు. బాలికలపట్ల వివక్ష, అసమానత, చిన్నచూపు, లైంగిక వేదింపులు, అత్యాచారాల నుండి రక్షించడానికి కుటుంబం, మిత్రులు, సమాజం సన్నద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తరువాత అనేక ఆంక్షలు విధిస్తున్నారు. వాటిని నిర్మూలించి ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టిసారించే దిశగా భారత ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్' పేరుతో ఒక కార్యక్రమం రూపొందించింది. అందులో భాగంగా 2008లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంతో జాతీయ బాలికా దినోత్సవంను ప్రారంభించడం జరిగింది. సమాజంలో బాలికలు ఎదుర్కొన్న సమస్యలు గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి జరుపు కుంటారు. బాలిక శిశువు గురించి అసమానత్వం, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్య వివాహంల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్' పేరుతో ఓ కార్యక్రమం తెచ్చింది. బాలికల సంపూర్ణ ఎదుగుదల కోసం రకరకాల సదుపాయాలు కల్పిస్తోంది. వాటిలో భాగమే జాతీయ బాలికా దినోత్సవం. 2008 నుంచీ దీన్ని ఏటా నిర్వహిస్తోంది. సమాజంలో బాలికల సంరక్షణ, వాళ్ల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై ఈ రోజున అవగాహన కల్పిస్తోంది. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక... "బేటీ బచావో బేటీ పడావో" స్కీం తెచ్చారు. తద్వారా బాలికల చదువు, పెంపకంపై మరిన్ని జాగ్రత్తలు తీసుకునేలా చేస్తున్నారు. సమాజంలో మహిళల హోదాను ప్రోత్సహించటానికి జరుపు కుంటారు. బాలికలు సాధారణంగా వారి జీవితంలో ఎదుర్కొనే వివిధ రకాల సాంఘిక వివక్ష, లైంగిక దోపిడీని నివారించడం అత్యవసరం. సమాజంలో మహిళల ప్రాదాన్యత, భాగస్వామ్యం గురించి అవగాహన పెంచడానికి, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, వివిధ రాజకీయ, సామాజిక, స్వచ్ఛంద సంస్థలు బాధ్యులు, సమాన విద్య, ప్రాథమిక స్వేచ్ఛ కోసం వివిధ కార్యక్రమాల ద్వారా వివరించడం జరుగుతుంది. బాలికల కంటే అబ్బాయిలకే ఎక్కువ ప్రాధాన్యత అధికంగా ఇవ్వడం సర్వత్రా వ్యక్తమవు తున్నది. ఇటీవల కాలంలో ఆడపిల్లగా పుట్టడం, పుట్టినా సురక్షితంగా మనుగడ సాగించడమే దుర్భరమైన దురవస్థ ఉంది. చైనా మొదలు అమెరికాతో సహా ఆధునికత వైపు అడుగులు వేస్తున్న భారత్‌లోనూ అమ్మాయిలపట్ల వివక్ష ఉంటుందని గ్లోబల్ ఎర్లీ అడలెసెంట్ స్టడీ పేరిట నిర్వహించిన ఒక అధ్యయనంలో భాగంగా... అమ్మాయిలు పదహారేళ్ల వయసుకు చేరుకున్నప్పటికీ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాన్‌హాఫ్‌కిన్స్ బ్లూమ్ బెర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కిడ్స్ సంయుక్తంగా 15 దేశాల్లో నిర్వహించిన సర్వేలో అమ్మాయిలు శారీరకంగా బలహీనులనే విషయం... చిన్న వయసులోనే ముద్ర పడేలా చేయడంలో తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, టీచర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తేలింది.

**చిన్నారులపై లైంగిక వేధింపులు...** నేడు మహిళా సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగం నిత్యం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా మైనర్లపై అత్యాచారాలు ఆగడంలేదు. సమాజంలో అమ్మాయిలు, మహిళలకు రక్షణ కరువ వుతున్నది. ఎంతోమంది ఆడ పిల్లలు ఈ లోకంలో అడుగుపెట్టక ముందే బలవంతపు మరణాలకు బలవు తున్నారు. ఆధునిక పరిజ్ఞానం ఎంత పెరిగినా మానవతా విలువలు మాత్రం పెరగడం లేదు. దానికి నిదర్శనం భ్రూణ హత్యలు. గర్భస్త శిశువుల లింగ నిర్ధారణను నిషేధించి తద్వారా ఆడపిల్లల భ్రూణ హత్యలు నివారణ కోసం 1994లోనే చట్టం తెచ్చినా అది ఏనాడూ పకడ్బందీగా అమలైన జాడలు లేవు. దేశంలో నానాటికీ అడపిల్లల సంఖ్య తగ్గిపోతూ, కొనసాగితే చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందనేది కాదన లేని వాస్తవం. ఇదే కాక ప్రపంచంలో జరుగుతున్న బాల్య వివాహాల్లో 40% పైగా భారతదేశం లోనే జరుగుతున్నాయని ఇటీవలే యూనిసెఫ్ గణాంకాలను వెల్లడించింది. బాలికల ఉన్నత విద్య మరో సమస్యగా మారింది, ఇప్పటికి అధిక రాష్ట్రాల్లో 40%నికి పైగా పదో తరగతి కంటే ముందే బడి మాని వేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేసినా ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ తగ్గడంలేదు. బాల్య వివాహం కారణంగా రాష్ట్రంలోని 28 శాతం మంది బాలికలకు పద్దెనిమిది సంవత్సరంలోపే వివాహాలు చేస్తున్నారు. యునెస్కో వెలువరించిన ప్రపంచ విద్య నివేదిక ప్రకారం భారత దేశంలో వయోజన నిరక్షరాస్యులలో మహిళలు 68 శాతం వున్నారు. పంతొమ్మిది ఏళ్లు నిండక ముందే దాంపత్య జీవితంలో అడుగు పెడుతున్నారు. బాలికల సంఖ్య 41 శాతం అని జనగణనలో తేలింది. బాల్య వివాహాలు, పాఠశాలలు చేరువ, అందుబాటులో పూర్తి స్థాయిలో లేకపోవడం, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల కొరత, లైంగిక విచక్షణ వంటి సమస్యలు భారతావనిలో బాలిక విద్యకు శాపంగా పరిణ మించింది. పోషకాహార లోపం కారణంగా రక్తహీనతతో బాధపడుతున్న బాలికల సంఖ్య దేశంలో దాదాపు డెబ్బై శాతం అన్న అంచనాలు తీవ్రంగా కలవర పరుస్తున్నాయి. మహిళా కార్మిక శక్తి, వారి ఆదాయం, అక్షరాస్యాత స్థాయి, జననాల విషయం, తదితర అంశాల్లో అధమస్థాయిలో వున్న 20 దేశాల్లో మన దేశం ఒకటి కావడం ఆందోళనకర అంశం. మహిళలు పురుషులకన్నా ఎందులోనూ తక్కువ కాదు. ఆడపిల్లలు ప్రతి రంగంలో, చదువులో మొదలుకుని ఆటల దాకా, రాణిస్తున్నారు. పురుషులతో పోటీ పడుతున్నారు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియ చేయడమే కాకుండా, ఆ సమస్యలు పరిష్కరించ బడినప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగ పడుతున్నది. ఆడపిల్లలకి తప్పనిసరి అవసరమైన భద్రత, సాంకేతిక విజ్ఞానాన్ని సేవల్ని అందుబాటులో వుంచాలి. బాలికలను విద్యావంతులను చేసి, బాల్య వివాహాలు తగ్గించడంలో, విద్యను అభ్యసించిన బాలికలు అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందడంలో మార్గదర్శకంగా నిలవడం ద్వారా మహిళత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కూడా సహాయ పడు తున్నది. ప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహాల్లో నలభై శాతంకి పైగా భారత్‌లోనే జరుగుతున్నాయన్న చేదు నిజాన్ని యునిసెఫ్ స్పష్టం చేసింది. సమాజంలో చైతన్యం నింపాలంటే ముందు మహిళ జాగృతం కావాలి. స్త్రీ కళ్లు తెరిస్తే కుటుంబం, దానితో పాటు గ్రామం, రాష్ట్రం, దేశం పురోగతి బాట పడతాయి' అని భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గతంలో చేసిన వ్యాఖ్యలు గుర్తుంచు కోవాలి. కౌమారదశలో ఆడపిల్లలు, యువతులు ఎదుర్కొనే వివిధ రకాల హింసను అంతం చేయాలి. బాలికలు వారి చట్టపరమైన హక్కులు మరియు జీవిత వాస్తవాలను గురించి తెలుసు కోవాలి. వారు మంచి విద్య, పోషణ, ఆరోగ్య సంరక్షణ హక్కులను కలిగి ఉంటారని అవగాహన కల్పించాలి. గృహ హింస చట్టం 2009, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 నిషేధించడం మరియు కట్న నిషేధ చట్టం 2006 వంటి చట్టాల గురించి వారి సరైన హక్కులు పొందడానికి మరియు జీవితంలో అన్ని సవాళ్లను ఎదురుకొని ముందుకు వెళ్ళాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**



# 2025: మహాకుంభమేళా.. 10 కోట్లకు పైగా భక్తుల పుణ్యస్నానాలు

ప్రయాగ్‌రాజ్: ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కళకళలాడుతోంది. ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు.

ఇప్పటివరకు త్రివేణి సంగమంలో 10 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పుణ్యస్నానాలపై ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతోందని తెలిపింది. ఇప్పటివరకు త్రివేణి సంగమంలో 10 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని వెల్లడించింది. గురువారం మధ్యాహ్నం వరకు 30 లక్షల మంది పుణ్యస్నానాలు చేసినట్లు తెలిపింది. మకర సంక్రాంతి రోజు దాదాపు 3.5 కోట్ల మంది సంగమంలో స్నానాలు ఆచరించారు. 1.7 కోట్ల మంది పౌష్ పూర్ణిమ వేడుకలో పాల్గొన్నారు. దీంతో పండుగల వేళలో స్నానాల ప్రదేశంలో భక్తుల సంఖ్యపై పరిమితులు విధించింది. మిగిలిన రోజుల్లో ఎలాంటి ఆంక్షలు అమలులో ఉండవు. అయితే.. ఈ సారి కుంభమేళాకు 45 కోట్ల మందికి పైగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటివరకు 10 కోట్ల మందికి పైగా భక్తులు వచ్చినట్లు తెలుస్తోంది. జనవరి 13న మొదలైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనుంది.

విదేశాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ కార్యక్రమం 12 లక్షల తాత్కాలిక ఉద్యోగాలు సృష్టించింది. తాత్కాలిక వైద్య శిబిరాలతో 1.5 లక్షల మంది నర్సులు, పారామెడిక్స్, ఇతర వైద్య సిబ్బందికి అవకాశాలు లభించాయి.

# జనవరి 24... జాతీయ గీతంగా జనగణమన స్వీకరణ

భారత జాతీయ గీతంగా జనగణమన 1911లోరవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన, మొదటిసారి పాడిన గీతాన్ని 1950 జనవరి 24న రాజ్యాంగ సభ స్వీకరించిన రోజు. జనగణమన భారత జాతీయగీతం. నోబెల్ బహుమతి గ్రహీత, రవీంద్రనాథ్ టాగోర్ రాసిన బెంగాలీ గీతం లోని మొదటి భాగం ఇది. భారత జాతీయగీతం సంస్కృత పద భూయిష్టమైన బెంగాలీ భాషలో ఉంది. 1911 డిసెంబర్ 27 న కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో మొదటి సారిగా పాడారు. 1912 జనవరి లో ఈ గీతాన్ని "తత్వ భోదిని" అనే పత్రిక "భారత విధాత" అనే పేరుతో ప్రచురించింది. 1950 జనవరి 24 న జాతీయగీతంగా రాజ్యాంగ సభ స్వీకరించింది. ఈ గీతానికి సంగీత బాణీ కూడా ముందుగా ఠాగూర్ సృష్టించారు. బాణీ కనుగుణంగా ఈ గీతాలాపన చేసేందుకు 52 సెకండ్లు పడుతుంది. అప్పుడప్పుడు మొదటి, చివరి పాదాలను మాత్రమే పాడే పద్ధతి కూడా ఉంది. దీనికి 20 సెకండ్లు పడుతుంది. భారతదేశ జాతీయగీతం 'జనగణమన' గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నిజానికి 1911లోనే రాశారు. అదే ఏడాది డిసెంబర్ 27న కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో కూడా దానిని ఆలపించారు. ఆ తర్వాత కూడా జాతీయోద్యమం నేపథ్యంలో ఆ గీతాన్ని అనేక సార్లు, అనేక వేదికల మీద ఆలపించారు. అయితే ఇప్పుడు మనం వినే ట్యూన్‌లో కాకుండా, నిర్దిష్టమైన స్వర కల్పన లేకుండా, ఎవరికి నచ్చిన రాగంలో వాళ్లు పాడుకునే వారు. జనగణమనకు ఆ స్వరాన్ని కట్టింది ఒక ఐరిష్ జాతీయురాలైతే... దానికి వేదికైంది చిత్తూరు జిల్లా మదనపల్లె అనే విషయం చాలా మందికి తెలియని తెలియదు. భారత స్వాతంత్రోద్యమాన్ని బలపరిచిన డాక్టర్ అనీబిసెంట్ మదనపల్లెలో థియోసాఫికల్ కాలేజీని స్థాపించారు. ఐరిష్ జాతీయుడైన ప్రముఖ విద్యావేత్త జేమ్స్ హెన్రీ కజిన్స్ దాని ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. లండన్ మ్యూజిక్ కాలేజిలో చదువుకున్న ఆయన భార్య మార్గరెట్ కజిన్స్ అక్కడ సంగీతాన్ని నేర్పించేవారు. 1919లో దక్షిణ భారతదేశ పర్యటనలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ ఒకరోజు బెంగళూరు చేరుకున్నారు. అక్కడ ఉన్నపుడే ఆయనకు మదనపల్లె వాతావరణం, జేమ్స్ కజిన్స్ కవిత్వం అంటే చాలా ఇష్టమైన ఠాగూర్, కజిన్స్ అక్కడే ఉన్న విషయం తెలుసుకుని, ఆయన విశ్రాంతి కోసం మదనపల్లెలోని థియోసాఫికల్ కాలేజీ చేరుకున్నారు. ఠాగూర్‌కు ప్రశాంత వాతావరణం కలిగిన థియోసాఫికల్ కాలేజీలో ప్రతి బుధవారం భోజనాల తర్వాత విద్యార్థులంతా కలిసి పాటలు పాడేవాళ్లు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఠాగూర్, ఒక కార్యక్రమంలో పాల్గొని, ఆ సందర్భంగా ఆయన స్వయంగా తన గొంతుకతో జనగణమన ఆలపించారు. ఠాగూర్ కంఠస్వరం నుంచి వెలువడిన ఆ పాటకు విద్యార్థులంతా గొంతు కలిపారు. మార్గరేట్ కజిన్స్ కూడా ఆ సమయంలో అక్కడే ఉండి, పాటలోని దేశభక్తిని, జాతీయ భావాన్ని గమనించారు. కానీ అప్పటికి జనగణమనను ఎవరికి వారే తోచిన రీతిలో పాడుకునే వారు. ఎవరూ రాగయుక్తంగా పాడ లేదు. కనుక దానిని తానే స్వరబద్ధం చేయాలని నిర్ణయించు కున్నారు. తెల్లవారి ఆమె ఠాగూర్‌ను కలిసి జనగణమనను స్వరబద్ధం చేయాలన్న తన కోరికను వెలిబుచ్చారు. దీనికి అంగీకరించిన ఠాగూర్, ఆమెకు ఆ పాట అర్థాన్ని వివరించారు. దానికి స్వరం ఎలా ఉంటే బాగుంటుందో సూచించారు. తర్వాత మార్గరేట్ కజిన్స్ తన విద్యార్థినుల సహాయంతో ప్రతి పదానికి అర్థం తెలుసుకుంటూ దానికి. బాణీ సమకూర్చారు. తర్వాత ఠాగూర్‌కు తాను కట్టిన స్వరాన్ని వినిపించారు. కొన్ని చిన్న చిన్న సంగీత పరికరాలతో విద్యార్థులు రాగయుక్తంగా పాడిన జనగణమన గీతాన్ని విన్న ఠాగూర్ ఆమెను ఎంతగానో అభినందించారు. బెంగాల్‌లో పుట్టిన జనగణమన గీతం మదనపల్లెలో స్వరాన్ని సమకూర్చు కున్నది. రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లెలో ఉన్న సమయంలోనే ఒక ఉదయాన థియోసాఫికల్ కాలేజీ ప్రాంగణం లోని చెట్టుకింద కూర్చుని జనగణమనను ఆంగ్లం లోనికి అనువదించారు కూడా. ఆ తర్వాత దానిని తన అందమైన చేతిరాతతో రాయడమే కాకుండా, కింది భాగంలో దాని పేరు 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' అని రాశారు. దాని కింద ఫిబ్రవరి 28, 1919 అని రాసి, సంతకం చేసి, మార్గరేట్ కజిన్స్‌కు బహుమానంగా ఇచ్చారు. మదనపల్లె కాలేజీ వదలివెళ్లే ముందు ఠాగూర్ దానిని 'దక్షిణ భారతదేశపు శాంతినికేతన్' అని కీర్తించారు. నిజానికి జనగణమన దేశభక్తి గేయం. 'జన గణ మన' ఇక నుంచీ మన కొత్త గణతంత్ర రాజ్యానికి జాతీయ గీతమనీ, దీన్ని అంతా గౌరవించి ఆదరించాలనీ 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఓ ప్రకటన చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహోన్నత పాత్ర పోషించిన 'వందేమాతరం' గీతాన్ని కూడా జన గణ మనతో సమానంగా గౌరవించి ఆదరించాలి" అని ఆ రోజున రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. భారతదేశ రాజ్యాంగం ఆర్టికల్ 51ఏలో ఈ గీతాన్ని గౌరవించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేసిన ప్రస్తావన కనిపిస్తుంది. "ప్రతి పౌరుడూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. జాతీయ పతాకం, జాతీయ గీతం వంటి రాజ్యాంగ ఆదర్శాలు, లక్ష్యాలు, సంస్థలను గౌరవించాలి" అని ఈ చట్టం పేర్కొంటున్నది. ప్రార్థనగా, కృతజ్ఞతగా పఠించే 52 సెకన్ల ఈ చిన్న గీతానికి ఉన్నంత గుర్తింపు, భారత దేశంలో, ప్రపంచంలో కూడా మరే గీతానికీ లేదు. మన జాతీయ గీతం దేశ సమైక్యతకు సరైన ప్రతీకగా నిలిచింది. జాతీయ గీతం, జాతీయ పతాకం పట్ల గౌరవం, ప్రేమాభిమానాలు ప్రదర్శించడమంటే మాతృభూమిని గౌరవించు కోవడమే అవుతుంది. ఇది ప్రతి ఒక్కరిలో దేశభక్తిని, జాతీయ భావాన్ని నింపడానికి ఉపకరిస్తుంది. జనగణమన పాడినప్పుడు దాని అర్థాన్ని కూడా ఒక్కసారి మననం చేసుకోవాలి. దాని నేపథ్యాన్ని, అర్థాన్ని, ప్రాధాన్యతను గుర్తించి, తర్వాత తరం వారికి చేర్చాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## జాతీయ గీతం

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్య విధాతా!
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా
ద్రావిడ, ఉత్కళ, వంగ!
వింధ్య, హిమాచల, యమునా, గంగ
ఉచ్ఛల జలధితరంగ!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాగే!
గాహే తవ జయ గాథా!
జనగణ మంగళ దాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!

# తెలుగు సినిమా స్వర్ణయుగ రారాణి కృష్ణకుమారి - జనవరి 24... కృష్ణకుమారి వర్ధంతి



కృష్ణకుమారి (మార్చి 6, 1933 – జనవరి 24, 2018) పాత తరం సినిమా కథానాయిక. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో సుమారు 25 సంవత్సరాలకు పైగా 150 పై చిలుకు చిత్రాల్లో నటించారు. మూడు జాతీయ పురస్కారాలు, రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారాలు అందుకున్నారు. సావిత్రికి సమకాలీన నటి అయిన ఆమె షావుకారి జానకికి సొంత చెల్లెలు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్,, కృష్ణ, శివాజీ గణేశన్ వంటి దిగ్గజాలతో ఆమె అనేక సినిమాల్లో నటించారు. పశ్చిమ బెంగాల్ లోని నైహతిలో ఓ తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో 1933లో జన్మించారు కృష్ణ కుమా రి. వెంకోజి రావు –.సచీ దేవి ఆమె తల్లిదండ్రులు. ఆంధ్ర ప్రదేశ్ లోని రాజమండ్రి వీరి స్వస్థలం. వేదాంతం జగన్నాథ శర్మ దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. ఒకసారి ఆమె తల్లితో సహా స్వప్న సుందరి సినిమా చూడడానికి వెళితే అక్కడకి సౌందరరాజన్ గారి అమ్మాయి భూమాదేవి కూడా వచ్చింది. సినిమా హాల్లో కృష్ణ కుమారిని చూసిన ఆమె నవ్వితే నవరత్నాలు సినిమా కోసం అమా యకంగా కనిపించే కథా నాయిక కోసం వెతుకుతున్నట్లు చెప్పారు. తర్వాత రోజే వారు కృష్ణ కుమారి ఇంటికి వచ్చి తల్లిదండ్రుల అను మతి తీసుకొని ఆమెకు ఆ పాత్ర నిచ్చారు. అలా తెలుగు సినిమా తెరకు 1951 లో నిర్మించిన నవ్వితే నవరత్నాలు సినిమా ద్వారా పరిచయం అయ్యా రు. కానీ దానికంటే ముందు మంత్ర దండం అనే సినిమా విడుదలైంది. తొలి చిత్రంలో నటిస్తుండగానే ఆమెకు 14 సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. అప్పటికి ఆమె వయసు కేవలం 16 ఏళ్ళు మాత్రమే. తర్వా త 1953లో తాతినేని ప్రకాశరావు యన్.ఎ.టి.వారి పిచ్చి పుల్లయ్యలో కథానాయిక వేషం వేయించారు. అందులో మంచి నటన ప్రదర్శించిన కృష్ణకుమారికి పినిశెట్టిగారి పల్లె పడుచు, బంగారు పాప వంటి మంచి చిత్రాలతో పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. జానపద చిత్రాల కథానాయికగా, అభినయ రాజకుమారిగా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సొంతం చేసుకున్నారు నటి కృష్ణకుమారి. అసమాన నటన తో ఎన్నో వైవిధ్యమైన పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేసిన ఆమె తెలుగు చిత్రసీమలో విలక్షణ నటిగా తనకంటూ ప్రత్యేకతను చాటు కున్నారు. తరువాత ఇలవేల్పు, జయ విజయ, అభిమానం, దేవాం తకుడు మొదలైన చిత్రాలలో వివిధ కథానాయకుల సరసన నటించినా, తన నటనకు గుర్తింపుతెచ్చిన చిత్రా లు కె.ప్రత్యగాత్మగారి భార్యాభర్తలు (1961), కులగోత్రాలు (1962). 1963లో లక్షాధికారి, బందిపోటు, ఎదురీత, కానిస్టేబుల్ కూతురు చిత్రాల్లో వైవిధ్యం ఉన్న పాత్రలు వేశారు. ప్రభుత్వ బహుమతి పొందిన జగపతీ పిక్చర్స్ వారి అంతస్థులులో నాయికగా నటిం చారు. 1967–68 మధ్య కాలంలో ఉమ్మడి కుటుంబం, భువన సుందరి కథ, రహస్యం, చిక్కడు దొరకడు, స్త్రీ జన్మ వంటి చిత్రాలలో వైవిధ్యమున్న పాత్రలు పోషించారు. వరకట్నంలో నాయికగా గ్లామరస్ పాత్ర తర్వాత చిత్రాలు తగ్గి 1970 దశాబ్దంలో కొన్ని చిత్రాలలో నటించ గలిగారు. సుమారు రెండు దశాబ్దాల నట జీవితంలో ఆమె సుమారు 150 సినిమాలలో నటించారు. వాటిలో ఎక్కువగా తెలుగు సినిమాలైతే, 15 కన్నడ చిత్రాలు, కొన్ని తమిళ భాషా చిత్రాలు. మూడు భాషల చిత్రా ల్లోనూ ఆమే స్వయంగా డబ్బింగ్ చెప్పు కోవడం విశేషం. ఆమె ఆనాటి నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వర రావు, కాంతారావు, కృష్ణంరాజు, జగ్గయ్య, హరనాథ్, అందరు మహా నటులతోను నటించి మెప్పించారు. కాంతారావుతో కలిసి 28 జానపద చిత్రాల్లో నటించారు. 1963 లో కృష్ణ కుమారి 16 సినిమాల్లో కథానాయి కగా నటించారు. ఒక్క ఏడాదిలో అత్యధిక సినిమాల్లో కథానాయికగా నటించడంలో ఆమె రికార్డు ఇప్పటికీ పదిలంగా ఉంది. ఇందు కోసం ఆమె మూడు నెలలపాటు మూడు షిఫ్టులు ఖాళీ లేకుండా పనిచేశారు. బాలీవుడ్ లో కిశోర్ కుమార్ తో ఒకే ఒక సినిమాలో కథానాయికగా నటించారు. అప్పటికి హిందీ చిత్ర పరిశ్రమలో కృష్ణకుమారి పేరుతో వేరే నటి ఉండటంతో రతి అనే పేరుతో పరిచయం అయినారు. వద్దంటే పెళ్లి, గంగా గౌరీ సంవాదం, సతీ సుకన్య, రమా సుందరి, జయ విజయ, పెళ్లి కానుక, దేవాంత కుడు, వినాయక చవితి, ఇరుగు పొరుగు, అగ్గిపిడుగు, మర్మయోగి, ఉమ్మడి కుటుంబం, లక్షాధికారి, బందిపోటు, బంగారు భూమి, గుణవంతుడు, జేబుదొంగ, యశోద కృష్ణ, దేవదాసు, నేరము శిక్ష, మానవుడు దానవుడు, భార్య బిడ్డలు, తల్లా పెళ్లామా, శ్రీకృష్ణావ తారం, అంతస్తులు, గుడి గంటలు, డాక్టర్ చక్రవర్తి, చదువుకున్న అమ్మా యిలు ఎదురీత, కులగోత్రాలు, భార్యాభర్తలు, శభాష్‌రాజా, దీపా వళితో పాటు పలు సినిమాలు ఆమె నటనా ప్రతిభకు తార్కా ణాలుగా నిలిచాయి. ఇండియన్ ఎక్స్ ప్రెస్ మాజీ ఎడిటర్, స్క్రీన్ మేగజైన్ వ్యవ స్థాపకులు, బిజినెస్ మాన్ అయిన కర్ణాటకకు చెందిన అజయ్ మోహన్ కైతాన్ ను కృష్ణ కుమారి పెళ్లి చేసు కున్నారు. ఆమెకు చిన్నప్పటి నుండి భానుమతి అంటే చాలా ఇష్టం. ఆమెతో కలిసి కులగోత్రాలు, పుణ్య వతి సినిమాల్లో నటించినప్పుడు ఎంతో థ్రిల్ ఫీలయ్యానని, మహా నటి సావిత్రి తనను స్వంత చెల్లెల్లా చూసుకొనేదని చేపుతుండే వారు. ఆమెకు మూడుసార్లు జాతీయ అవార్డులు, రాష్ట్రస్థాయిలో నంది అవార్డులు వచ్చాయి. ఆమె కాంచన మాల, సావిత్రి, ఎన్టీయార్ అవార్డులు గెలుచుకున్నారు. బ్రిటన్ లోని బర్మింగ్ హాం సంస్థ వారి లైఫ్ టైం అచీవ్?ట్ అవార్డు పొందారు. కృష్ణ కుమారి 2018, జనవరి 24 ఉదయం బెంగుళూరులో అనారోగ్యంతో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


చురకలు

# సంపాదకీయం

## ఏమిటీ స్టార్ గేట్ ప్రాజెక్టు.. ఇందులో పెట్టే పెట్టుబడుల లెక్క తెలుసా?

ఇప్పుడు చెప్పే 'స్టార్ గేట్' రాబోయే రోజుల్లో అదే పనిగా వినిపించటమే కాదు.. ఎన్నో అద్భుతాలకు వేదికగా మారినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. ఎందుకంటే.. కృత్రిమ మేధస్సుకు పెద్దపీట వేసేందుకు వీలుగా ఒక బాహుబలి కంపెనీని క్రియేట్ చేస్తున్నారు అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్. దీనికోసం పెడుతున్న పెట్టుబడుల విలువ ఎంతో తెలుసా? అక్షరాల రూ.43 లక్షల కోట్లు. డాలర్లలో చెప్పాలంటే 500 బిలియన్ డాలర్లు. తాజాగా ట్రంప్ 2.0 సర్కారు స్టార్ గేట్ కు ఓకే చెప్పింది. ఇందులో సాఫ్ట్ బ్యాంక్.. ఓపెన్ ఏఐ.. ఒరాకిల్ సంస్థల అధిపతులతో వైట్ హౌస్ లో ప్రత్యేక భేటీని నిర్వహించారు ట్రంప్. కృత్రిమ మేధస్సును మరింత విస్తృతం చేయటానికి.. లక్ష ఉద్యోగాల్ని క్రియేట్ చేసేందుకు వీలుగా ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో ప్రాథమికంగా 100 బిలియన్ డాలర్లు పెడతారు. మన రూపాయిల్లో రూ.8.6లక్షల కోట్లు. రానున్న నాలుగేళ్లలో ఈ పాజెక్టు కోసం పెట్టే పెట్టుబడి ఏకంగా రూ.43 లక్షల కోట్లు. ఈ ప్రాజెక్టుతో చైనా కంటే మిన్నగా కృత్రిమ మేధస్సు ను వృద్ధి చేయాలన్నది ట్రంప్ ఆలోచన. స్టార్ గేట్ పేరుతో ఏర్పాటు అయ్యే ఈ కొత్త కంపెనీ ఏఐ మౌలిక సదుపాయాల ఏర్పాటు మీద ఫోకస్ పెట్టనుంది. దీని ద్వారా ప్రముఖ టెక్ కంపెనీలు అమెరికాలోని డేటా సెంటర్లలో పెట్టుబడులుపెట్టేలా ప్రోత్సహిస్తారు. దిగ్గజ కంపెనీలైన ఒరాకిల్.. సాఫ్ట్ బ్యాంక్.. ఓపెన్ ఏఐలతో కలిసి ట్రంప్ ఏర్పాటు చేయిస్తున్న ఈ కొత్త కంపెనీ భవిష్యత్తు కృత్రిమ మేధస్సు అంశాలకు కేరాఫ్ అడ్రస్ గా మారుతుందన్న మాట వినిపిస్తోంది. స్టార్ గేట్ కంపెనీలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ఒరాకిల్.. సాఫ్ట్ బ్యాంక్.. ఓపెన్ ఏఐలు కూడా నిధులు సమకూరుస్తాయి. మరిన్ని కంపెనీలు కూడా ఈ సంస్థలో చేరే వీలుంది. అమెరికాలో కృత్రిమ మేధస్సు మౌలిక సదుపాయాల్ని భారీగా పెంచేటయంతో పాటు.. ఈ రంగంలో ఇతర దేశాల కంటే మిన్నగా మారటం కూడా ఒక లక్ష్యం. ఈ కంపెనీ ఏర్పాటుకు సంబంధించిన అధికారిక మీడియా సమావేశంలో మాట్లాడిన ట్రంప్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తానురియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నానని.. తనకు భూమి విలువ తెలుసన్నారు. ఏఐ డేటా సెంటర్ల భవనాలు కూడా చాలా విలువైనవని.. ఎంతోమందికి ఉపాధిని అందిస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఏమైనా అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రెండో రోజే ఇంత భారీ ప్రాజెక్టుకు తెర తీయటం ట్రంప్ నకు మాత్రమే సాధ్యమవతుందన్న మాట వినిపిస్తోంది.


## భారతదేశ అణుశక్తి పితామహుడు హోమీ బాబా - జనవరి 24...హోమీ జహంగీర్ భాభా వర్ధంతి




హోమీ జహంగీర్ భాభా (1909–1966) భారతదేశ శాస్త్ర రంగానికి, అణుశక్తి అభివృద్ధికి అత్యంత విలువైన సేవలు అందించిన గొప్ప శాస్త్రవేత్త. ఆయన భారతదేశాన్ని అణుశక్తి రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర పోషించి, "భారత అణుశక్తి పితామహుడు"గా గుర్తింపు పొందారు. హోమీ జహంగీర్ భాభా 1909 అక్టోబర్ 30న ముంబైలో ఒక సంపన్న పార్సీ కుటుంబంలో జన్మించారు. తండ్రి జెహంగీర్ హొర్ముస్‌జీ భాభా, ఒక ప్రముఖ న్యాయవాది. తల్లి మీహర్‌బాయి, కళలపట్ల గొప్ప ఆసక్తి కలిగి ఉండేవారు. కుటుంబం విద్యకు ప్రాముఖ్యతనిచ్చింది, ఇది భాభా వ్యక్తిత్వం అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించింది. భాభా చిన్నతనం లోనే శాస్త్రానికి ఆసక్తి కనబరిచారు. కుటుంబం నుంచి వచ్చిన ప్రోత్సాహంతో, ఇంజినీరింగ్ విద్య కోసం ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయానికి వెళ్లారు. భాభా కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రాన్ని అభ్యసించి, భౌతిక శాస్త్ర రంగంలో అద్భుతమైన పరిశోధనలు చేపట్టారు. భాభా–హీట్లర్ సిద్ధాంతం: కాస్మిక్ రేడియేషన్‌పై ఆయన చేసిన అధ్యయనాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. భౌతిక శాస్త్రంలో చేసిన ఈ పరిశోధనలు, ప్రతిభను ప్రదర్శించడంతో పాటు, భవిష్యత్తులో ఆయనకు మార్గదర్శకంగా నిలిచాయి. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత భాభా దేశంలోని శాస్త్ర అభివృద్ధికి పెద్ద అడుగు వేశారు. 1945లో ఆయన టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌ను స్థాపించారు. ఇది శాస్త్రవేత్తల కోసం పరిశోధన కేంద్రంగా మారింది. TIFR ను భౌతిక శాస్త్రం, అణు శక్తి, మరియు ఖగోళ శాస్త్రంలో ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చేశారు. 1948లో స్థాపించబడిన ఆటామిక్ ఎనర్జీ కమిషన్కు భాభా అధ్యక్షత వహించారు. ఈ కమిషన్ ద్వారా భారతదేశం శాంతియుత అవసరాల కోసం అణుశక్తిని వినియోగించుకోవడం ప్రారంభించింది. ట్రాంబేలో ఆయన ఆధ్వర్యంలో అణు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయబడింది. ఇది తర్వాత భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్గా పునర్నామీకరించబడింది. భాభా భారతదేశాన్ని అణుశక్తి రంగంలో గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దే దిశగా పనిచేశారు. ఆయన ప్రతిపాదించిన త్రిస్థాయి ప్రణాళికలో యురేనియం, థోరియం వంటి శక్తి వనరుల వినియోగం ప్రధానంగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి, వైద్యం, మరియు పరిశ్రమల అభివృద్ధిలో అణుశక్తిని వినియోగించేందుకు ఆయన ప్రాధాన్యతనిచ్చారు. విదేశీ ఆధారాన్ని తగ్గించి, స్వదేశీ శక్తి, మరియు సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యతనిచ్చారు. భాభా శాస్త్రవేత్తగా మాత్రమే కాకుండా ఒక సంపూర్ణ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా ప్రసిద్ధి చెందారు. ఆయనకు సంగీతం, చిత్రలేఖనం, మరియు కళలపై ప్రత్యేక ఆసక్తి ఉంది. భాష పట్ల ఆయనకు ఉన్న ఆసక్తి ఆయనను ఆంగ్లం, ఫ్రెంచ్, మరియు ఇతర భాషల్లో నిపుణుడిగా మార్చింది. 1966 జనవరి 24న స్విట్జర్లాండ్‌లో జరిగిన విమాన ప్రమాదంలో భాభా మరణించారు. ఆయన మరణం భారత శాస్త్రరంగానికి తీరని నష్టం. ఆయన స్థాపించిన సంస్థలు (TIFR మరియు BARC) భారతదేశ శాస్త్ర రంగానికి కీలక కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. హోమీ జహంగీర్ భాభా భారతదేశ శాస్త్రరంగంలో తారగా నిలిచారు. ఆయన కలలైన అణుశక్తి రంగంలో స్వయం సమృద్ధి భారతదేశాన్ని ప్రపంచంలో ప్రధాన స్థానంలో నిలిపింది. భాభా శ్రద్ధ, పట్టుదల, దూరదృష్టి భారత శాస్త్ర రంగానికి మార్గనిర్దేశం చేస్తూ, దేశ అభివృద్ధికి చిరస్థాయిగా ప్రేరణనిస్తుంది. "హోమీ జహంగీర్ భాభా పేరు భారత శాస్త్రరంగ చరిత్రలో సుదీర్ఘకాలం వెలుగొందుతుంది."

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## అంతర్జాతీయ విద్యా దినోత్సవం - విశ్వవ్యాప్త విద్యకు ఊతం - జనవరి 24....అంతర్జాతీయ విద్యా దినోత్సవం




ప్రతి సంవత్సరం జనవరి 24న జరుపుకునే అంతర్జాతీయ విద్యా దినోత్సవం విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించేందుకు, ప్రపంచానికి చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రత్యేకమైన రోజు. ఈ దినోత్సవాన్ని 2018 డిసెంబరు 3న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ నిర్ణయించింది. ప్రజల శ్రేయస్సు, సమానత్వం, శాంతి, అభివృద్ధి వంటి మానవతా విలువల సాధనకు విద్య ముఖ్యమైన సాధనంగా నిలుస్తుందని ఈ దినోత్సవం చాటిచెబుతుంది. విద్య అంటే కేవలం పుస్తకాలు చదవడం లేదా పట్టాలు పొందడమే కాదు. ఇది వ్యక్తి జీవితానికి విలువలను, సామాజిక బాధ్యతలను, విజ్ఞానాన్ని అందించే సాధనం. విద్య వ్యక్తి వ్యక్తిత్వాన్ని మెరుగుపరచి సమాజంలో సాంకేతికత, ఆర్థిక, మరియు సామాజిక రంగాలలో దోహదం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. విద్యా లేమి పేదరికానికి కారణమైతే, విద్య అనేది దాని పరిష్కారానికి ప్రధాన మార్గం. లింగ వివక్ష లేకుండా బాలురు, బాలికలందరికీ సమాన విద్యా అవకాశాలు కల్పిస్తుంది. గౌరవం, సహనం, సహకారం వంటి విలువలను బోధించడంతో, అది శాంతియుత సమాజాల నిర్మాణానికి తోడ్పడుతుంది. అంతర్జాతీయ విద్యా దినోత్సవం పలు ప్రధాన లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తుంది: పిల్లలు, యువతలు, పెద్దవారికి కూడా సమాన విద్యావకాశాలను కల్పించడం. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యను నాణ్యంగా మార్చడం. చిన్న వయస్సు నుంచే బాలికలకు కూడా సమాన విద్యను అందించేందుకు శ్రద్ధ చూపడం. విద్యా వ్యవస్థలను మెరుగుపరచి సమాజానికి సేవ చేయడంలో వాటి సామర్థ్యాన్ని పెంచడం. యునెస్కో నివేదికలు సూచించినట్లుగా, ఇంకా 244 మిలియన్ల మంది పిల్లలు, యువత ప్రాథమిక విద్యకు దూరంగా ఉన్నారు. ముఖ్యంగా పేద దేశాల్లో బాలికలు విద్యకు దూరమవుతున్నారు. పేదరికం, నిరుద్యోగం, మరియు సామాజిక అసమానతలు విద్య లేకపోవడం వల్ల మరింత పెరుగుతున్నాయి. అంతర్జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా అనేక సంస్థలు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు విశేష కార్యకలాపాలు నిర్వహిస్తాయి. విద్యకు సంబంధించిన సమస్యలపై మరియు పరిష్కార మార్గాలపై చర్చించ బడుతుంది. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వారి ప్రతిభను ప్రదర్శిస్తారు. పేద పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ చేయడం, వారి కోసం శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. విద్యా హక్కు గురించి ప్రజలలో అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తారు. 2030 దిశగా లక్ష్యాలు :అందరికీ నాణ్యమైన విద్యను అందించడం. పేదరికం మరియు లింగ అసమానతలను తగ్గించడం. సాంకేతికత ద్వారా విద్య: ఇ–లెర్నింగ్ మరియు ఆన్‌లైన్ విద్యా విధానాలను ప్రోత్సహించడం. విద్యా పునాదులను బలపరచడం ద్వారా సామాజిక సమస్యలను పరిష్కరించడం. అంతర్జాతీయ విద్యా దినోత్సవం విద్యకు ఉన్న విశేషమైన ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. ఈ దినం మనకు ఒక గుర్తు %–% ప్రతి ఒక్కరికీ విద్య అందించే కర్తవ్యాన్ని గుర్తించడం. విద్య అనేది కేవలం వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా ప్రపంచ శ్రేయస్సుకు మార్గదర్శిగా నిలుస్తుంది. "విద్య అంధకారాన్ని తొలగించే దీపం, జ్ఞానాన్ని వెలిగించే కాంతి." అందుకే, ప్రతి ఒక్కరం విద్యకు ప్రాధాన్యం ఇచ్చి, ఆ వెలుగును ప్రపంచమంతా విస్తరించాలనే దిశగా ముందుకు సాగుదాం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

## ప్రజాస్వామ్యంలో రాజ్యాంగానికి ఉత్కృష్ట స్థానం - భారత రాజ్యాంగం ఆ మోదానికి సభ్యులు ప్రతులపై సంతకాలు చేసిన దినం



భారత రాజ్యాంగం ద్వారా భారత దేశానికి గణతంత్ర ప్రతిపత్తి వచ్చింది. 1950 జనవరి 26 న భారత రాజ్యాంగాన్ని అమలు పరిచిన తరువాత స్వతంత్ర భారతదేశం సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. ప్రతి సంవత్సరం భారత రాజ్యాంగ అమలు దినమైన. జనవరి 26 రోజును గణతంత్ర దినంగా జరుపు కుంటారు. పొట్టకూటికోసం, వ్యాపారం పేరుతో, మన దేశంలో అడుగు పెట్టిన శ్వేత జాతీయులు, చివరకు మన దేశాన్ని, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగంగా చేసుకోగా, సుదీర్ఘకాలం పరాయి పాలనలో మగ్గిన దేశం భారతదేశం. ఎందరో స్వాతంత్ర్య సమర యోధుల త్యాగ ఫలితాలతో 1947 ఆగస్టు 15న స్వతంత్ర భారత మాత స్వేచ్ఛా వాయువులు పీల్చ గలిగింది. స్వయం పాలనాధికారాన్ని దక్కించుకున్న దేశంలోని అన్ని మతాలు, తెగలు, నిమ్న దళితులు, గిరిజనులు, వెనుక బడిన కులాల తదితర వర్గాలకు సైతం న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సౌర్వభౌమాధికారాన్ని దక్కించు కొనేందుకు వీలుగా రాజ్యంగాన్ని రూపొందించాల్సిన బాధ్యత అప్పటి ప్రభుత్వంపై పడింది. రాజ్యాంగం అంటే దేశానికి, ప్రజలకు, ప్రభుత్వానికి కరదీపిక లాంటిది. ఆ దీపస్తంభపు వెలుగుల్లో సర్వసత్తాక సౌర్వభౌమాధికార దేశంగా ప్రగతి వైపు అడుగులు వేయాలి. అందుకనే రాజ్యాంగానికి ఆధునిక ప్రజాస్వామ్య చరిత్రలో అంతటి విశిష్టమైన స్థానముంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన దేశం కంటే ముందు అనేక దేశాలు రాజ్యాంగాలను రచించాయి. అయితే భారత రాజ్యాంగ రచన ఒక సంక్లిష్టం. దేశంలో అనేక మతాలు, తెగలు, ఆదీవాసీలు, దళితులు, అణగారిన, పీడనకు గురైన వర్గాలు... తదితరులు ఎందరో ఉన్నారు. సదరు వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగ రచన నిస్సందేహంగా ఒక పెద్ద సవాలే. ఇందుకు భారత తొలి రాష్ట్రపతి బాబు రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలో డా.బాబా సాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన (ముసాయిదా) డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. రాజ్యాంగాన్ని తయారు చేసుకోవడానికి దేశంలోని సుప్రసిద్ధ నాయకులు, న్యాయ కోవిదులు అనుభవజ్ఞులు, విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులు, ప్రముఖులతో రాజ్యాంగ నిర్మాణ సభను నిర్వహించు కున్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ భిన్నత్వ సమ్మేళితమైన దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడంలో ప్రముఖ పాత్రలో ఎంతగానో శ్రమించారు. ప్రభుత్వ విధి విధానాలు, శాసన సభల రూపకల్పనతో పాటు కోట్లాది మంది పీడిత ప్రజల ఆశయాలను ప్రతిబింభించేలా రాజ్యాంగాన్ని లిఖించారు. కులాలు, విభిన్న మతాలు, రకరకాల కట్టూ బొట్టు ఆచార వ్యవహారాల సంఘటిత భారతావనికి స్వపరిపాలనా రూపకల్పనను రాజ్యాంగ బద్ధం చేశారు. రాజ్యాంగ మంటే కేవలం ప్రభుత్వ విధి విధానాలు, శాసన సభల రూపకల్పనే కాదు... కోట్లాది పీడిత ప్రజల ఆశయాలను ప్రతిబింభించాలన్నది బాబా సాహెబ్ ప్రధానాశయం. ఆయన కృషి ఫలితంగానే ప్రపంచంలోనే కొత్తదైన రాజ్యాంగం రూపు దిద్దుకుంది. అందుకనే ప్రపంచంలోని అనేక దేశాల రాజ్యాంగాల కంటే భారత రాజ్యాంగం ఉన్నత విలువలు కలిగిందంటూ మన్ననలు పొందింది. అంబేద్కర్ చైర్మన్‌గా, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సర్దార్ పటేల్, ఆచార్య జె.బి.కృపలానీ, డా.రాజేంద్ర ప్రసాద్, సరోజినీ నాయుడు, రాజాజీ, వల్లబ్ పంత్, బి.ఆర్.అంబేద్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు, పట్టాభి సీతారామయ్య మొదలైన వారు ఈ సభలో సభ్యులు. 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజులు కష్టించి, రాజ్యాంగ సభ మొదటి సమావేశం 1946, డిసెంబర్ 9తో ప్రారంభించి 11 సార్లు, 165 రోజుల పాటు సమావేశాలు జరగగా, ఇందులో 114 రోజులు రాజ్యాంగం రాత ప్రతిపై వెచ్చించింది. రాజ్యాంగ రాతప్రతిని తయారుచేసే క్రమంలో రాజ్యాంగ సభ ముందుకు 7,635 సవరణ ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో 2,473 ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి, పరిష్కరించింది. ఏడు దశాబ్దాల కిందట 26నవంబర్ 1949నాడు డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సర్దార్ వల్లభాయి పటేల్ ప్రతిపాదించి ప్రవేశ పెట్టారు. అందమైన చేతిరాతతో హిందీ, ఇంగ్లీషు ప్రతులను, 24 జనవరి 1950న 284 మంది సభ్యుల సంతకాలతో అమోదించారు. రెండు రోజుల తర్వాత 26 జనవరి 1950నుంచి మన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. రాజ్యాంగాన్ని సభలో ప్రవేశపెట్టే ముందు అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్... మహాత్మాగాంధీకి నివాళులు అర్పించి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన తర్వాత జాతీయ గీతం 'జనగణమన'ను స్వాతంత్ర్య సమర యోధురాలు పూర్ణిమా బెనర్జీ ఆలపించారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోని అతి పెద్ద లిఖిత రాజ్యాంగాలలో ఒకటి. భారత రాజ్యంగ రూపకల్పన సమయంలో 8 షెడ్యూళ్ళు ఉండగా ప్రస్తుతం 12 షెడ్యూళ్ళు ఉన్నాయి. అవతారిక, 448 అధికరణాలు, 12 షెడ్యూళ్ళతో కూడిన గ్రంథం ఇది. రాజ్యాంగం భారత ప్రభుత్వ వ్యవస్థ, రాష్ట్రాలు, రాష్ట్రాల నిర్మాణం, కేంద్ర రాష్ట్ర సంబంధాలు, కేంద్ర రాష్ట్రాల విధులు, అధికారాలు, స్థానిక సంస్థలు, ఎన్నికలు మొదలైన విషయాలను నిర్వచించింది. ప్రధానంగా ప్రజలందరికీ స్వేచ్ఛ, పార్ల మెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్య వ్యవస్థ, ప్రాథమిక విధులు, ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు, ద్వి సభా విధానం, భాషలు, వెనక బడిన సామాజిక వర్గాల సంబంధిత అంశాలన్నీ చేర్చబడినాయి. 1936 భారత ప్రభుత్వ చట్టం ప్రకరణలు , 16 షెడ్యూళ్ళు, 14 విభాగాలు ఉండగా, దానిని రద్దు పరుస్తూ, 315 నిబంధనలు , 8పెడ్యూళబ్బు భారత రాజ్యాంగ రూపకల్పనా సమయంలో ఉండగా, ప్రస్తుతం 12 ఉన్నాయి. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్ ను చేర్చగా , 1985లో 52 వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజీవ్ గాంధీ ప్రధాని కాలంలో 10వ షెడ్యూల్, తర్వాత 1992 సంవత్సరంలో 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా 11 మరియు 12 వ షెడ్యూల్స్ ను చేర్చడం జరిగింది. భారత దేశ గణతంత్ర దినోత్సవాన్ని భారత రాజ్యాంగం అమలు లోనికి వచ్చిన రోజు జరుపుకునే సంప్రదాయాచరణ అమలవుతున్నది. 1935 భారత ప్రభుత్వ చట్టానికి బదులు భారత రాజ్యాంగం దేశ పరిపాలనకు మార్చడాన్ని "భారత దేశ గణతంత్ర దినం"అంటారు. భారత రాజ్యాంగ సభలో 1949 నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదం పొంది, 1950 జనవరి 26న దీనిని ప్రజాతంత్ర పాలన పద్ధతి ' న అమల్లోకి తేవాలని నిర్ణయించారు. జనవరి 26 ను ,"స్వతంత్ర దినం"గా వ్యవహరించగా, దేశ స్వాతంత్ర్య దినం బ్రిటిషర్లు నిర్ణయించినది కావడం వల్ల, నెహ్రూ తదితర జాతీయోద్యమ అగ్రనేతలు జనవరి 26 ను దేశ గణతంత్ర దినంగా చేశారు. రాజ్యాంగ మౌలిక లక్ష్యం... సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందరరికీ అంచించడం. ఈ లక్ష్యము ప్రజల హక్కులకు రూపాన్ని ఇచ్చింది. ప్రజాస్వామ్య సంప్రదాయాలను పరిరక్షించేందుకు స్వతంత్ర ప్రతిపత్తి గల, సమర్ధ వంతమైన న్యాయాన్ని ఇవ్వగల వ్యవస్థ రూప కల్పనే రాజ్యాంగం. రాజ్యాంగ అమలు ద్వారా పౌర హక్కుల అవగాహనను వివిధ దశల్లో విస్తృత పరిచారు. ప్రాథమిక హక్కులకు పెద్దపీట వేశారు.

ప్రభుత్వాలు చట్టాలు ప్రజా వ్యతిరేకముగా ఉన్నా రాజ్యాంగాన్ని అతిక్రమించేవిగా ఉన్నా అవి చెల్లవని చెప్పే అధికారము రాజ్యాంగ ధర్మాసనాలకు ఉన్నది .. సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పులకు కూడా చట్ట హోదా ఉంటుంది. ఒక్క అమాయకుడికి కూడా అన్యాయము జరగ కూడదన్న సూత్రము న్యాయ వ్యవస్థకు పునాది. భాదితుల హక్కులను కాపాడటం. తీవ్రమైన నేరాలను నివారించడం, శాంతి, భద్రతలకు భంగం వాటిల్లకుండా చేయడానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్య యుత కృషి జరగాలి. అప్పుడే రాజ్యాంగ లక్ష్యం, న్యాయ పరిరక్షణ సాకారం కాగలుగుతాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# కాలుష్య తనిఖీలు అంతంతే!

కరీంనగర్ : ఉరుకుల పరుగుల జీవితాలు.. పెరుగుతున్న అవసరాలతో ఇంటికో వాహనం తప్పనిసరైంది. పెరుగుతున్న వాహనాలతో కాలుష్యం కూడా పెరుగుతోంది.. వాహనదారులు వాహనాల కాలుష్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించుకుని జాగ్రత్తలు తీసుకోవడానికి తనిఖీ కేంద్రాలున్నా ఎక్కువ శాతం వినియోగించుకోవడం లేదు.. దీంతో పరిమితికి మించి ఉద్గారాలు వెలువడుతున్నాయి.. మరోవైపు పోలీసులు, రవాణాశాఖ అధికారులు కూడా వాహన కాలుష్యం తనిఖీ ధ్రువపత్రాలపై దృష్టి పెట్టడం లేదు..

గతేడాది జనవరి ఫిబ్రవరి నెలల్లో కరీంనగర్, గోదావరిఖని పట్టణాల్లో గాలి నాణ్యత సూచీ 100ను దాటిందని కాలుష్య నియంత్రణ మండలి పరికరాల ద్వారా తేలింది.కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం క్యూబిక్ మీటర్ గాలిలో సూక్ష్మ ధూళి కణాల (పీఎం 10) పరిమాణం 60 గ్రాములకు మించొద్దు.

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, గోదావరిఖనిల్లో మాత్రమే గాలి నాణ్యత సూచీ తనిఖీ పరికరాలు ఉన్నాయి. ప్రధాన పట్టణాల్లో ఉంటే పూర్తిస్థాయిలో గాలి నాణ్యత తెలిసే అవకాశం ఉంది.

**అంతా ఆన్‌లైన్...**

ఉమ్మడి జిల్లాలో 38 కాలుష్య తనిఖీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కొన్ని సంచార వాహనాలు, మరికొన్ని దుకాణాలు, పెట్రోలు బంకుల్లో ఏర్పాటు చేసినవి. వాహనాలను అక్కడికి తీసుకెళ్తే నిర్వాహకులు కాలుష్యం తనిఖీ చేసి ధ్రువపత్రాలు అందజేస్తారు. ఆన్‌లైన్ విధానం వచ్చిన తర్వాత ఉద్గారాలు పరిమితికి మించి ఎక్కువగా ఉంటే సర్టిఫికెట్



రాదు. తనిఖీ కేంద్రాల్లో వాహనాన్ని పరీక్షించిన అనంతరం అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. దీంతో ఆ పత్రం సెంట్రల్ సర్వర్‌కు వెళ్లడంతోపాటు ఆర్టీఏ ఎం వ్యాలెట్‌లో కూడా కన్పిస్తుంది.

**పరిమితి దాటితే మరమ్మతులు**

వాహనం నుంచి వెలువడే ఉద్గారాలు పరిమితికి మించి ఉంటే మరమ్మతులు చేయించాల్సి వస్తుంది. ఇంజిన్ ఆయిల్ మార్చడం, ఇంజిన్‌లో ఏవైనా మార్పులు వచ్చాయా పరిశీలించి మరమ్మతు చేయించి తీసుకెళ్లడం ద్వారా ఉద్గారాలు పరిమితి మించకుండా చూసుకుని ధ్రువపత్రం పొందొచ్చు.

**పరిశీలనకే పరిమితం..**

ఆర్టీఏ, పోలీసులు వాహన పత్రాలతోపాటు కాలుష్య తనిఖీ చేయిస్తున్నారా లేదా కూడా పరిశీలించాలి. కానీ వారు వాహన పత్రాల పరిశీలనకే పరిమితమవుతున్నారు.

**ఆసక్తి చూపని వాహనదారులు**

కాలుష్య పత్రం తనిఖీలు లేకపోవడంతో వాహనదారులు కూడా తమ వాహనాలకు క్రమం తప్పకుండా కాలుష్య తనిఖీ ధ్రువపత్రం తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. 15 ఏళ్లు నిండిన వాహనాలకు మాత్రం రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు కోసం తనిఖీ చేయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని సెంటర్‌లు ఆన్‌లైన్ కాకపోవడంతో ఇప్పటికీ కొందరు పాత యంత్రాల ద్వారా తనిఖీ చేస్తూ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. పాత వాహనాలకు ఆరు నెలలు ఇవ్వాల్సిన గడువును ఏడాదికి ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాలుష్యం ఎక్కువగా ఉంటే ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ రాదు కాబట్టి వాహనదారుల అవసరాలను సొమ్ము చేసుకుంటూ అధిక డబ్బులు కూడా తీసుకుంటున్నట్లు సమాచారం.కొత్త వాహనం కొనుగోలు చేస్తే కాలుష్యం తనిఖీకి ఏడాది గడువు ఉంటుంది. సంవత్సరం తర్వాత తనిఖీ చేయించుకుంటే సరిపోతుంది.బీఎస్-4, బీఎస్-6 వాహనాలకు అయితే ధ్రువపత్రం ఏడాది చెల్లుబాటు అవుతుంది.(2016 నవంబరు తర్వాత వచ్చినవి) బీఎస్-4, బీఎస్-6 కన్నా ముందు వాహనాలకు అయితే ధ్రువపత్రం ఆరు నెలలు మాత్రమే పనిచేస్తుంది.

# భరోసా ఎందరికో?

కరీంనగర్ :రాష్ట్ర సర్కారు రైతు భరోసా పేరిట అన్నదాతలకు పంట పెట్టుబడిని అందించేందుకు కసరత్తు చేస్తున్న తరుణంలో ఉమ్మడి జిల్లాలోని రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతానికి భిన్నంగా ఈసారి అర్హులైన వారికి అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకం అమలు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ నెల 4న రాష్ట్ర మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాన్ని తీసుకోనున్నారు. ఈ పథకం అమలు విషయంలో జిల్లాలకు దిశానిర్దేశం చేసే మార్గదర్శకాలను దాదాపుగా ఖరారు చేయనున్నారు. దీంతో ఇటు అన్నదాతల్లో అటు అధికారుల్లో అసలు ఎంతమంది భరోసాను అందుకునేందుకు అర్హులుగా మారుతారనే సందిగ్ధం నెలకొంది. ఉప సంఘం పలుమార్లు సమావేశామై పలు సిఫార్సులతో నివేదికల్ని సిద్ధం చేసింది. నిజంగా భూమిలో పంటలు సాగు చేస్తున్నవారికి లబ్ధిని అందించే దిశగా క్షేత్రస్థాయిలో ప్రయోజనాలు ఉండాలనే విధంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సంక్రాంతి పండుగ తరువాత లబ్ధిదారులను ఎంపిక చేస్తామనే ప్రకటన ఉమ్మడి జిల్లా కర్షకులను ఊరిస్తోంది.

**కేటా'యింపు' ఎవరికో..!**

గత రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.5 వేల పెట్టుబడి సాయాన్ని భూమి ఉన్న ప్రతి రైతుకు అందించింది. ఏడాదిలో రెండు పంటలకు రూ.10 వేలు ఖాతాల్లో జమ చేసింది. దీంతో అన్నదాతలు పంటల సాగు సమయంలో ఎరువులు సహా కూలీలకు ఈ మొత్తాన్ని వినియోగించుకున్నారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల ప్రచారంలో ఈ సాయాన్ని రైతు భరోసా పేరిట ఎకరానికి రూ.7,500 చొప్పున అందిస్తామని ప్రకటించింది. ఈ లెక్కన ఏడాదిలో రెండు పంటలకు రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తామని చెప్పింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టి దాదాపు ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఈ రైతు భరోసాను తెరమీదకు తీసుకొచ్చింది. ఆరునెలల కిందటే జిల్లాల వారీగా భరోసాకు సంబంధించిన సమీక్షలను మంత్రుల ఆధ్వర్యంలో కొనసాగించారు.నూతన సంవత్సరం, సంక్రాంతి కానుకగా ఈసారి ఈ పథకాన్ని వర్తింపజేయాలనే ఆలోచనతో ఈ దిశగా కార్యాచరణను రూపొందిస్తున్నారు. దీంతో గతానికి భిన్నంగా గుట్టలు, నిర్మాణ స్థలాలున్న భూములకు భరోసా ఇవ్వమనే సంకేతాల్ని సర్కారు ఇచ్చింది. దీంతోపాటు నిర్దిష్టంగా ప్రతి కుటుంబంలో కొన్ని ఎకరాలకు పరిమితిని పెట్టబోతున్నట్లు సమాచారం. ఆదాయపన్ను చెల్లిస్తున్న వారికి అందించే విషయంలోనూ పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంద్ది, ఎంతమందికి ఈ భరోసా సొమ్ము కేటాయిస్తారనేది త్వరలో తేలనుంది. జిల్లాల వారీగా మాత్రం వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో 5 ఎకరాల్లోపు 10 ఎకరాల లోపు.. ఆపై ఎకరాలున్న వారి వివరాల్ని సిద్ధం చేసి సర్కారుకు పంపారు.

# నీటి నుంచే పూడికతీత



సిరిసిల్ల : వర్షాలు, వరదలతో జలాశయాల్లో ఏటా పూడిక పేరుకుపోతోంది. ఫలితంగా నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తోంది. జలాశయాల్లో నీటిని ఖాళీ చేయకుండా అందులోని పూడికను తొలగించేందుకు కొత్త పద్ధతికి నీటిపారుదలశాఖ శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో మూడు జలాశయాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. నిర్మల్ జిల్లాలోని కడెం, ఉమ్మడి జిల్లాలోని మధ్య, దిగువమానేరు జలాశయాలు ఉన్నాయి. ఈ పనులను గుత్తేదారులకు అప్పగించేందుకు గతేడాది డిసెంబరు చివరి వారంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ నీటిపారుదలశాఖ సర్కిల్‌లో ఈ నెల 27 వరకు టెండర్ల దాఖలుకు అవకాశం ఉంది. జలాశయాల్లోని పూడికపై గతంలో సర్వే చేశారు. ఈ నివేదికలో రాష్ట్ర వ్యాప్తంగా 29 జలాశయాలను ఎంపిక చేశారు. తొలుత రెండు జలాశయాల్లో పూడికతీత విజయవంతమైతే పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని ఎల్లంపల్లి, ఎగువమానేరులోనూ ఈ ప్రక్రియనే అనుసరించనున్నారు.

ఉమ్మడి జిల్లాలోని మానేరు వాగులో నిర్మాణాలకు ఉపయోగించే నాణ్యమైన ఇసుక లభ్యమవుతుందని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. తాగు, సాగునీటి అవసరాలకు 1985లో 24 టీఎంసీల సామర్థ్యంతో దిగువమానేరు, 2018లో 27.50 టీఎంసీల సామర్థ్యంతో మధ్యమానేరు జలాశయాల నిర్మాణాలు జరిగాయి. వీటి నిర్మాణంలో చాలా గ్రామాలు ముంపునకు గురయ్యాయి. నీటి నిల్వ సామర్థ్యం తగ్గినప్పుడు తాగునీరు రంగు మారడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో ఈ జలాశయాల్లోని నీటి నమూనాలను పరీక్షించారు. ఇసుకతోపాటు అధిక మొత్తంలో మట్టి, పూడిక, గ్రావెల్ ఉన్నట్లు గుర్తించారు.దిగువ మానేరులో 20.78 టీఎంసీలు, మధ్యమానేరులో 22.34 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సామర్థ్యం తగ్గితే అవసరమైతే రెండు జలాశయాలకు ఎస్సారెస్పీ నుంచి తరలించే అవకాశం ఉంది. నీటి తరలింపు, వాడకంలో ఎలాంటి ఆటంకాలు ఎదురవకుండా జలాశయాల మధ్యలోకి యంత్రాలను పంపించి అందులోని వ్యర్థాలను బయటకు తీస్తారు. ఇలా వచ్చిన పూడిక నుంచి ఇసుకను వేరు చేస్తారు. దీనిలో నుంచి లభ్యమైన ఇసుక టన్నుకు రూ.406.64 చొప్పున ప్రభుత్వం ధర నిర్ణయించింది. ఈ మొత్తాన్ని పూడిక తీత పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ నీటిపారుదలశాఖకు చెల్లించాల్సి ఉంటుంది.

దిగువ మానేరులో 131 లక్షల టన్నులు, మధ్యమానేరులో 247 లక్షల టన్నుల పూడికను తీయనున్నారు. దీని నుంచి 25 శాతం మేరకు ఇసుక లభించే అవకాశాలు ఉన్నట్లు ఇంజినీర్ల అంచనా వేశారు. పూడికతీత ప్రాజెక్టును గుత్తేదారుకు 20 సంవత్సరాల పాటు అప్పగించనున్నారు.

# సాగునీటి సంఘాల పునరుద్ధరణకు సన్నాహం



జగిత్యాల : సాగునీటి వినియోగదారుల సంఘాల పునరుద్ధరణకు రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో 1996 రైతు యాజమాన్య చట్టం ప్రకారం చెరువుల కమిటీలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. 2010లో అప్పటి సాగునీటిసంఘాల పదవీకాలం ముగియగా ఎన్నికలు నిర్వహించకుండా 2014 వరకు పాత పాలకవర్గాలనే కొనసాగిస్తూ వచ్చారు. ప్రత్యేకరాష్ట్రం ఏర్పడిన తరువాత సాగునీటి సంఘాల ఎన్నికలు జరపకపోగా పూర్తిగా అధికారుల పర్యవేక్షణలోనే మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పునరద్ధరణ, ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం, రోళ్లవాగు ఆధునికీకరణ, ఎల్లంపల్లి ఎత్తిపోతలు, గోదావరి నుంచి ఎత్తిపోతలు, వరదకాలువ, కాకతీయ కాలువల నుంచి చెరువుల్లోకి తూముల ఏర్పాటు, వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణం తదితరాలను ప్రభుత్వం చేపట్టింది. దీంతోపాటు వేరువేరు అజమాయిషీలకిందగల ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు, వరదకాలువ, జలవిద్యుత్తు ఉత్పత్తి, చిన్ననీటి పారుదలశాఖలు తదితరాలన్నింటినీ ఒకేశాఖగా ఏర్పాటుచేశారు. జగిత్యాలలో సీఈ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి అన్ని విభాగాల పనులను ఒకే గొడుగుకిందకు చేర్చారు.

చెరువులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల పాలకమండలి సభ్యులుగా రైతులే ఎన్నికవుతారు కాబట్టి స్థానిక నీటిపారుదలలోని సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించే వీలుంటుంది. స్థానికంగా మరమ్మతు, నీటిపారుదల అజమాయిషీ, అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ కాలువల చివరి భూముల వరకు నీటిని తరలించాలనేది సాగునీటి సంఘాల ప్రధాన విధులుగా ఉంటాయి. గతంలో చెరువులు, డిస్ట్రిబ్యూటరీలకు దాదాపు 122 వరకు సంఘాలుండేవి. ఉమ్మడి రాష్ట్రంలో ఆయకట్టు విస్తీర్ణం చాలా తక్కువగా ఉండగా ఇటీవల ఆయకట్టు విస్తీర్ణం పెరగటంతో సాగునీటి సంఘాల సంఖ్యను కూడా పెంచాల్సి ఉంది. నూతన ఎత్తిపోతల పథకాలు, కాలువలు, 100 ఎకరాలకన్నా తక్కువున్న చెరువులకు కూడా సంఘాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 250 వరకు ఏర్పాటయ్యే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రైతుల సంఖ్య కూడా 2.39 లక్షలకు పెరగటంతో వీరందరినీ ఆయా సాగునీటి సంఘాల్లో ఓటర్లు(సభ్యులు)గా నమోదు చేయాల్సిఉంది.

**రైతులకు ఉపయుక్తం**

సాగునీటి సంఘాలు ఉన్నప్పుడు తగిన నిర్వహణతో నీటిపారుదలలో ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. ఇటీవల కాలువలు, నిర్మాణాలు దెబ్బతినటంతో నీటిపారుదల కష్టంగా ఉంటోంది. సాగునీటి సంఘాల ఏర్పాటు రైతాంగానికి అత్యంత ఉపయుక్తంగా ఉంటుంది.

బొడ్డు లక్ష్మణ్, ఎస్సారెస్పీ కమిటీ మాజీ అధ్యక్షుడు

**అధికారులు, సిబ్బంది నియామకం**

రైతుల భాగస్వామ్యంతో సాగునీటి సంఘాల ఏర్పాటుపై ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలుంటాయి. సంఘాల పెంపు, సభ్యత్వ నమోదుపై ఇంకా నిర్ణయం వెలువడలేదు. ఇటీవల ప్రభుత్వం నీటిపారుదశాఖలో అధికారులు, క్షేత్రసిబ్బంది పోస్టులను భర్తీచేసింది.టి.శ్రీనివాసరావుగుప్తా, ఎస్సారెస్పీ పర్యవేక్షక ఇంజినీర్

# పూర్తి చేస్తే ప్రయోజనం!



మంథని : పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లిలో 100, మండలంలోని కాకర్లపల్లి, ధర్మారం(బిట్టుపల్లి) గ్రామాల పరిధిలో 47 ఇళ్ల నిర్మాణాలను అట్టాహాసంగా ప్రారంభించింది. గుత్తేదారుల నిర్లక్ష్యంతో ఇళ్ల నిర్మాణాలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో వాటిని పట్టించుకున్న నాథుడే లేడు. దీంతో ఆశావహులకు ఎదురుచూపులే మిగిలాయి. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి ఇల్లు లేని పేదలకు ఇస్తే బాగుంటుంది. లేకపోతే ప్రజాధనం వృథా అవుతుంది.

**ముగ్గురు గుత్తేదారులు మారినా..:** మంథని మండలం కాకర్లపల్లి, ధర్మారం పరిధిలో 2018లో 47 రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. కాకర్లపల్లిలో 25 ఇళ్లకు.. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5.04 లక్షల అంచనా వ్యయంతో మొదలు పెట్టారు. ప్రారంభం నుంచి నేటికి ముగ్గురు గుత్తేదారులు మారారు. అయినా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదు. స్లాబ్, గోడల నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. అర్థాంతరంగా పనులు నిలిపివేయడం, పర్యవేక్షణ లేక కొన్ని ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. ధర్మారం గ్రామ పరిధిలో 22 రెండు పడుక గదుల ఇళ్లను పిల్లర్ల వరకే నిర్మించారు. మంథని పరిధి కూచిరాజ్‌పల్లిలో 100 ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా.. మధ్యలోనే ఆగిపోయాయి. స్లాబ్ దశలో కొన్ని, పిల్లర్ల దశలో కొన్ని వదిలేశారు.

# యాసంగి.. నెమ్మదిగా 'సాగు'తోంది!

ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 'యాసంగి' పంటల సాగు ఇప్పటివరకు అంతంతమాత్రమే. ఖమ్మం జిల్లాలో ఈనెలాఖరు వరకు సాగు విస్తీర్ణం పుంజుకుంటుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. సాగర్ జలాలను వారబందీ పద్ధతిలో సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించిన విషయం విదితమే. అయితే ప్రస్తుత సీజన్‌లో వరి సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గుచూపటం లేదు. సాధారణంగా యాసంగిలో దొడ్డు రకాలను అధిక మంది ఎంచుకుంటారు. ఈ రకాలకు ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోవటంతో సాగు విస్తీర్ణంపై ప్రభావం పడే అవకాశముంది. వానాకాలంతో పోల్చితే పెట్టుబడులూ ఎక్కువవుతాయని అన్నదాతలు చెబుతున్నారు. గులాబీ రంగు పురుగు వల్ల చాలా ప్రాంతాల్లో పత్తి పంట దెబ్బతింది. దీన్ని తొలగించి అధిక శాతం మంది మొక్కజొన్న సాగుకు పూనుకుంటున్నారు. పెట్టుబడి తక్కువవటం, ధర ఆశాజనకంగా ఉండటంతో మొక్కజొన్న పంట విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. గతంలో పోల్చితే వేరుసెనగ విస్తీర్ణమూ కొంతమేరకు పెరగటం విశేషం. భద్రాద్రి జిల్లాలో ఇప్పటివరకు 'వరి' తక్కువగానే సాగైంది. ఈనెలాఖరు వరకు పూర్తిస్థాయిలో



సాగయ్యే అవకాశముందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రధానంగా ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, బోర్ల కింద ఈపంట సాగవుతుంది. మొక్కజొన్న సాగు విస్తీర్ణం లక్ష్యం దిశగా వెళ్తోంది. పెసర సాగు ఆశాజనకంగా ఉంది. ఇతర పంటల సాగు విస్తీర్ణం నామమాత్రమే. ఉభయ జిల్లాల్లో రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో వివిధ పంటల సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుంది. రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. యాసంగికి సాగుకు రైతులకు వ్యవసాయశాఖ అన్ని రకాలుగా సహకరిస్తుంది.దనసరి పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం

# దళారులదే హవా

సంగారెడ్డి : జిల్లాలో పత్తి కొనుగోళ్లు నిర్దేశిత లక్ష్యానికి దూరంగా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం.. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది కొర్రీలతో విసుగు చెందిన కర్షకులు దళారులకు పంటను అమ్ముకుంటున్నారు. మద్దతు ధర దక్కక తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో 4.19 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని, ఈ మేరకు కొనుగోళ్లు చేపట్టాలని అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. గత నవంబరు నుంచి ఇప్పటి వరకు 1.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి మాత్రమే అధికారికంగా కొనుగోలు చేశారు. అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు దళారులతో కుమ్మక్కయ్యారనే విమర్శలొస్తున్నాయి.

**3.49 లక్షల ఎకరాల్లో సాగు**

ఈ ఏడాది వానా కాలంలో 3.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. 3.49 లక్షల ఎకరాల్లో సాగయింది. జిల్లాలో సదాశివపేట, రాయికోడ్, జోగిపేట, నారాయణఖేడ్, వట్‌పల్లి, జహీరాబాద్, పటాన్‌చెరులో మార్కెటింగ్ శాఖకు యార్డులున్నాయి. వీటిలో పటాన్‌చెరు, సంగారెడ్డి మినహా మిగిలిన అన్ని చోట్ల పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాల్లో గత నవంబరు నాలుగో తేదీ నుంచి ఈ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 12 శాతం లోపు తేమ ఉంటే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర.. పొడవు గింజ రకానికి రూ.7521(క్వింటాలుకు), పొట్టి గింజ రకానికి రూ.7121(క్వింటాలుకు) రైతులకు చెల్లించాలి.

**ఫిర్యాదు చేయండి.. రైతులకు న్యాయం చేస్తాం**

అన్నదాతలు సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలి. దళారులకు విక్రయించి మోసపోవద్దు.



కొందరు రైతులు ఎరువులు, విత్తనాల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. వారికే పంటను అమ్ముతున్నారు. సీసీఐ సిబ్బంది దళారులతో కుమ్మక్కయినట్లు సమాచారం ఉంటే ఫిర్యాదు చేయాలి. రైతులకు న్యాయం చేస్తాం. ఫిబ్రవరి వరకు పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయి. - మహ్మద్ రియాజ్, ఏడీ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ.

**దందా తీరిది..**

భారత పత్తి సంస్థ(సీసీఐ) ఆధ్వర్యంలో జిల్లాలో అధికారికంగా పత్తి కొనుగోలు చేయాలి. 30 నుంచి 40 శాతం రైతులు మాత్రమే ఈ కేంద్రాల్లో పంట విక్రయించారు. మిగిలిన పంట దళారుల చెంతకు చేరుతోంది. దళారులు, సీసీఐ కేంద్రాల నిర్వాహకుల మధ్య అవగాహన ఉందనే ఆరోపణలొస్తున్నాయి. పంట నమోదులో ఇబ్బందులు, ఆధార్ అనుసంధానం, తేమ తదితర కొర్రీలతో ఇబ్బందుల వల్లనే కర్షకులు దళారులకు పంట విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పొడవు గింజ రకానికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7521 ఉండగా దళారులు రూ.ఏడు వేల లోపు మాత్రమే చెల్లిస్తున్నారు.

**జిల్లాలో పత్తి విక్రయాలు ఇలా..**

(గత నవంబరు 4 నుంచి ఈ నెల 5 వరకు)

పత్తి దిగుబడి అంచనా: 4.19 లక్షల మెట్రిక్ టన్నులు

పంట విక్రయించిన రైతులు: 41,407

సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు: 1.15 లక్షల మెట్రిక్ టన్నులు

కొనుగోలు చేసిన పత్తి విలువ: రూ.853.99 కోట్లు

రైతుల ఖాతాల్లో జమ: రూ.723.12 కోట్లు

బకాయిలు: రూ.130.87 కోట్లు

# సౌర విద్యుత్ తయారీ ప్లాంట్లకు సై

హైదరాబాద్ : సౌర విద్యుత్ వినియోగాన్ని అన్ని జిల్లాల్లో పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియపై రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రెవెన్యూ అధికారులు ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేస్తున్నారు. ఒక్క మెగావాట్ సౌరవిద్యుత్ ఉత్పత్తికి 4 ఎకరాల భూమి సేకరించాలన్న మార్గదర్శకాల మేరకు రెండు జిల్లా అధికారులు గ్రామాల్లో ప్రభుత్వ భూముల వివరాలను తీసుకున్నారు. ఎక్కువ జనాభా కలిగిన గ్రామాలు, మండల కేంద్రాల్లో ఈ ప్లాంట్లను ఏర్పాటుచేస్తే అక్కడ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, కోతలు ఉండబోవన్న ముందస్తుఅంచనాతో అన్ని కోణాలను పరిశీలిస్తున్నారు. ఈ ప్లాంట్ల వివరాలు, ప్రాంతాలు, అనుకూలతలను 2, 3 రోజుల్లో ప్రభుత్వానికి పంపించనున్నారు.

**నిరంతర సరఫరా.. పర్యావరణ హితం..**

గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే నిరంతర విద్యుత్ సరఫరాకు వీలుంటుందని రాష్ట్ర



ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. విద్యుత్ తయారీలో ఇప్పటికీ సింహభాగం థర్మల్ విద్యుత్‌నే వినియోగిస్తున్నాం. పర్యావరణానికి ఇది హాని కలిగిస్తోంది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించేందుకు సౌర విద్యుత్ వినియోగించాలన్న లక్ష్యంతో గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఒక్కో గ్రామంలో కనీసం ఒక మెగావాట్ సౌరవిద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని అధికారులు నిర్ణయించారు.

**ఉత్పత్తి, పంపిణీ బాధ్యతలు మహిళలకే**

ఈ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించిన సాంకేతిక పనులు, ఉత్పత్తి ఎలా చేయాలన్న సలహాలు, సూచనలను ప్లాంట్లను నిర్వహించనున్న మహిళా స్వయం సేవా సంఘాలకు ప్రభుత్వ అధికారులు వివరించనున్నారు. వారికి సంపూర్ణ అవగాహన కలిగాక ఉత్పత్తి, పంపిణీ, నిర్వహణ బాధ్యతలన్నీ మహిళలకే అప్పగించనున్నారు. గ్రామీణ, మండల ప్రాంతాల్లో ప్లాంట్లను ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు ప్రభుత్వ భూముల్లో ప్లాంట్లను నిర్మించనున్నారు. ప్రభుత్వ భూములు ఎక్కువగా లభించిన చోట్ల 2-4 మెగావాట్ల వరకూ విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు.

**అనువైన ప్రాంతాల ఎంపిక**

సౌర విద్యుత్ ప్లాంట్లకు అనువైన ప్రాంతాలు ఎంపికచేస్తున్నాం. ఇప్పటివరకు పది మండలాల్లో కొన్ని గ్రామాలను అధికారులు పరిశీలించారు. 150 ఎకరాల వరకూ ప్రభుత్వ భూములను గుర్తించాం. సౌరవిద్యుత్ పంపిణీకి సమీపంలోని సబ్‌స్టేషన్ల జాబితా సేకరించాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళిక రూపొంచనున్నాం.సి.నారాయణరెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్

# మంటలు ఆర్పేదెలా?

సారంగాపూర్ : రెండేళ్లుగా అటవీ శాఖ అభివృద్ధి పనులకు నిధులు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అత్యవసర పనులకు మినహా నిధులు జమ కాకపోవడంతో అధికారులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో కొన్నేళ్లుగా అడవుల్లో చేపట్టిన పర్కలేషన్ ట్యాంకులు, రాతి కట్టడాలు, చెక్‌డ్యాంలతోపాటు పలు పనులు మంచి సత్ఫలితాలిచ్చాయి. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా అటవీశాఖ మొక్కలను నాటడమే కాకుండా భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. కొన్నేళ్లుగా నాటుతున్న మొక్కలతో జిల్లాలో 22.94 శాతం ఉన్న అడవుల విస్తీర్ణ శాతం కూడా పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కొడిమ్యాల, మెట్‌పల్లి, రాయికల్‌లో అటవీ శాఖ రేంజ్‌లు ఉండగా, ఆయా రేంజ్‌ల పరిధిలో ఏటా రూ.కోట్లలో కంపా, తదితర నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం నిధుల లేమితో అటవీశాఖ అధికారులు పనులు చేపట్టలేక చేతులెత్తేశారు.

**479 కి.మీ ఫైర్‌లైన్లు**

జిల్లాలో అటవీ ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా 479 కి.మీ పొడవునా ఫైర్‌లైన్లు ఏర్పాటు చేసేవారు. గతేడాది నుంచి నిధులు రాకపోవడంతో పూర్తిగా తగ్గిపోయాయి. సారంగాపూర్ సెక్షన్ పరిధిలో 14 కి.మీ పొడవునా ఏర్పాటు చేయాల్సిన అవసరముందని ప్రతిపాదనలు పంపించగా కేవలం నాలుగు కిలోమీటర్ల ఫైర్‌లైన్ ఏర్పాటుకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. అంతేకాకుండా జిల్లాలోని జగిత్యాల రేంజ్ పరిధిలో టేకు వృక్షాలు అధికంగా ఉండగా డిసెంబరు నుంచి మార్చి వరకు ఆకులు రాలుతూనే ఉంటాయి. ఫైర్‌లైను ఏర్పాటు చేసిన పదిహేను రోజుల్లోనే మళ్లీ ఆకులు నేలపై పరచుకొని ఉంటాయి. అంతేకాకుండా టేకు ఆకులలో ఫాస్పరస్ ఎక్కువగా ఉండడంతో మంటలు తొందరగా అంటుకొని వ్యాపించి ఆర్పే వీలులేకుండా విస్తరిస్తాయి. ఫైర్‌లైన్లు ఏర్పాటు చేసినప్పటికీ మంటలు అదుపు చేసేందుకు అవస్థలు పడుతుండగా, ప్రస్తుతం వాటికి కూడా నిధులు రాకపోవడంతో మంటలను అదుపు చేయడం అటవీ అధికారులకు తలనొప్పిగా మారింది.


**వన్యప్రాణుల దాహార్తి తీరేదెలా?**

జిల్లా వ్యాప్తంగా అయిదు రేంజ్‌ల పరిధిలో 217 అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు ఎక్కువగా సంచరిస్తుంటాయని గతంలోనే అటవీ అధికారులు గుర్తించారు. దీనికి అనుగుణంగా గతంలో అడవుల్లో 240 సాసర్ పిట్లు నిర్మించి ప్రత్యేకంగా ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతుండేవారు. దాదాపు 119 ప్రాంతాల్లో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు తప్పనిసరిగా నీటి వసతి కల్పించాల్సి ఉంటుంది. పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటి వసతి కల్పించాలని ఆదేశాలున్నప్పటికీ పంచాయతీల్లోనూ నిధులు లేకపోవడంతో ఇబ్బందిగా మారనుంది. వేసవి వస్తుండడంతో ముందస్తుగా నిధులు సమకూర్చితేనే వన్యప్రాణుల దాహం తీర్చే అవకాశముంటుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని అటవీ అధికారులు కోరుతున్నారు.

**ప్రతిపాదనలు పంపించాం**

జిల్లాలో అటవీ ప్రాంతాల్లో మంటలు అంటుకోకుండా ఫైర్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతి రాగానే పనులు ప్రారంభించనున్నాం. వన్యప్రాణుల తాగునీటి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పలు పథకాల ద్వారా అటవీ విస్తీర్ణం పెంపునకు కృషి చేస్తున్నాం. అత్యవసర పనులకు నిధుల మంజూరు కావడంతో పనులకు ఇబ్బంది లేకుండా కొనసాగిస్తున్నాం. రవికుమార్, డిప్యూటీ రేంజర్, జగిత్యాల

# అప్రమత్తం.. ప్రమాదరహితం



తాండూరు : నిత్యం ఏ పత్రిక తిరగేసినా, సామాజిక మాధ్యమాలు చూసినా, వార్తలు విన్నా రోడ్డు ప్రమాదం లేని రోజంటూ లేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి క్షేమంగా తిరిగి వచ్చే వరకు ఒకటే ఆందోళన. ఇదీ ప్రస్తుత పరిస్థితి. అయితే ఏళ్ల తరబడి కొందరు, ఉద్యోగంలో చేరింది మొదలు ఇప్పటి వరకు ప్రమాదానికి ఆస్కారం లేకుండా లక్షలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్న ఆర్టీసీ వాహన చోదకుల కృషి ప్రశంసనీయం. బస్సు స్టీరింగ్ పట్టుకున్నప్పటి నుంచి వారు జాగ్రత్తగా ఉంటున్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రమాద రహిత డ్రైవర్లపై ప్రత్యేక కథనం.

**సెల్‌ఫోన్ వాడను: బాలరాజు**

నేను 2010 జనవరి 1న విధుల్లో చేరా. రోడ్డు నిబంధనలను తప్పకుండా పాటిస్తా. బస్సు నడిపేటపుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడను. మలుపుల వద్ద మరింత అప్రమత్తంగా ఉంటా. ఇప్పటి వరకు విధులకు గైర్హాజరు కాలేదు. ప్రయాణికులను జాగ్రత్తగా తీసుకెళ్లడమే లక్ష్యం.

**క్రమపద్ధతిలో వెళ్లడమే.: రఫీక్ ఖలాన్**

నేను 1999 ఆగస్టు 1న విధుల్లో చేరా. ఒక్కసారి కూడా గైర్హాజరు కాలేదు. బస్సును జాగ్రత్తగా నడపడమే లక్ష్యం. ఇప్పటి వరకు మూడు సార్లు ఉత్తమ డ్రైవర్‌గా అవార్డు అందుకున్నా. బస్సును ఓవర్‌టేక్ చేయను. క్రమపద్ధతిగా వెళతా. ఇతర వాహనాలకు ఆటంకం కలిగించను. బస్సు నడిపే సమయంలో ప్రశాంతంగా ఉంటా.

**నిర్ణీత దూరం పాటిస్తా..**

నేను 1997 ఆగస్టు1న డ్రైవర్‌గా విధుల్లో చేరా. అప్పటి నుంచి విధులకు గైర్హాజరు కాలేదు. ముందున్న వాహనాన్ని దాటి వెళ్లను. 50 అడుగుల దూరం పాటిస్తా. ఇప్పటి వరకు ఒక్క ప్రమాదం జరగకుండా విధులు నిర్వహిస్తున్నా. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యం. మూడు సార్లు ఉత్తమ డ్రైవర్‌గా సత్కారం అందుకున్నా.
ఐ.ఎన్.రావు, తాండూరు డిపో

**మానసిక ప్రశాంతత..**

ఇంటి నుంచి విధులకు హాజరయ్యే సమయంలో కుటుంబ బాధ్యతలను అక్కడే మరిచిపోతా. ఒక్కసారి బస్సును క్షుణ్ణంగా పరిశీలించాకే స్టీరింగ్ పట్టుకుంటా. ముఖ్యంగా మానసిక ప్రశాంతతతోనే దాదాపు 28 ఏళ్లుగా ఒక్క ప్రమాదం కూడా చేయలేదు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఉంటూ రోడ్డు నియమాలను విధిగా పాటించా. ఎదురుగా వస్తున్న వాహనాల విషయంలో అప్రమత్తంగా ఉంటా. వేగం పెంచడం, నెమ్మదిగా నడపడం కూడా ప్రమాదమే. ఇంకా మూడేళ్ల సర్వీస్ ఉంది. అప్పటి వరకు కూడా ప్రమాదాలు లేకుండా నడపాలన్నదే లక్ష్యం.
**మహమ్మద్ రఫీ, డ్రైవర్, పరిగి డిపో**

**వాహనాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ..**

వికారాబాద్ ఆర్టీసీ డిపోలో 18 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న. ప్రమాదరహితంగా నడిపినందుకు, ఇంధన పొదుపు చేయడంతో అవార్డులు వచ్చాయి. విధి నిర్వహణలో ప్రశాంతంగా ఉండడం వల్లే ఇది సాధ్యమైంది. పక్క నుంచి వచ్చే వాహనాలను జాగ్రత్తగా పరిశీలిస్తా.
శివయ్య, వికారాబాద్ డిపో

# వడివడిగా ఇస్తేనే.. వనితకు పెట్టుబడి



తాండూరు : మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) రుణాలు మంజూరు చేస్తోంది. నిర్ణీత గడువులోగా అందిస్తున్న వీటితో స్వయం ఉపాధి, కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. గడువు సమీపిస్తుండడంతో వేగవంతం చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కథనం..

జిల్లాలో గ్రామీణ మహిళలే అధికం. వీరంతా స్వయం సహాయక సంఘాల్లో చేరి,. పొదుపు చేస్తూనే ఏటా రుణాలు పొందుతున్నారు. వీరికి పూచీకత్తు లేకుండా గంటలు, రోజుల వ్యవధిలో స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నారు. దరఖాస్తు చేసిన డ్వాక్రా మహిళ బ్యాంకు ఖాతాలో నేరుగా సొమ్ము జమ చేస్తున్నారు. రుణాల సొమ్మును పెట్టుబడులుగా పెట్టి సొంతూళ్లలోనే ఆసక్తి ఉన్న వ్యాపారం, కుటీర పరిశ్రమలు, వ్యవసాయం, హెూటల్, కిరాణం, దర్జీ దుకాణం, వస్త్ర విక్రయం, అలంకరణ వస్తు విక్రయం, ఆన్‌లైన్ కేంద్రం, బ్యూటీపార్లర్, మగ్గం వర్క్స్ వంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వచ్చిన ఆదాయంతో రుణ వాయిదాలకు, కుటుంబ అవసరాలకు వెచ్చిస్తున్నారు.

**ఈసారి భిన్నం..:** రుణాల మంజూరుకు రూ.150 కోట్లు సిద్ధంగా ఉన్నప్పటికి పొందలేని పరిస్థితి నెలకొంది. కారణమేమంటే గతంలో రుణాలు పొందిన సభ్యుల నుంచి ఐకేపీ సిబ్బంది రుణ వాయిదాలను వసూలు చేయలేదు. కొన్నిచోట్ల వసూలు చేసినా, కిస్తీల సొమ్మును సొంతానికి వాడుకున్నారు. ఉన్నతాధికారుల విచారణలో అక్రమాలు వెలుగు చూసినప్పటికీ బాధ్యులపై చర్యలు చేపట్టలేదు. సొమ్ము వసూలు చేయలేదు. దీంతో బకాయిలు పేరుకుపోయి కొత్త రుణాల మంజూరుకు ఆటంకంగా మారింది. ప్రస్తుతం యాభై శాతానికి కూడా చేరలేదు. రోజుకు రూ.50లక్షల చొప్పున ఇస్తేనే లక్ష్యం పూర్తయ్యే ఆస్కారముంది.

**ఇదీ పరిస్థితి..:** జిల్లాలో యాలాల మండలం 97 శాతంతో ప్రథమ స్థానం, 2 శాతంతో నవాబుపేట మండలం చివరన ఉంది. చౌడాపూర్‌లో మండలంలో 86.59 లక్షలు ఇవ్వాల్సి ఉంది. కోట్‌పల్లి, వికారాబాద్, తాండూరు, బొంరాస్‌పేట మండలాల్లో పది శాతంలోపు అందించారు. దౌల్తాబాద్ మండలంలో రూ.1.35 కోట్లతో యాభై శాతం లక్ష్యం పూర్తైంది. కొడంగల్‌లో 48, పూడూరులో 44 శాతం సాధించారు. జిల్లా వ్యాప్తంగా 72 శాతం లక్ష్యం పూర్తి చేయాల్సి ఉంది. ప్రత్యేక దృష్టి సారించి వడివడిగా మంజూరు చేస్తేనే సమకూరనున్నాయి. లేదంటే గడువు ముగిసి మురిగి పోనున్నాయి.

**ప్రత్యేక దృష్టి సారించాం: నర్సింహులు, డీపీఎం**

స్త్రీనిధి రుణాల లక్ష్యం సాధించేందుకు మండలాల వారీగా సమీక్ష నిర్వహిస్తున్నాం. ఎక్కడెక్కడ బకాయిలున్నాయో పరిశీలించి వసూలు చేయడంతోపాటు, కొత్త రుణాలు అందించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నాం. రెండు నెలల్లో పురోగతి సాధిస్తాం.

జిల్లాలో ఇలా
మండల సమాఖ్యలు: 19
గ్రామైక్య సంఘాలు: 657
స్వయం సహాయక సంఘాలు: 15,699
నమోదైన సభ్యులు: 1.63 లక్షలు
ఆర్థిక సంవత్సర రుణ లక్ష్యం: రూ.49.54కోట్లు
ఇప్పటి వరకు పంపిణీ చేసింది: రూ.13.92 కోట్లు

# వారంలో గోదావరి రెండో దశ టెండర్లు



హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరం దాహార్తిని తీర్చేందుకు మరో కీలక అడుగు ముందుకు పడుతోంది. 20 టీఎంసీల గోదావరి జలాలను నగరానికి తీసుకొచ్చేందుకు ప్రతిపాదించిన గోదావరి రెండో దశ ప్రాజెక్టుకు వారంలో టెండర్లు పిలవనున్నారు. రూ.7,360 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టును 24 నెలల్లో పూర్తిచేసేలా కార్యాచరణ సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు ఒకటి, రెండు రోజుల్లో వెలువడనున్నాయి.గోదావరి నుంచి రెండో దశలో 15 టీఎంసీలు, మూడో దశలో 5 టీఎంసీలు తేవాలని గతంలో నిర్ణయించారు. అయితే నగర తాగునీటి అవసరాలు భారీగా పెరిగిన నేపథ్యంలో రెండో దశలోనే 20 టీఎంసీలు తీసుకురావాలని నిర్ణయించారు. టెండర్ ప్రక్రియకు జలమండలి ప్రాజెక్టుల విభాగం ఏర్పాట్లు పూర్తిచేసింది. హైబ్రీడ్ యాన్యూటీ విధానంలో 60 శాతం నిధులను నిర్మాణ సంస్థ, 40 శాతం నిధులను జలమండలి భరించనున్నాయి. జలమండలి తన వాటా రూ.2,944 కోట్లను హడ్కో రుణంగా తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**నగరంతోపాటు జంట జలాశయాలకు..**

లక్ష్యం: నగర తాగునీటి అవసరాలు తీర్చటంతో పాటు మూసీ పునరుజ్జీవంలో భాగంగా జంటజలాశయాలకు గోదావరి జలాలు తీసుకురావడం. తాగునీటి అవసరాలకు 30 టీఎంసీలు కేటాయించారు. గతంలోనే 10 టీఎంసీలు వినియోగించుకున్నారు. మరో 20 టీఎంసీల నీటి తరలింపునకు తాజాగా రంగం సిద్ధమైంది. **అవసరం..:** 2015లో ఎల్లంపల్లి నుంచి తీసుకొచ్చిన 10 టీఎంసీలు తర్వాత నగరానికి అదనంగా నీరు రాలేదు.ప్రస్తుతం రోజుకు 550 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇవి సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రతిపాదించిన గోదావరి జలాలు వస్తే తప్పా.. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారం కాదు. నగర విస్తరణ దృష్టిలో ఉంచుకుని గోదావరి రెండో దశకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

# బొగ్గు ధర ప్రియం.. ఇతర కంపెనీలే నయం

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తిలో దేశంలోనే ఎంతో అనుభవం ఉన్న కంపెనీ సింగరేణి. స్థానికంగా, సహజ సిద్ధంగా ఉన్న పరిస్థితులు బొగ్గు ధరపై ప్రభావం చూపుతున్నాయి. ఉత్పత్తి వ్యయం పెరుగుతున్న కారణంగా బొగ్గు ధరను పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడున్న భూగర్భ స్థితిగతులు బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని పెంచే విధంగా ఉండటంతో దానిని ఏ విధంగా అధిగమించాలన్న దిశగా సంస్థ సమాలోచన చేస్తోంది. ప్రస్తుతం సింగరేణి కంటే ఇతర బొగ్గు పరిశ్రమల్లో టన్ను బొగ్గు ధర చాలా తక్కువగా ఉంది. సింగరేణితో పోల్చితే వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్, మహానది కోల్‌ఫీల్డ్స్‌లో బొగ్గు ధర తక్కువగా ఉంది. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి అయ్యే ఖర్చుతో చూసుకుంటే మార్కెట్‌లో విక్రయిస్తున్న ధర తక్కువే. కానీ అంతకంటే తక్కువకు విక్రయించాలంటే సంస్థకు నష్టాలు తప్పవు. దీనిని ఏ విధంగా అధిగమించాలన్న విషయమై యాజమాన్యం ప్రణాళికలు చేసుకుంటుంది. బహిరంగ మార్కెట్‌లో పోటీని ఎదుర్కోవాలంటే తక్కువ ధరకు నాణ్యమైన బొగ్గును విక్రయించడమే మార్గం.

**అనుకూలంగా లేని భూగర్భ పరిస్థితులు**

రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. అవి చాలా లోతుల్లో ఉండటంతో దానిని వెలికి




తీసేందుకు ఖర్చు ఎక్కువ చేయాల్సి వస్తుంది. ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్స్‌లో రెండు టన్నుల మట్టిని వెలికి తీస్తే ఒక టన్ను బొగ్గు ఉత్పత్తి చేయవచ్చు. సింగరేణిలో కనీసం ఆరు నుంచి ఏడు టన్నుల మట్టిని వెలికి తీస్తే తప్ప టన్ను బొగ్గును ఉత్పత్తి చేయలేం. మట్టి తొలగింపునకే సింగరేణిలో ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుంది. దీని వల్ల ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. భూగర్భంలో బొగ్గు పొరలు ఏర్పడ్డ ప్రాంతాలు కనీసం 300 నుంచి 1200 మీటర్ల లోతుల్లో ఉన్నాయి. గోదావరి పరివాహక ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు ఇప్పటి వరకు 19,000 మిలియన్ టన్నులకు పైగా ఉన్నట్లు గుర్తించారు. ఇవి తక్కువలో తక్కువ 300 మీటర్ల నుంచి అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం మైనింగ్ చేస్తున్న గనుల్లో అవి 600 మీటర్ల వరకు వెళ్లాయి. అందులోంచి వెలికి తీయాలంటే పైన ఉన్న మట్టిని తొలగించాల్సి ఉంటుంది. భారీ మొత్తంలో ఉన్న మట్టిని తొలగించేందుకు వెచ్చించే వ్యయం బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది.

**యంత్రాల పని గంటల పెంపుతోనే...**

సింగరేణి గనుల్లో యంత్రాల పని గంటలు పెంచుకోవడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని నియంత్రించే అవకాశం ఉంటుంది. ఒక్కో యంత్రం రోజుకు 18 గంటలు పనిచేస్తే ఆర్థిక భారం తగ్గుతుంది. ఉపరితల గనుల్లో 19 గంటలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలి. సింగరేణిలో మొత్తం 828 యంత్రాలు పనిచేస్తున్నాయి. ప్రతి యంత్రం సగటున నాలుగు గంటలు పెంచుకుంటే బొగ్గు ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా వ్యయం తగ్గే అవకాశం ఉంది.

# మహిళా ఆర్థిక శక్తి

సారంగాపూర్: మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించింది. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల ద్వారా సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహిస్తూ బలోపేతం చేయడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు. గతంలో సభ్యురాలు రుణం తీసుకోవాలంటే సంఘ సభ్యులంతా కలిసి తీర్మానం చేస్తే బ్యాంకు లింకేజీ రుణం అందించేవారు. ప్రస్తుతం ఎలాంటి షరతులు లేకుండానే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, అంతర్గత రుణాలు అందిస్తున్నారు. ఒక్కో యూనిట్ నెలకొల్పేందుకు రూ.50 వేల నుంచి రూ.5లక్షల వరకు రుణం అందిస్తున్నారు. దాదాపు వందకు పైగా వ్యాపారాల నిర్వహణకు అవకాశం కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.7లక్షల మంది మహిళా సంఘ సభ్యులు ఉండగా మహిళా శక్తి పథకం కింద జిల్లాలో 9529



వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు గుర్తించగా 5477 ఎంపిక చేశారు. ఇందులో 3410 యూనిట్లకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద దాదాపు రూ.9 కోట్ల రుణాలు అందించారు. మార్చిలోపు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేలా డీఆర్డీవో అధికారులు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని సోమన్‌పల్లికి చెందిన సిద్ధం సునీత రూ.5 లక్షల రుణం తీసుకుంది. ఇందులో బ్యాంకు లింకేజీ రూ.లక్ష చొప్పున, లక్‌పతి దీదీ పథకం ద్వారా రూ.2 లక్షలు, స్త్రీనిధి ద్వారా రూ.75 వేలు, పొదుపు నుంచి రూ.1.25 లక్షలతో బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేశారు. ప్రతి నెల రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఆదాయం పొందడమే కాకుండా మరొకరికి ఉపాధి కల్పిస్తోంది.మండలంలోని పోరండ్లకు చెందిన జుంబర్తి శాంత బ్యాంకు లింకేజీ ద్వారా రూ.4 లక్షలు, స్త్రీనిధి ద్వారా రూ.2 లక్షల రుణం తీసుకున్నారు. గ్రామంలో లేడిస్ ఎంపోరియం, కిరాణ స్టోర్ ఏర్పాటు చేశారు. ప్రతి రూ.10 నుంచి రూ.15 వేల ఆదాయం పొందుతున్నారు.

**ఆదర్శంగా నిలుస్తున్నారు.. - గంగాధర్, ఏపీఎం**

మహిళా శక్తి పథకం ద్వారా వ్యక్తిగత రుణాలు అందించడంతో సొంత వ్యాపారాలు చేసుకుని ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఎవరిపై ఆధారపడకుండా సూక్ష్మ రుణాలు అందించడంతో కుటుంబానికి భారం కాకుండా తోడ్పాటు అందించడమే కాకుండా మరికొంత మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**రూ.5 లక్షల వరకు..- గంగా భవానీ, అధ్యక్షురాలు, మహిళా సంఘం**

గతంలో వ్యక్తిగత రుణాలు అందించేందుకు బ్యాంకులు ముందుకు రాకపోవడంతో సొంత పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడం ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ఎలాంటి షరతులు లేకుండా రూ.5 లక్షల వరకు రుణాలు అందించడంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

చురకలు



# ప్రజావాణిలో ఫిర్యాదులు.. అధికారుల పరుగులు

హైదరాబాద్ : కొన్నేళ్లుగా అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రేటర్ పరిధిలోని పలుప్రాంతాల్లోని గృహ నిర్మాణ సంస్థ(హౌసింగ్ బోర్డ్) స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. తాజాగా ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తుండటంతో అధికారులు పరుగులు పెడుతున్నారు. ఖాళీ స్థలాల వేలానికి ప్రభుత్వం అనుమతించటంతో అక్రమార్కుల బాగోతాలు వెలుగులోకి వస్తున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ప్రజావాణి నుంచి వాటిని హౌసింగ్ బోర్డు కార్యాలయానికి పంపుతున్నారు. తీసుకున్న చర్యలపై నివేదికలు ఇవ్వాల్సి ఉండటంతో అధికారులు ఆఘమేఘాల మీద ఆయా ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. కబ్జాలను నిర్ధారిస్తే తొలగిస్తున్నారు. కూల్చివేతలు చేపట్టకుండా మమ అనిపిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**పర్యవేక్షణ కరవు**

ఖాళీగా ఉన్న ప్లాట్లకు ప్రహరీ నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ కొరవడుతోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. టెండర్లు నిర్వహించి గుత్తేదారులకు అప్పగిస్తున్నారు. బోర్డు రికార్డుల మేరకు విస్తీర్ణాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో కొలతలువేసిన తర్వాత గోడలను నిర్మించాల్సిఉంది. పర్యవేక్షణ లేకకొన్ని ప్రాంతాల్లో పది నుంచి పదిహేను అడుగుల విస్తీరం తగ్గించి నిర్మిస్తున్నారని స్థానికులు



ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్‌లో సుమారు 22 ప్రాంతాల్లో ప్రహరీల నిర్మాణం చేపట్టారు. తగ్గించి నిర్మించడంతో బోర్డు భారీగా నష్టపోతోందని వారు చెబుతున్నారు.

**విక్రయానికి విధి విధానాలు...**

హౌసింగ్ బోర్డు పరిధిలోని ఖాళీ స్థలాలు(ప్లాట్లు), నివాసాల(ఫ్లాట్లు) విక్రయానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో అధికారులు కసరత్తు ముమ్మరం చేస్తున్నారు. ఖాళీ స్థలాలకు ప్రహరీల నిర్మాణం జనవరి చివరి నాటికి పూర్తిచేయాలని నిర్ణయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ప్లాట్లు, ఫ్లాట్లను వేలం ద్వారా విక్రయించేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నారు. వాటిలో కొన్నింటిని గతంలో వేలం నిర్వహించినా అమ్ముడుపోలేదు. అప్పట్లో ఎందుకు విక్రయం కాలేదన్న అంశంపై దృష్టి సారించినట్లు ఓ అధికారి చెప్పారు. వేలం నాటికి పరిస్థితులను చక్కదిద్దటమో లేదా ఆయా స్థితులకు అనుగుణంగా ధరలు నిర్ణయించటమో చేయాల్సి ఉందని వివరించారు.

# పెద్ద దవాఖానాకు సుస్తీ!

కరీంనగర్ :తాళం వేసి కనిపిస్తున్నది ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎక్స్‌రే గది. ఇక్కడ ప్రతి రోజు కనీసం వంద మందికైనా ఎక్స్‌రే అవసరమవుతుంది. ఇక్కడ యంత్రాలు మరమ్మతుకు గురయ్యాయి. పరీక్ష అనంతరం ఎక్స్‌రే ఫిల్మ్ కూడా ఇవ్వరు. వాట్సప్‌లో వైద్యుడికి పంపిస్తారు. వైద్యులు పరీక్షించి ఫ్యాక్చర్ ఉందంటే ఉన్నట్టు.. లేదంటే లేదు. మరో వైద్యుడి అభిప్రాయం తెలుసుకోవడానికి ఫిల్మ్ ఇస్తే బాగుంటుందని రోగులు కోరుతున్నారు. ఇక్కడ యంత్రాలు పనిచేయకపోవడంతో రేడియాలజీ హబ్‌కు పంపిస్తున్నారు. రోగులకు సహాయకులకు, పేషెంట్ కేర్‌లకు ఇబ్బందిగా ఉంది.

సీటీ, అబ్డామిన్ స్కాన్ వద్ద రోగులు, సహాయకులు వీరు. ఇద్దరు రేడియాలజిస్టులే ఉండటంతో సేవల్లో జాప్యం జరుగుతోంది. గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఇక్కడ కూడా ఎలాంటి ఫిల్మ్‌లు, నివేదికలు ఇవ్వరు. సమస్య ఉన్నది, లేనిది కాగితంపై రాసిస్తారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఇక్కడ సేవలు నిలిచిపోతాయి. అత్యవసర పరిస్థితుల్లో రోగులు వచ్చిన పరీక్షించిన వైద్యులు బయటే స్కానింగ్ చేసుకోవాలని చెబుతున్నారు. ఆసుపత్రికి ఎంతోమంది క్షతగాత్రులు వస్తుంటారు. వారికీ నిరంతర సేవలు అందుబాటులో లేకపోవడం లోపం.

కరీంనగర్ జిల్లా ప్రభుత్వ జనరల్ పెద్ద ఆసుపత్రి.. నిధులు లేక, రోగులకు సరైన సేవలందించలేక వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతుంది. రావాల్సిన, కావాల్సిన నిధులు రాకపోవడంతో వైద్యాధికారులు చేసేది ఏమిలేక చేతులు ఎత్తేస్తున్నారు. చిన్నపాటి మరమ్మతుకు కూడా డబ్బులు లేవంటున్నారు. సరిపడా వైద్యులున్నా సరైన పరికరాలు లేక.. ఉన్నవి పనిచేయక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు పొరుగు జిల్లాలకు ఇది పెద్దదిక్కుగా ఉంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుంటేనే రోగులకు మెరుగైన సేవలు దక్కేది.

**బడ్జెట్ లేకుండా.. నిధులెలా?**

ఆసుపత్రులకు మంచాల సామర్థ్యాన్నిబట్టి నిధులు మంజూరు కావాలి. ఒక మంచానికి ప్రతినెల రూ.7500 రావాలి. ఈ లెక్కన 542 మంచాలకు ప్రతినెల రూ.40,65,000 అవసరం. అరకొరగా నిధులు వస్తున్నాయి. చెత్త డబ్బాలు కొనుగోలు చేయలేక ఆసుపత్రి పరిసరాలు డంపింగ్ యార్డుగా తలపించిన ఘటనలు ఉన్నాయి. రోగులను తరలించే స్ట్రెచర్లు, వీల్‌ఛైర్లు, శస్త్రచికిత్స వైద్య పరికరాలు అవసరమైనంత లేవు. ఎక్స్‌రే యంత్రాలూ మరమ్మతు చేయలేని పరిస్థితి. మందులు కూడా రోగులకు పూర్తిస్థాయిలో పంపిణీ చేయడంలేదనే ఆరోపణలున్నాయి. 15 ఐసీయూ మంచాలు ఉండగా, నాలుగైదు వెంటిలేటర్లు పనిచేయడంలేదు. ఐసీయూ మంచాల సంఖ్య పెంచడంతోపాటు 24 గంటలు శస్త్రచికిత్సలు జరిగేలా చూడాల్సిన అవసరముంది.

**ప్రజాప్రతినిధులూ స్పందించండి**

రోగులకు అందుతున్న వైద్యసేవల వివరాలు తెలిసేలా బోర్డులు ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆసుపత్రి సందర్శించినప్పుడు సూపరింటెండెంట్‌కు సూచించారు. ఆయన బడ్జెట్ లేదని తెలపడంతో కలెక్టర్ ఆసుపత్రికి కావాల్సిన కొన్ని ఏర్పాట్లు చేశారు. వివరాలు తెలిపే బోర్డులతోపాటు ఐసీయూకి మూడు ఏసీలు అందజేశారు. ఉమ్మడి జిల్లాలో పేరొందిన పలువురు ప్రజాప్రతినిధులున్నా ఆసుపత్రి వైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించడమే మరిచారు. తనిఖీలు చేయకున్నా.. తమ నిధులను ఒకసారి ఆసుపత్రికి మళ్లిస్తే రోగులకు మెరుగైన సేవలందుతాయి.

**ఉన్నతాధికారులకు నివేదించాం**

రోగులకు మెరుగైన సేవలందిస్తున్నాం. ఆసుపత్రికి కావాల్సిన వైద్య పరికరాలకు ఉన్నతాధికారులకు నివేదించాం. కొత్త ఎక్స్‌రే యంత్రాల కోసం ప్రతిపాదనలు పంపించాం.

– డాక్టర్ వీరారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్

# వందల్లో వెరై‘టీ’లు



హైదరాబాద్ : ఆహార రాజధాని భాగ్యనగరంలో దేశ, విదేశీ వంటకాలే కాదు..జిహ్వకు జీవం పోసే వందలాది రకాల ‘టీ’లు లభిస్తున్నాయి. ఇరానీచాయ్, గ్రీన్ టీ, అల్లం టీ, మసాలా టీతో ఆగిపోకుండా 400 రకాల ‘టీ’లు నగరంలోని వేర్వేరు కేఫ్, టీబార్లలో లభిస్తున్నాయి. మల్లె, మందారపూల మకరందం, గులాబీల గుభాళింపుతో చవులూరిస్తున్నాయి. రుచుల్లోనే కాదు ధరల్లోనూ అనేక వ్యత్యాసాలున్నాయి. రూ.5 నుంచి రూ.1000 వరకు ధర పలుకుతున్న తేనీరు నగరంలో అందుబాటులో ఉంది.

**టీ, బన్ మస్కా కోసం పరుగులు..**

నగరవాసులకు, చాయ్‌కు ఉన్న అనుబంధం ఈనాటిది కాదు. వందల ఏళ్లుగా ఇది కొనసాగుతోంది. ఉదయాన్నే పొగలు కక్కే ఇరానీ చాయ్, బన్‌మస్కా కోసం పదుల కిలోమీటర్ల నుంచి పరుగున చార్మినార్, లక్డీకాపూల్‌కు వస్తుంటారంటే చాయ్‌బంధం ఎలాఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తలసరి ‘టీ’ వినియోగంలోనూ హైదరాబాదీలు తొలి వరసలో ఉన్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనంలో చాయ్ ప్రియుల గురించి వెల్లడించింది. ఇళ్లలో 89శాతం మంది ‘టీ’ తాగుతుండగా, 8శాతం మంది కాఫీ తాగుతున్నారని వెల్లడించింది. హైదరాబాదీల్లో తలసరి ‘టీ’ వినియోగం 302 గ్రాములుగా ఉందని లెక్కగట్టింది.

**వందలాది ఔట్‌లెట్లు..**

చాయ్ తయారీతోనే వేలాది మంది నగరంలో ఉపాధి పొందుతున్నారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో టీస్టాల్ అసోసియేషన్లు వెలిశాయి. టీమాస్టర్లకు రూ.20,000 వరకు వేతనాలిస్తున్నారంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. ‘టీ’ అమ్మకానికి ఫ్రాంఛైజీలు సైతం అనేకం ఉన్నాయి. రూ.2లక్షల నుంచి రూ.3లక్షలు చెల్లించి వాటిని తీసుకొని చాలామంది పట్టభద్రులు ‘టీ’ వ్యాపారంలోకి వచ్చారు. చాయ్ ప్రియులను ఆకర్షించేందుకు వేర్వేరు రకాల ‘టీ’లను పరిచయం చేస్తూ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు.

**ఎన్ని రకాలో..**

తందూరి మట్కాచాయ్, కాశ్మీరీ చాయ్, బెల్లం చాయ్, లెమన్ టీ, జాఫ్రానీ చాయ్, గ్రీన్ చాయ్, ఇలాచీ చాయ్, బాదం టీ, కేసర్ స్పెషల్ టీ, పెప్పర్ టీ, పీచ్ ఉలాంగ్, యాపిల్ సినామన్, బ్లాక్ ఫ్రూట్‌టీ, బెర్రీ ఫ్రూట్ టీ, సిల్వర్ నీడిల్స్, మొరాకన్ టీ, పెప్పర్ మింట్, రాయల్ మచా, సంజీవని, ఫ్రెష్ బ్రీజ్, ఇండియన్ స్పైస్, తులసీ మింట్, వెర్జిన్ హెర్బ్, జెస్టీ జింజర్, స్పియర్‌మింట్, రెడ్‌జెన్, రష్యన్‌కారవన్, సిల్వర్ నీడిల్ వైట్ టీ, గ్రీన్ టీ, బ్లాక్ టీ ఇలా విభిన్న రుచులను అందిస్తున్నాయి. ప్రస్తుతం నగరంలో గోల్డెన్ టిప్స్ బ్లాక్ టీ కప్పు ధర రూ.1000 ఉంది. దీనికి గిరాకీ ఎక్కువే. సిల్వర్ నీడిల్ వైట్‌టీ, ఉలాంగ్, మొరాకన్ మింట్, జపనీస్ సెన్చా తరహా టీలు రూ.300 నుంచి లభ్యమవుతున్నాయి.

# బెట్టింగ్ యాప్‌లతో జీవితాలు చిత్తు



హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో ప్రభావశీలురుగా చెప్పుకొనే వారు గ్యాంబ్లింగ్ యాప్‌లను యథేచ్ఛగా ప్రచారం చేస్తూ ప్రజలను..ముఖ్యంగా యువతను తప్పుదోవ పట్టిస్తున్నారు. తెలిసి కొందరు, తెలియక మరికొందరు ఆ యాప్‌ల విష వలయంలో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. రుణ ఉచ్చులో చిక్కి తల్లడిల్లిపోతున్నారు.

రాజేంద్రనగర్ పరిధిలో ఆనంద్(42) అనే వ్యక్తి బెట్టింగ్ యాప్‌లకు బానిసయ్యాడు. సొమ్మంతా అందులో పెట్టి రూ.లక్షలు పోగొట్టుకున్నాడు. ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియక భార్య, కుమారుడికి విషమిచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండలం రుద్రారానికి చెందిన ఇదారి నవీన్(27).. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై సుమారు రూ.26 లక్షలు పోగొట్టుకున్నాడు. వాటిని తీర్చే మార్గంలేక తీవ్ర మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఈ ఏడాది అక్టోబరులో బలవన్మరణానికి పాల్పడ్డారు.

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కడారిగూడేనికి చెందిన గణేశ్ (22) ఆన్‌లైన్ బెట్టింగ్‌లో భారీగా నష్టాలు చవిచూశాడు. రూ.లక్షల్లో అప్పుల పాలయ్యాడు. రుణాలిచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు.

నిషేధమున్నా..: ‘1867 గ్యాంబ్లింగ్ యాక్ట్’ ప్రకారం.. బెట్టింగ్, జూదం నిషిద్ధం. కఠిన నిబంధనలున్నా ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫారాలు ప్రచారం చేస్తూనే ఉన్నాయి. సామాజిక మాధ్యమాల్లో ఇన్‌ఫ్లూయెన్సర్లుగా ఉన్నవారిని ప్రచారకర్తలుగా ఎంచుకుంటున్నాయి. స్వలాభానికి బెట్టింగ్, పలు నిషేధిత ట్రేడింగ్ యాప్‌లను ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

**నిషేధిత యాప్‌లే ఎక్కువ..**

మహాదేవ్, పరీమ్యాచ్, ఫెయిర్‌ప్లే, వన్‌ఎక్స్‌బెట్, లోటస్ 365, డఫాబెట్, బెట్‌వేసట్టాలతో సహా మొత్తం 174 యాప్‌ల వినియోగం మన దేశంలో నిషేధం. వీటి ప్రకటనలే సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా ప్రత్యక్షమవుతున్నాయి. పోలీసులకు దొరకకుండా ఆయా యాప్‌లకు ఎప్పటికప్పుడు పేర్లు మార్చి కార్యకలాపాలు సాగిస్తున్నారు. క్రికెట్ అభిమానులే లక్ష్యంగా బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. యాప్ డౌన్‌లోడ్ చేశాక మొదట్లో కొంత మొత్తంలో లాభాలు వచ్చినట్లు నిర్వాహకులు ఆశ చూపుతారు. తర్వాత ఎక్కువ మొత్తంలో లాగేసుకుంటారు. ఇది తెలియక పలువురు అప్పులు చేస్తున్నారు. రుణయాప్‌ల్లో ఇష్టారాజ్యంగా అప్పు తీసుకుంటున్నారు. తర్వాత రుణం తీర్చలేక వారి వేధింపులకు బలవుతున్నారు. బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# అధికారుల చర్చలు.. విస్తరణపై ఆశలు



గోదావరిఖని: రామగుండం విద్యుత్తు కేంద్రం విస్తరణ పనుల్లో ముందడుగు పడుతోంది. సింగరేణి, జెన్‌కో సంయుక్తంగా నిర్మించాలని నిర్ణయించగా దీనిపై రెండు సంస్థలకు చెందిన అధికారులు చర్చలు సాగిస్తున్నారు. ఈనెల 7న సింగరేణి, జెన్‌కో ఉన్నతాధికారులు సమావేశమై ఏ విధంగా ముందుకు వెళ్లాలన్న విషయంపై చర్చించారు. ఆ తర్వాత మరోసారి కూడా రెండు సంస్థల అధికారులు సమావేశమయ్యారు. రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడి అవసరం ఉండటంతో ఇందులో ఎవరు ఎన్ని నిధులు వెచ్చించాలన్న అంశాలపై చర్చించినట్లు తెలిసింది. నిర్మాణానికి సంబంధించిన పనులు త్వరలోనే చేపట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్న అధికారులు ఇప్పటికే దీనికి సంబంధించిన నివేదికలు తయారు చేశారు. నెల రోజుల క్రితం రామగుండం జెన్‌కో కేంద్రాన్ని సందర్శించిన అధికారులు పలు వివరాలు సేకరించారు. ఒకవైపు సంయుక్తంగా నిర్మించే ప్లాంటుపై చర్చలు జరుపుతూనే మరోవైపు ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేస్తుండటంతో నిర్మాణానికి సంబంధించిన పనులు త్వరలోనే చేపట్టే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

**అందుబాటులో వనరులు** రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేసేందుకు స్థలంతో పాటు బొగ్గు, నీరు అందుబాటులో ఉన్నాయి. బొగ్గు సరఫరాకు సింగరేణి సిద్ధంగా ఉంది. పక్కనే గోదావరినది ఉండటంతో నీటికి ఇబ్బంది లేదు. దీంతో 62.5 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాన్ని తొలగించి దాని స్థానంలో 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి ప్రణాళికలు చేశారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆగస్టు 31న సందర్శించి సింగరేణి, జెన్‌కోలు సంయుక్తంగా ప్లాంటు నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత ఒకటి రెండు సార్లు ప్రభుత్వం వద్ద జెన్‌కో అధికారులతో సమావేశమయ్యారు. ఇదే క్రమంలో సింగరేణి అధికారులతో సైతం సమీక్షించారు. దీనికి సింగరేణి ముందుకు రావడంతో పనులు ప్రారంభించుకోవడానికి మార్గం సుగమమైంది. కాగా జెన్‌కో సంస్థ సైతం దీనికి ఆసక్తి చూపినప్పటికీ కొంత మంది ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు మాత్ర సంస్థ ద్వారానే ప్లాంటు నిర్మాణం చేపట్టాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

**ఎవరికి ఎంత శాతం** రెండు సంస్థలు సంయుక్తంగా నిర్మాణం చేపట్టనుండటంతో ఎవరి వాటా ఎంత అన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ప్లాంటు నిర్మాణం తర్వాత నిర్వహణ బాధ్యత ఎవరికి ఉంటుందన్న విషయంలో కూడా ఇంకా నిర్ణయం తేలలేదు. రామగుండంలో నిర్మించే 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రంలో ఉద్యోగులు ఎవరు పనిచేస్తారన్న ప్రశ్న సైతం తలెత్తింది. ఇప్పటికే ఇందులో పనిచేస్తున్న జెన్‌కో ఉద్యోగులు, ఇంజినీర్లను తొలుత యాదాద్రికి మూకుమ్మడిగా బదిలీ చేశారు. అనంతరం వారి బదిలీలను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం విద్యుత్తు కేంద్రంలో ఉత్పత్తి నిలిపివేశారు. ఉద్యోగులు, అధికారులకు ఎలాంటి పని లేకపోయినా కొత్త ప్లాంటు నిర్మాణం జరిగే వరకు వారిని ఇక్కడే కొనసాగించేందుకు నిర్ణయించారు.

# మహబూబ్ గంజ్‌లో సమస్యల కొలువు

హైదరాబాద్: తెలంగాణలోనే అతి పెద్ద ఉల్లి విపణి మలక్‌పేట మార్కెట్ సమస్యలతో సతమతం అవుతోంది. మరోవైపు ఉన్న సౌకర్యాలను సక్రమంగా ఉపయోగించుకోలేని దుస్థితి నెలకొంది. నిత్యం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వందల లారీల సరకు మార్కెట్‌కు వస్తుంది. ప్రధానంగా ఉల్లి, మిర్చి, చింతపండు రైతులు, వ్యాపారులతో మార్కెట్ కిటకిటలాడుతుంటుంది. చిన్న చిన్న సమస్యలు సైతం ఏళ్ల తరబడి పరిష్కారం కావడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం బాగానే ఉంటున్నా.. వసతులు కల్పనపై దృష్టి సారించడం లేదని ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో మురుగు, పారిశుద్ధ్య సమస్యతో పాటు ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని రహదారులతో ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల క్రితం వేసిన మురుగు పైపుల సామర్థ్యం సరిపోకపోవడంతో తరచూ డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనుల ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు. కాంటా సమస్య ఏళ్లయినా పరిష్కారం కావడంలేదు. మార్కెట్ ఎక్కడా చూసినా.. కుళ్లిన ఉల్లిగడ్డలు, ఇతర వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి.



అంతర్గత **రోడ్లు అధ్వానం..**

నిత్యం వందల లారీలు తిరిగే మార్కెట్ అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. కంకర తేలడంతో సరకు వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. భారీ సంఖ్యలో లారీలు వస్తుండటం.. రోడ్లు గుంతలమయమై ఉండటంతో వాహనాలు నిలిచి పోతున్నాయని డ్రైవర్లు పేర్కొంటున్నారు. తరచూ వాహనాలు మొరాయిస్తుండటంతో డ్రైవర్ల మధ్య గొడవలు సాధారణమయ్యాయి. పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయని చెబుతున్నారు.

**వసతులు లేక అవస్థలు** సరకుతో అర్ధరాత్రి మార్కెట్‌కు చేరుకున్న రైతులు సాయంత్రం వరకు ఉండాల్సి వస్తుంటుంది. ఇక్కడ సదుపాయాలు లేకపోవడంతో నానా ఇక్కట్లు పడుతున్నారు. రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన విశ్రాంతి భవనం ఏడాది క్రితం ప్రారంభించినా వినియోగంలోకి రాలేదు. నిత్యం తాళం వేసి ఉండటంతో రైతులు క్యాంటీన్ వెలుపల, దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. సరకు వేలం తర్వాత చెల్లింపులకు సమయం ఉండటంతో.. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుందామన్నా అవకాశం లేదని నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన రైతు బసవేశ్వర్ ఆవేదన వ్యక్తంచేశారు.

# సహకార సంఘాల్లో ప్రాయోజిత సేవలు

ధర్మపురి : సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే అన్ని రకాల ఆన్‌లైన్ సేవలతో పాటు మరిన్ని ప్రాయోజిత సేవలను అందుబాటులోకి తేనుంది. ఇప్పటికే సంఘాల్లో సీఎస్‌సీ కేంద్రాల ద్వారా పలు రకాల సేవలందిస్తున్నారు. వీటిని బలోపేతం చేయడంతో పాటు మరిన్ని సేవలను అందించేందుకు ఈనెల 11న జిల్లా పాలనాధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో సహకార సంఘాల్లోని కంప్యూటర్ ఆపరేటర్లకు, సీఈవోలకు శిక్షణ ఇచ్చారు. జిల్లాలో 51 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా 15 సంఘాల్లో సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్లు)కేంద్రాలు నడుస్తున్నాయి. రైతులకు, ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు మిగతా సంఘాలకు లాగిన్ ఇచ్చారు. రైతులతో పాటు ఇతరులకు స్థానికంగానే సేవలందించాలన్న లక్ష్యంతో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆధార్‌కార్డు ద్వారా నగదు తీసుకునే విధంగా మినీ ఏటీఎం, ఆదాయపన్ను, ఇంటిపన్ను, విద్యుత్తు బిల్లుల చెల్లింపు, బీమా, రుణాల మంజూరుకు దరఖాస్తు, పాస్‌పోర్టు, రిజిస్ట్రేషన్లు లాంటి సేవలను చేరువ చేయనున్నారు. విమాన, బస్సు, రైలు రిజర్వేషన్లు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు సంఘంలోనే ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం



కల్పించనున్నారు. జనరిక్ మందుల దుకాణాలను నెలకొల్పేందుకు నాలుగు సహకార సంఘాల నుంచి ప్రతిపాదనలను పంపినట్లు అధికారులు తెలిపారు. లావాదేవీలు నిర్వహించేందుకు సహకార సంఘం నుంచి కరెంట్ ఖాతాలను తెరిచారు.

**ఇబ్బందులను అధిగమిస్తేనే...**

సహకార సంఘం పరిధి ఆధారంగా ఆయా సంఘాల్లో సిబ్బంది ఉన్నారు. పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి తేవాలంటే ప్రత్యేకంగా ఓ వ్యక్తిని నియమించాల్సిన అవసరం ఉంటోంది. మెరుగైన ఇంటర్‌నెట్ కనెక్షన్ కూడా అవసరం. వీటన్నింటినీ అధిగమిస్తేనే ప్రజలకు మెరుగైన సేవలందించే అవకాశం ఉంటోంది.

దశలవారీగా అమలు మనోజ్‌కుమార్, జిల్లా సహకారశాఖాధికారి, జగిత్యాల సహకార సంఘాల్లో దశలవారీగా అన్ని రకాల ఆన్‌లైన్ సేవలను అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈనెల 11న ఇచ్చిన శిక్షణలో ప్రజలకు అందించాల్సిన సేవలను వివరించాము. శిక్షణతో పాటు సందేహాలు నివృత్తి చేశాము. సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నాం.

# అంతా ఆరు తర్వాతే!

ఏలూరు : తడికలపూడిలోని ఓ ప్రైవేటు పాఠశాల నిర్వాహకురాలి అక్రమాలపై డిసెంబరులో సీఐడీ అధికారులు విచారణకు వచ్చారు. విద్యార్థులను రెచ్చగొట్టి సీఐడీ డౌన్ డౌన్, గోబ్యాక్ సీఐడీ అంటూ నినాదాలు చేయించారు. లోనికి రాకుండా అడ్డగించారు. విచారణ ఎగ్గొట్టేందుకు విద్యార్థులను అడ్డుపెట్టుకున్నారని ఆర్జేడీ, డీఈవో కార్యాలయాలకు ఫిర్యాదులు అందాయి. చర్యలు తీసుకోవాల్సింది పోయి రూ.లక్షల్లో ముడుపులు తీసుకుని మిన్నకున్నారు. ద్వారకాతిరుమల మండలంలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థిని కులం పేరుతో దూషించి..'మీకెందుకురా చదువులు' అని అమానుషంగా మాట్లాడారు. దీనిపై విద్యార్థి తండ్రి ఓ విద్యార్థి సంఘం ద్వారా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కులం పేరుతో దూషించిన ఆ ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులతో సరిపెట్టేందుకు.. ప్రతిఫలంగా ఓ లకారం వసూలు చేసినట్లు తెలుస్తోంది.

కామవరపుకోట మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ విద్యార్థినిని విచక్షణారహితంగా చెప్పుకోలేని చోట కొట్టి..హింసించారు. ఈ వ్యవహారం మొత్తం సీసీ కెమెరాల్లో రికార్డ్ అయింది. కరస్పాండెంట్ తీరుపై వీడియో సహా తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆధారం ఉన్నా విద్యాశాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. పైగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని.. విదార్థినిని కొట్టిన కరస్పాండెంట్‌నే రాతపూర్వకంగా ఆదేశించడం గమనార్హం. దీనికి రూ.2 లక్షలు వసూలు చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం అక్రమాలకు..అడ్డాగా మారింది. ముడుపులిస్తే ఎంత పెద్ద తప్పు చేసినా చర్యలుండవు. నజరానాలు సమర్పిస్తే చాలు మసిపూసి మారేడు కాయ చేసే ఘనులు కార్యాలయంలో తిష్ఠవేశారు. ఏళ్లు గడుస్తున్నా వేళ్లూనుకుపోయిన ఆ సిబ్బందిని ఉన్నతాధికారులు సైతం కదపలేకపోతున్నారు. దీంతో అక్రమార్కులకు అండగా నిలబడుతూ విచారణలను నీరుగారుస్తున్నారు. దీంతో విద్యాశాఖ ప్రతిష్ఠ మసకబారుతోంది.

**కథ నడిపేది వారే..**

డీఈవో కార్యాలయంలో ఏ దస్త్రం కదలాలన్నా..అక్రమాలను తొక్కిపెట్టాలన్నా ఆ అయిదుగురు సిబ్బందే కీలకం. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవర్తించినా..అకారణంగా హింసించినా.. అక్రమాలకు పాల్పడినా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశిస్తారు. ఆ విచారణలకు ఎప్పుడూ ఈ అయిదుగురిలో ముగ్గురు వెళ్లేలా ఏర్పాటు చేసుకుంటారు. బాధితులు కార్యాలయం చుట్టూ తిరిగినా రేపుమాపంటూ వాయిదాలేస్తారు. బాధ్యులు కార్యాలయానికి వస్తే 'ఇప్పుడొచ్చారేంటి అంతా ఆరు తర్వాతే' అంటూ ముడుపుల విషయం నర్మగర్భంగా చేరవేస్తారు. ఆరు తర్వాత ప్రైవేటు ప్రాంతాల్లో కలిసి రేటు తెగ్గొడతారు.

**అడిగింది ఇస్తే చాలు**

వారు అడిగింది ఇచ్చి.. విచారణకు వచ్చినప్పుడు రాచ మర్యాదలు చేస్తే చాలు ఎంత పెద్ద అక్రమమైనా, ఆరోపణలైనా సరే పట్టించుకోరు. బాధితులను సైతం సంప్రదించరు. పైకి మాత్రం మేం నిజాయతీగా విచారణ చేశాం పాపం పుణ్యం అంతా ఉన్నతాధికారుల చేతుల్లోనే అంటూ చెప్పుకొస్తారు. విచారణ స్థాయిని బట్టి రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకు వసూలు చేసిన వ్యవహారాలు కోకొల్లలు.

**పాతుకుపోయారు**

డీఈవో కార్యాలయంలో కథ నడిపిస్తున్న సిబ్బంది ఏళ్లుగా పాతుకుపోయారు. ఓ అధికారికి సహాయకుడిగా ఉండే ఉద్యోగి పుష్కరం దాటినా, అధికారులు మారినా అదే స్థానంలో కొనసాగుతున్నారు. కార్యాలయంలో దందాలకు అతనే సూత్రధారి. మిగిలిన నలుగురు సైతం ఏళ్లు గడుస్తున్నా కదలడం లేదు. వారిపై ఎన్ని ఆరోపణలు వచ్చినా తమకు అన్నీ చక్కబెడుతున్నారని ఉన్నతాధికారులు వారిని పెంచి పోషిస్తున్నారన్న విమర్శలున్నాయి. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

# స్పందిస్తే 'ప్రాణదాత'లు మీరే..!

భీమవరం : అయిదు నిమిషాల ముందు తీసుకొచ్చి ఉంటే బతికేవారు.. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఉద్దేశించి వైద్యులు చెప్పే మాటలివీ. సామాజిక మాధ్యమాలు రాజ్యమేలుతున్న ప్రస్తుత రోజుల్లో రహదారి ప్రమాదం జరిగితే ఆ దృశ్యాలను చరవాణిలో బంధిం చేందుకు స్థానికులు పోటీపడుతున్నారు గానీ క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు సాయమందించడానికి వెనకడుగు వేస్తున్నారు. దీన్ని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం గుడ్ సమరిటన్ పథకం ప్రవేశపెట్టినా అవగాహన లేకపోవడంతో చాలామంది ముందుకు రావడం లేదు.

**ఇదీ పరిస్థితి**ఉమ్మడి జిల్లాలో 26 రాష్ట్ర రహదారులతోపాటు 16, 216, 216 ఎ, 165, 513 ఎ, 516డీ, 516ఈ, 365బీబీ, జాతీయ రహదారులున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వీరిని ఆసుపత్రికి తరలించడానికి 108 అంబులెన్స్‌లు 49 అందుబాటులో ఉన్నాయి. ప్రమాద ఘటనకు 10–15 నిమిషాల్లో, గరిష్ఠంగా 25–30 నిమిషాల్లో వాహనం చేరుకుంటుంది. ఆలస్యమైన సందర్భాల్లో స్థానికులు ఇతర వాహనాల్లో ఆసుపత్రికి తరలించే అవకాశమున్నా.. ఆ మేరకు ఆలోచనలు చేయడం లేదు.ఉమ్మడి జిల్లాలో వాహన ప్రమాదాల్లో రహదారులపై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. సకాలంలో వైద్యం అందకే దాదాపు 50 శాతం మృతి చెందుతున్నారని, గాయపడిన వారిని గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన గంటలోపు)లో ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు నిలిపేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వారిని ఆసుపత్రికి తరలిస్తే పోలీసుస్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందనే భయంతో చాలా మంది పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గుడ్ సమరిటన్ పథకాన్ని మూడేళ్ల కిందటే ప్రారంభించినా ప్రచారం లేకపోవడంతో ప్రజలకు అవగాహన కొరవడింది.

**పథకం అమలిలా..** జాతీయ, రాష్ట్ర రహదారులపై జరిగిన ప్రమాదాల్లో క్షతగ్రాతులను ఆసుపత్రికి తరలిస్తే రూ.5 వేలు 'గుడ్ సమరిటన్' కింద అందుతుంది. ఇది పొందాలంటే బాధితుడిని గంటలోపు ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారమివ్వాలి. వారు ప్రాణదాత అంటూ ప్రమాద వివరాలతో కూడిన లేఖనిస్తారు. ఇది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి సొమ్ము ప్రాణదాత ఖాతాలో జమవుతుంది. ప్రశంసాపత్రం ఇస్తారు. ఒక వ్యక్తి గరిష్ఠంగా ఏడాదిలో అయిదు సార్లు అవార్డు పొందవచ్చు. కాపాడిన వ్యక్తి వ్యక్తిగత వివరాలేవీ చెప్పాల్సిన, డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఆసుపత్రిలో చేర్పించి వెళ్లిపోవచ్చు. ఎవరి నుంచి వేధింపులు లేకుండా కమిటీ రక్షణ కల్పిస్తుంది. ఏడాదిలో ఎక్కువ మందిని కాపాడిన పది మందిని ఎంపిక చేసి రూ.లక్ష చొప్పున అందిస్తారు.

అపోహలొద్దు.. క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్తే పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోందని భయపడాల్సిన అవసరం లేదు. ఆ అపోహలను వదిలేయాలి. ఆపదలో ఉన్నవారిని వెంటనే ఆదుకోవాలి' అని ఏలూరు, పశ్చిమ ఎస్పీలు ప్రతాప్‌శివకిశోర్, నయీం అస్మి తెలిపారు.

# ఇంటి వద్దకే 30 రకాల సేవలు



కర్నూలు : ఏసీ చెడిపోయినా.. గీజర్ మొరాయించినా.. కార్పెంటర్‌తో పని పడినా.. పట్టణ వాసులు పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.. వాటిని బాగు చేసేవారు ఎక్కడుంటారో తెలియదు.. తెలిసినా అక్కడికెళ్లేందుకు సమయం ఉండదు.. ఎంత మొత్తం తీసుకుంటారో తెలియదు.. ఈ సమస్యలకు పరిష్కారం చూపడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ముందుకొచ్చింది. ఎలక్ట్రికల్, కార్పెంటర్, శానిటరీ, ప్లంబింగ్, పెయింటింగ్, ఏసీ, రిఫ్రిజిరేటరు, వాషింగ్ మెషిన్, చరవాణుల మరమ్మతులు, వాటర్ ప్యూరిఫయర్, బ్యూటీషియన్ తదితర రకాల సేవలు తొలుత అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ తర్వాత 30 రకాల సేవలకు విస్తరించనున్నారు.

**పట్టించుకోని వైకాపా**

పట్టణ వాసులకు అవసరమైన సేవలు ఇంటి వద్దే అందిస్తూ కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో గతంలో తెదేపా హయాంలో మెప్మా ఆధ్వర్యంలో సిటీ లైవ్లీ హుడ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పలు విభాగాలకు చెందిన మెకానిక్‌ల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొంది.. ప్రజల ఇంటి వద్దే వివిధ సేవలు అందించాలన్న లక్ష్యంతో సర్వీస్ ప్రొవైడర్ల వ్యవస్థను తీసుకురావాలని నిర్ణయించింది. ముందుకొచ్చిన ప్రొవైడర్లకు నెలకు కనీసం రూ.20 వేల నుంచి రూ.30 వేలు వచ్చేలా ప్రణాళిక రూపొందించారు.

**ఈనెలాఖరులోపు దరఖాస్తుల స్వీకరణ**

మెప్మా ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో పనిచేసే నిపుణులను గుర్తించే ప్రక్రియ ఇప్పటికే సాగుతోంది. ఎవరైనా వివిధ వృత్తుల్లో నైపుణ్యం కలిగినవారు ఉంటే ఉమ్మడి జిల్లాలో మెప్మా కార్యాలయాలను సంప్రదించి వివరాలు అందించవచ్చు. ఈనెలాఖరులోపు దరఖాస్తులు స్వీకరిస్తారు. అనంతరం ఆయా విభాగాల వారీగా అభ్యర్థులను ఎంపిక చేసి త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**ప్రత్యేక యాప్ రూపకల్పన**

ఇందుకోసం కొత్తగా యాప్‌ను అందుబాటులో తీసుకొచ్చారు. హెూం ట్రయాంగిల్ సంస్థలో ఒప్పందం చేసుకొన్నారు. త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నారు. నైపుణ్యమున్న మెకానిక్‌ల (సర్వీస్ ప్రొవైడర్లు)ను గుర్తించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కర్నూలు జిల్లాలో 850, నంద్యాలలో 600 మంది నిపుణులను గుర్తించాలని లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు.

ప్రొవైడర్ల ఫోన్ నంబర్లు, చిరునామాతో సహా యాప్‌లో పొందుపరుస్తారు. ఆయా వివరాలు అందరికీ తెలిసేలా సెల్లార్ పాయింట్ నంబరు ఏర్పాటు చేస్తారు. మెప్మా ద్వారా ప్రభుత్వమే ఆయా సేవలకు ధర నిర్ణయించనుంది. ఈ సేవలందించే సర్వీసు ప్రొవైడర్లకు రెండు టీషర్టులతోపాటు గుర్తింపు కార్డు ఇవ్వనున్నారు. ప్రజల అవసరాన్ని బట్టి వారి ఇంటికే సంబంధిత నిపుణుడిని పంపిస్తారు.

**శిక్షణ ఇస్తారు.. ఉపాధి కల్పిస్తారు**

వీరిని ఎంపిక చేయడం.. శిక్షణ ఇవ్వడం.. తదితర పనులు వచ్చే మార్చి 8వ తేదీకి పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పురపాలక సంఘాల పరిధిలోని వివిధ విభాగాల్లో టెక్నీషియన్లను గుర్తించే బాధ్యతను మెప్మా విభాగానికి కేటాయించారు. వీరికి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ అందించి ధ్రువపత్రాలు ఇస్తారు. అనంతరం వారి వివరాలు హెూమ్ ట్రయాంగిల్ యాప్‌లో నమోదు చేస్తారు. సర్వీస్ ప్రొవైడర్లుగా నమోదు చేసుకున్నవారు మొదటి మూడు నెలలపాటు నెలకు రూ.1,500 చొప్పున సదరు యాప్ నిర్వాహకులకు నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. మూడు నెలలపాటు సదరు రంగంలో నిలదొక్కుకున్న తర్వాత.. నాలుగో నెల నుంచి సదరు యాప్ నిర్వాహకులకు ప్రతి నెలా రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది.

# గడువు దాటుతున్నా.. గడప దాటని పనులు




ఆదోని : ఆదోని పురపాలక సంఘం డంపింగ్ యార్డులో చెత్త దిబ్బలు తొలగించి, పచ్చదనం పెంపు, నీటి వసతి ఏర్పాట్లకు ఆమోదం తెలిపారు. వీటిని 15వ ఆర్థిక సంఘం కింద రూ.40 లక్షలతో చేపట్టాలని నిర్ణయించారు.. టెండర్ పూర్తయినా.. నేటికీ పనులు ప్రారంభం కాలేదు. చెత్త పేరుకుపోవడంతో టిడ్కో నివాసాలు, రాయనగర్, మదిరె, ఇస్వీ, పర్వతాపురం కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు.పట్టణీకరణ పెరుగుతోంది.. జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్రం ఏటా టైడ్, అన్‌టైడ్ కింద పురపాలికలకు నిధులు విడుదల చేస్తుంది. వాటితో మంచినీటి సమస్యలు, రహదారులు, మురుగు కాల్వలు, మురుగునీటి శుద్ధి, పార్కుల అభివృద్ధికి వినియోగించుకోవాలి. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా పట్టించుకోలేదు.. నిధులు మూలుగుతున్నాయి.. సమస్యలు రాజ్యమేలుతున్నాయి.. ప్రస్తుతం మిగిలిన నిధులు వచ్చే ఏడాదిలో వినియోగానికి అనుమతి ఇవ్వాలని పురపాలికలు 'కూటమి' ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి.

**ఎక్కడ ఎలా ఉందంటే**

రూ.26.73 కోట్లతో 91 పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో రూ.11.17 కోట్ల విలువైన 67 పనులు పూర్తిచేశారు. టెండర్ దశలో ఆరు, ఒప్పందం పూర్తి చేసుకుని ప్రారంభించనివి నాలుగు, పురోగతిలో 9 పనులు ఉన్నాయి. మరో ఐదు ఆమోదానికి ఎదురుచూస్తున్నాయి.

పురపాలక సంఘంలో రూ.22 కోట్లతో 48 పనులు చేపట్టారు. 28 పనులకు టెండర్లు పిలిచారు. ఆరు పనులకు వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. ఐదు పనుల టెండర్లు పూర్తయినా.. గుత్తేదారులు చేపట్టకపోవడంతో రద్దు చేశారు. రూ.2–3 కోట్ల విలువైన బిల్లులు రావాల్సి ఉంది.

రూ.92 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.54 కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.10 కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిన వాటికి ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. చేసిన పనుల్లోనూ చాలా వరకు రూ.కోట్లలో బిల్లులు రావాల్సి ఉండటంతో, గుత్తేదారులు ముందుకు రాలేదని సమాచారం.

నంద్యాల పురపాలక సంఘానికి రూ.51.27 కోట్లతో పనులు మంజూరయ్యాయి. 128 పనులకు ప్రణాళిక రూపొందించారు. వీటిలో 91 పనులు పూర్తిచేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. 13 పనులు పురోగతిలో ఉన్నాయి.నగర పంచాయతీకి రూ.11.11 కోట్లు రాగా.. రూ.4.75 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో 30 పనులకు గాను 12 పూర్తిచేశారు. 8 పనులు పురోగతిలో, మూడు టెండర్ దశలో ఉన్నాయి. ఏడు పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది.

వైకాపా వదిలేసింది

కేంద్రం ఐదేళ్లకోసారి ఆర్థిక సంఘం పేరుతో స్థానిక సంస్థలకు రూ.కోట్లు అందిస్తోంది.. నిధులకు తగ్గట్లు ప్రణాళిక చేసుకుని పనులు చేపట్టాలి.

ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాలకు కేంద్రం అందించిన 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో ఖర్చు చేయలేదు.

ఆర్థిక ఏడాది ముగిసే సమయం ముంచుకొస్తున్న తరుణంలో ఖజానాలో రూ.కోట్ల నిధులున్నా.. ఉన్న పళంగా ఖర్చు చేసుకోలేని వింత పరిస్థితి నెలకొంది.

ఆర్థిక సంఘం నిధులతో పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ఆసక్తి చూపుతుంటారు. బిల్లులు ఆపే పరిస్థితి ఉండదనేది వారి నమ్మకం. వారికి భవిష్యత్తులో ప్రాధాన్యం ఇచ్చేవారు. గత వైకాపా పాలనలో ఏ పేరు మోసిన గుత్తేదారూ ముందుకు రాలేదు.

# పశువైద్య విద్యకు సర్దుపోటు!

గరివిడి: ఉత్తరాంధ్రలోనే ఏకైక పశువైద్య కళాశాలను జిల్లాలోని గరివిడిలో ప్రారంభించి నాలుగేళ్లయినా.. ఇంకా పరిస్థితి అస్తవ్యస్తంగానే ఉంది. భారత పశువైద్య మండలి (వీసీఐ) నిబంధనలకు అనుగుణంగా అధ్యాపకుల నియామకాలు, సౌకర్యాల కల్పన నేటికీ జరగలేదు. వీసీఐ అనుమతుల్లేకుండానే 2023, 2024 విద్యా సంవత్సరాలకు సంబంధించిన బోధన సాగుతోంది. తదుపరి అనుమతి రాకుంటే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికైనా ఈ కళాశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించాల్సి ఉంది.

**నిధులు దారి మళ్లించారు..**ఉత్తరాంధ్రకు పశువైద్య విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.82 కోట్ల నాబార్డు నిధులతో కళాశాలను మంజూరు చేసింది. అన్ని అనుమతులివ్వడంతో పాటు కళాశాల ప్రధాన భవనం, వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్, విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహాల నిర్మాణాలు చేపట్టారు. పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించకుండానే 2021లో వైకాపా పాలకులు కళాశాలను హడావుడిగా ప్రారంభించి వదిలేశారు. నాబార్డు నిధులను ఇతర అవసరాలకు మళ్లించారు. గుత్తేదారుకు దాదాపు రూ.14 కోట్లు బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు నిలిచాయి. క్లినికల్ కాంప్లెక్స్ భవనంలో బోధన సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. **శాశ్వత అధ్యాపకుల నియామకాల్లేవు..** కళాశాలలో ప్రస్తుతం నాలుగో ఏడాది బోధన జరుగుతోంది. 17 విభాగాల్లో 280 మంది విద్యార్థులున్నారు. బోధనకు, వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌లో పశు వైద్య విభాగానికి కలిపి వీసీఐ నిబంధనల ప్రకారం ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు మొత్తం 86 మంది అవసరం. కళాశాలను మంజూరు చేసినప్పుడే నాటి ప్రభుత్వం 64 మంది శాశ్వత అధ్యాపకులను నియమించేందుకు జీవో జారీ చేసింది. వైకాపా ఒక్కరినీ నియమించలేదు. దాంతో నిర్వహణ బాధ్యతలు చూస్తున్న తిరుపతి వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం తన పరిధిలోని తిరుపతి, గన్నవరం కళాశాలల నుంచి 24 మంది అధ్యాపకులను ఇక్కడకు సర్దుబాటు చేసింది. గతేడాది నవంబరులో వీసీఐ బృందం తనిఖీ అనంతరం 14 మందిని డిప్యుటేషన్‌పై ఇతర కళాశాలలకు పంపించారు. **ఆందోళన అవసరం లేదు..**కళాశాల భవిష్యత్తుపై ఎలాంటి ఆందోళన అవసరం లేదు. మొదటి బ్యాచ్ పూర్తయ్యేలోగా అనుమతులొస్తాయి. సౌకర్యాలన్నీ సమకూర్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. పెండింగ్ బిల్లులు విడుదలయ్యాయి. మార్చిలోగా ప్రధాన భవనంతో పాటు రోడ్లు నిర్మిస్తారు. ప్రస్తుతం 55 మంది అధ్యాపకులతో ఇబ్బంది లేకుండా బోధన సాగుతోంది.ఎం.శ్రీను, అసోసియేట్ డీన్, పశువైద్య కళాశాల

# అవినీతి అధికారులపై మొక్కుబడి చర్యలు

భీమవరం : కార్యాలయ సిబ్బంది చేసిన పనులకు ఉన్నతాధికారులు బిల్లులు చెల్లించినా వాటిని జమ చేయకుండా గతంలో తణుకు ఎంపీడీవోగా చేసి ప్రస్తుతం కోనసీమ జిల్లాకు బదిలీ అయిన ఓ అధికారి సొంతానికి వాడుకున్నారని బాధితులు ఆరోపించారు. బదిలీపై వెళ్లేటప్పుడు అకౌంట్లు, ఓచర్లను కార్యాలయ పరిపాలనాధికారికి అప్పజెప్పాల్సి ఉన్నా అవేమీ చేయలేదు. మొత్తంగా రూ.4 లక్షలకు సంబంధించిన ఓచర్లను పరిపాలనాధికారికి అప్పగించలేదని నివేదికలో పొందుపరిచారు. దీనికి సంబంధించి మెమోలిచ్చినా, సీఈవో హెచ్చరించినా ఫలితం లేకుండా పోయింది.

గతంలో మొగల్తూరు తహసీల్దారు ఓ అధికారి ప్రభుత్వ పట్టా భూములను ఆన్‌లైన్‌లో మ్యుటేషన్ చేసి ప్రైవేటు వ్యక్తుల పరం చేశారు. ఆ సమయంలో పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు అనేక ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం జిల్లాలోనే మరో మండలంలో పనిచేస్తున్నారు.

గతంలో పాలకొల్లు నియోజకవర్గంలో తహసీల్దారు కార్యాలయంలో పనిచేసిన ఓ అధికారి చేతులు తడిపితే గాని పత్రాలిచ్చేవారు కాదు. సదరు అధికారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో జిల్లాలోనే మరొకచోటకు బదిలీ చేశారు.

గతేడాది తాడేపల్లిగూడెం కడకట్ల ఈతకొలను సమీపంలో ఉన్న ఓ లేఅవుట్‌కు ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఓ అధికారి అనధికారికంగా నాలుగు అంగుళాల పైపును సుమారు 250 మీటర్ల మేర వేశారు. ఇందుకు వినియోగించిన పైపులు, ఇతర పరికరాలు మున్సిపాలిటీకి చెందినవనే ఆరోపణలు బలంగా వినిపించాయి. ఇందుకోసం లేఅవుట్‌దారుల నుంచి పెద్ద మొత్తంలో సొమ్ములు తీసుకున్నారు. దిగువస్థాయి సిబ్బంది వద్దని మొరపెట్టుకున్నా సదరు అధికారి పట్టించుకోకుండా బలవంతంగా పైపులైను వేశారు. సదరు అధికారి బదిలీపై వెళ్లిపోవడంతో విషయం సద్దుమణిగింది. అక్రమాలకు పాల్పడిన అధికారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.



ప్రజలకు సత్వర సేవలందించాల్సిన అధికారులు కొంతమంది మామూళ్ల మత్తులో జోగుతున్నారు. కొన్ని విభాగాల్లో పైసా ఇస్తేనే పని అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మరికొంతమంది ప్రభుత్వ సొమ్మును సొంత ఖాతాలకు మళ్లించుకుంటున్నారు. ఒకవేళ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా నామమాత్రపు చర్యలు, బదిలీలతో సరిపెడుతున్నారు.

**విచారణలు నామమాత్రం**

2021లో పెనుమంట్ర మండలం పొలమూరు పంచాయతీలో పక్కదారి పట్టిన నగదు వ్యవహారాలు నేటికీ తేలలేదు. పెనుగొండ పంచాయతీలో అవకతవకలు, గతంలో వేల్పూరు పంచాయతీ కార్యదర్శి, దువ్వలో సిబ్బంది పంచాయతీ సొమ్ము విషయంలో చేతివాటం ప్రదర్శించారు. వాటికి సంబంధించిన విచారణలు నెలల తరబడి జరుగుతుండటంతో నీరుగారిపోతున్నాయి.

**మామూళ్లు అందితేనే పత్రం!**

పంచాయతీ నిధుల దుర్వినియోగం విషయంలో వివిధ సందర్భాల్లో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. ఇందులో కొన్ని విచారణల దశలో ఉన్నాయి. ఏటా నిర్వహించే ఆడిట్లోనూ ఎన్నో అభ్యంతరాలు గ్రామ పంచాయతీ లెక్కలకు సంబంధించి తనిఖీల్లో బయటపడుతున్నాయని సమాచారం. పౌర సేవా పట్టిక ప్రకారం జారీచేసే అనుమతులు విషయంలో కొందరు మామూళ్లు అందితేగాని పత్రాన్ని అందించని పరిస్థితి కొన్నిచోట్ల నెలకొంది. ఇంటి అనుమతులు మొదలు.. గ్రామ పరిధిలో వెంచర్ల ఏర్పాటులో కొన్ని పెద్ద పంచాయతీల్లో అధికారులు దండిగా దండుకుంటున్నారనే అభియోగాలున్నాయి.

# పట్టాలెక్కని ప్రతిపాదనలు!

పాలకొల్లు : అన్నదాతలకు ఏటా నష్టాలు మిగులుస్తున్న వడ్డిలంక నక్కల అవుట్‌ఫాల్ స్లూయిజ్ మరమ్మతుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. వర్షాకాలంలో పైనుంచి వచ్చే మురుగును, వరదల సమయంలో ఎదురొచ్చే నీటి ఉద్ధృతిని నిలువరించడంలో స్లూయిజ్ తలుపులు విఫలమవుతున్నాయి. యలమంచిలి, పోడూరు, ఆచంట మండలాల్లో వేలాది ఎకరాల ఖరీఫ్ పంట మునకకు కారణమవుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి మంత్రి నిమ్మల రామానాయుడు చొరవ చూపుతూ.. స్లూయిజ్ మరమ్మతులకు 2024లో రూ.45 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. ఈ ఏడాదే పనులు పట్టాలెక్కిస్తే కన్నీళ్లు తుడిచిన వారవుతారని అన్నదాతలు చెబుతున్నారు.

**పంట నష్టమిలా..**

ఏటా జూన్‌లో కురిసే వర్షాలకు స్లూయిజ్ కాలువ పొంగుతోంది. జులై నుంచి వశిష్ట గోదావరికి వరద ఉద్ధృతి పెరుగుతుండటంతో ఆ నీరు నక్కల కాలువలోకి ఎదురొస్తోంది. ఆ జలాలను నిలువరించాల్సిన



స్లూయిజ్ తలుపులు మొరాయిస్తున్నాయి. కింది భాగంలో 6, పైభాగంలో 6 చొప్పున మొత్తం 12 తలుపులుండగా.. కింది తలుపులు సరిగా పని చేయడం లేదు. గడిచిన అయిదేళ్ల వైకాపా పాలనలో ఏటా ప్రతిపాదనలు పంపడం మినహా.. మరమ్మతులకు కనీస ప్రయత్నాలు చేపట్టలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో.. తమ సమస్య నెరవేరుతుందన్న ఆశలో డెల్టా రైతులున్నారు.

**సమయమిదే..**ఫిబ్రవరి సమీపిస్తున్న నేపథ్యంలో.. వర్షాల సమస్య ఉండదు. కాలువలో నీరు సైతం తగ్గుముఖం పట్టింది. స్లూయిజ్ తలుపులు తీసి మరమ్మతులు చేసేందుకు ఇదే సరైన సమయం. రెండు నెలలు సమయం తీసుకొని మే నెలకు పనులు ముగిస్తే ఖరీఫ్ కష్టాలు తొలగుతాయి. దీనిపై ఏఈ దుర్గారావును వివరణ కోరగా.. కింది తలుపుల మరమ్మతులకు రూ.45 లక్షలు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం టెండర్లు పిలిచామన్నారు. మార్చి చివరికి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# గున్నలుంటే.. ఎవరూ ఆపలేరు

తిరుపతి : ఏనుగులు మనల్ని చూసినా.. మనం వాటి దగ్గరకు వెళ్లాలని చూసినా మనకే రిస్క్ అంటున్నారు అటవీశాఖ అధికారులు. ఆహారం కోసం అడవులను వదిలి జనావాసాల్లోకి వస్తున్న వాటిని హడలుగొట్టడం, అడ్డుకోవాలని చూడటంతో ప్రాణాలను పణంగా పెట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా., అటవీశాఖ సిబ్బంది సహకారం లేకుండా వాటిని దారి మళ్లించేందుకు ప్రయత్నం చేయవద్దని స్పష్టం చేస్తున్నారు.


**మొత్తం 130 ఏనుగుల సంచారం**

తాజా అంచనాల ప్రకారం తమిళనాడు నుంచి పలమనేరు మీదుగా శేషాచలం వరకు సుమారు 130 ఏనుగులు సంచరిస్తున్నాయి. ఇందులో చిత్తూరు పరిసర ప్రాంతాల్లో 20, శేషాచలం అడవుల్లో మరో 20 తిరుగుతున్నట్లు సమాచారం. మిగిలిన ఏనుగులు ఆహారం, నీటి కోసం నిరంతరం అటూఇటూ రాకపోకలు సాగిస్తున్నట్లు గుర్తించారు.

**పనబాకంలో ఉన్నవి మరీ ప్రమాదం..**

ప్రస్తుతం పనపాకం రేంజి పరిధిలో సంచరిస్తున్న 15 ఏనుగుల గుంపు బయటి నుంచి వచ్చిందే. ఇందులో గున్నలు (పిల్లలు) ఉన్నాయని, ఈ కారణంగానే మనుషులపై దాడులు చేస్తున్నాయని, ఆ సమయంలో వాటిని అదుపుచేసే శక్తి ఎవరికీ ఉండదని వెల్లడిస్తున్నారు. సుశిక్షితులైన ట్రాకర్లు , కుంకీ ఏనుగులున్నా ప్రయోజనం ఉండదని, వాటి జోలికి వెళ్లకుండా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

**భారీ కాయం.. జ్ఞాపకశక్తి అమోఘం**



ఏనుగులు భూమిపై ఉన్న భారీ.. అతితెలివైన, చురుకైన జంతువు. మనుషులకంటే తెలివిగా, అద్భుతమైన జ్ఞాపకశక్తితో దెబ్బకు దెబ్బతీయగల శక్తిసామర్థ్యాలతో ఉంటాయి.

**ఈ జాగ్రత్తలు పాటించాలి**

మందలు పంటపొలాలు, గ్రామాల సమీపంలోకి వచ్చిన సమయంలో ప్రజలు వాటి కంటపడకుండా ఉండేందుకు ప్రయత్నించాలి.

గ్రామాలు, పొలాల మీదుగా వెళ్లే సమయంలో వాటిని రెచ్చగొట్టేలా శబ్దాలు చేయడం, టపాకాయలు కాల్చడం, అరుపులు కేకలు వేసి అడ్డుకునే ప్రయత్నం చేయరాదు. వాటిదారిన అవి వెళ్లేలా సహకరించాలి.ఏనుగులు రాత్రి సమయంలో పంటపొలాల వద్దకు వస్తున్న నేపథ్యంలో సాయంత్రం ఐదు దాటిన తరువాత పంట పొలాల్లో ఉండకూడదు. మరీముఖ్యంగా రాత్రి సమయంలో ఎలాంటి అలికిడి వచ్చినా ఇళ్లను విడిచి బయటకు రాకూడదు.

ఏనుగులకు 500 మీటర్ల దూరాన్ని పాటించాలి.

వాటి రాక గురించి తెలిసిన వెంటనే ముందుగా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. వాటిని అటవీ ప్రాంతంలోకి తరలించడం కోసం సొంత ప్రయత్నాలు చేయకూడదు. ప్రత్యేకంగా నియమించిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ సహకారం తీసుకోవాలి.


నిటారు ప్రాంతాల్లోనూ సునాయాసంగా పరుగెత్తగల నేర్పున్న ఏనుగుల నుంచి దూరంగా ఉండాలి. అటవీ సమీప గ్రామాల ప్రజలు ఆహార పదార్థాలు, వాటి వ్యర్థాలను ఏనుగులు పసిగట్టకుండా జాగ్రత్తగా భద్రపరచుకోవాలి.రాత్రి సమయంలో ఏనుగుల ప్రభావిత ప్రాంతాల్లో రాకపోకలు సాగించేవారు తప్పనిసరిగా టార్చిలైట్లను చేతపట్టుకుని, గుంపులుగా వెళ్లాలి.

**రక్షణ చర్యలు తీసుకుంటున్నాం**

ఏనుగుల నుంచి ప్రాణనష్టం జరగకుండా అటవీశాఖ జాగ్రత్తలు తీసుకుంటోంది. రెండురోజుల కిందట రాకేష్ చౌదరి అనే యువకుడు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఘటనకు కారణమైన ఏనుగుల గుంపులో పిల్లలు ఉండటంతోనే అవి వేగంగా స్పందిస్తున్నాయి. సబ్ డీఎఫ్వో పర్యవేక్షణలో ఎలిఫెంట్ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. త్వరలో టోల్‌ఫ్రీ వంటి నెంబర్లను ఏర్పాటు చేయడంతోపాటు, ప్రచార రథాల ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పిస్తాం. వివేక్, తిరుపతి విభాగం అటవీ అధికారి

# మారనున్న చెరువుల రూపురేఖలు

వెంకటగిరి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి రంగంలో అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తోంది. అందులో భాగంగానే జిల్లాలోని చెరువుల రూపురేఖలు మార్చేందుకు శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మిషన్ అమృత్ సరోవర్'లో భాగంగా ఉపాధిహామీ పథకం నిధులతో చెరువులను అభివృద్ధి చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి టెక్నీషియన్లు ఇప్పటికే 202 పంచాయతీల పరిధిలో 295 చెరువులను అమృత్ సరోవర్ పథకానికి ఎంపిక చేశారు. ఒక్కో చెరువు అభివృద్ధికి రూ. 7.50 లక్షల నుంచి రూ. 9 లక్షలు కేటాయించనున్నారు. ప్రధానంగా గ్రామాల్లో నీటి సమస్యను అధిగమించడానికి,



భూగర్భ జలాలు పెంచాలనే లక్ష్యంతో పథకానికి శ్రీకారం చుట్టారు. మైదాన ప్రాంతాల్లో 10 వేల క్యూబిక్ మీటర్ల నీరు ఉండేలా ఎకరా విస్తీర్ణం, గిరిజన ప్రాంతాల్లో 2,500 క్యూబిక్ మీటర్ల నీరు ఉండేలా 25 సెంట్ల విస్తీర్ణంలో చెరువులను అభివృద్ధి చేయనున్నారు.

**ఆహ్లాదం పంచేందుకు..** ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు చెరువుల పరిసర ప్రాంతాల్లో మొక్కలు పెంచడంతో పాటు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో అత్యధికంగా రేణిగుంట మండలంలో 31 తటాకాలు, వెంకటగిరి–23, సత్యవేడు, నాయుడుపేట మండలాల్లో 21 చొప్పున చెరువులను గుర్తించారు. ఈ విషయమై ఎంపీడీవో కోటేశ్వరరావును సంప్రదించగా.. అభివృద్ధి చేయాల్సిన చెరువుల ఎంపిక పూర్తి చేశాం. వీటికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికా రులకు పంపాం. మంజూరు కాగానే త్వరితగతిన పనులు చేపడతాం.

# కందిపప్పు అరకొర.. నాసిరకం సరఫరా



అనంతపురం: అరకొర సరఫరా, అందులోనూ నాసిరకంగా ఉండటంతో రేషన్‌కార్డుదారులకు కందిపప్పు పంపిణీ ఆలస్యమవుతోంది. ఇప్పటికే అవసరానికి సరిపడా సరఫరా లేకపోవడంతో కొన్ని మండలాల్లో రెండు నెలలకోసారి మాత్రమే కందిపప్పు ఇస్తున్నారు. దీనికితోడు జనవరి నెలకు సంబంధించి గుత్తేదారు సరఫరా చేసిన కందిపప్పు నాసిరకంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు జిల్లాకు వచ్చిన 5 లారీల్లోని 150 టన్నుల సరకును అధికారులు వెనక్కి పంపించారు. దీంతో జనవరికి సంబంధించి పంపిణీలో ఇబ్బందులు తలెత్తాయి. వచ్చే నెలకు కూడా కందిపప్పు సరఫరా చేయాల్సిన గుత్తేదారును ఇంకా ఖరారు చేయకపోవడంతో ఫిబ్రవరిలోనూ పూర్తిస్థాయిలో పంపిణీ చేసే అవకాశం కనిపించడం లేదు. వచ్చిన అరకొర సరకు పంపిణీలోనూ డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కార్డుదారులకు ఇవ్వకుండానే ఇచ్చినట్లు నమోదు చేస్తున్నారు. తర్వాత ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**80 శాతమే పంపిణీ**

జిల్లాలోని రేషన్‌కార్డులకు 667 టన్నుల కందిపప్పు అవసరమవుతుంది. సగటున 80 శాతం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ఇందులోనూ ఐసీడీఎస్‌కు 35 టన్నులు కేటాయిస్తారు. జిల్లాకు డిసెంబరులో 554 టన్నులు కేటాయించగా.. సరఫరాదారు కేవలం 445 టన్నులు మాత్రమే ఇచ్చారు. ఇందులో 289 టన్నులు పంపిణీ చేశారు. జనవరికి సంబంధించి రెండ్రోజులుగా పంపిణీ చేస్తున్నారు. ఈక్రమంలోనే నాసిరకంగా ఉన్న 150 టన్నుల కందిపప్పును వెనక్కి పంపించారు. జనవరికి సంబంధించి గుత్తేదారు ఇంకా 172 టన్నులు సరఫరా చేయాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 211 టన్నుల కందిపప్పు మాత్రమే అందుబాటులో ఉంది. ఈనెలకు ఈ మొత్తాన్ని సరిపెట్టాల్సి ఉంది. ఫిబ్రవరిలోనూ కందిపప్పు పూర్తిస్థాయిలో పంపిణీ చేసే అవకాశం కనిపించడం లేదు.

జిల్లా: అనంతపురం
రేషన్‌కార్డులు: 6,67,268
చౌక దుకాణాలు: 1,645
అవసరమైన కందిపప్పు: 667 టన్నులు
ప్రస్తుతం ఉన్న నిల్వ: 211 టన్నులు

# నీటి కాలుష్యానికి అడ్డుకట్ట



హిందూపురం : జిల్లాలోనే అతి పెద్ద పట్టణమైన హిందూపురంలో సమగ్ర మురుగు నీటి వ్యవస్థ లేక అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడా సరైన మురుగు కాలువలు లేవు. దీంతో పట్టణంలో ఏ ప్రాంతంలో చూసినా పొంగి పొర్లుతున్న కాలువలతో అపరిశుభ్రత తాండవిస్తోంది. పట్టణంలో తయారయ్యే మురుగు వెళ్లేందుకు అవకాశం లేక, చెరువుల్లోకి వదులుతున్నారు. దీంతో జిల్లాలోనే అతి పెద్దవాటిల్లో ఒకటైన కొట్నూరు చెరువు మురికి కూపంగా మారింది. మరోవైపున పట్టణ సమీపంలోని పెన్నా నదిలోకి మురుగు వెళుతుండటం, అదంతా పరిగి మండలంలోని శాసనకోట గ్రామ సమీపంలోకి చేరుతుండటంతో ఆ గ్రామ పరిసరాలు మురుగుమయమయ్యాయి. పట్టణంతో పాటు సమీప ప్రాంతాల్లోని జల వనరులన్నీ కలుషితమయ్యాయి. ఈ ప్రాంత ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే, జల వనరుల్లోకి మురుగు నీరు చేరకుండా చూడటమే అడ్డుకట్ట వేయడమే.

**బాలయ్య చొరవతో..**

చెరువులు, నదులు తదితర జలవనరుల్లోకి మురుగు చేరకుండా, చూసేందుకు కేంద్ర ప్రభుత్వం లక్ష జనాభా దాటిన పట్టణాల్లో మురుగు నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు నిధులు కేటాయించింది. గత ప్రభుత్వ హయాంలో సద్వినియోగం చేసుకోలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపడంతో రూ. 79 కోట్లతో మురుగు నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు సమగ్ర ప్రాజెక్టు ప్రణాళిక సిద్ధం చేశారు.

**చేపట్టనున్న పనులివే..**

పట్టణంలోని కొట్నూరు చెరువులో 2 ఎకరాల విస్తీర్ణంలో రూ. 35 కోట్లతో మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. పెన్నా నదిలోకి చేరుతున్న మురుగును కొట్నూరు చెరువులోని శుద్ధి కేంద్రానికి తరలించేందుకు రూ. 20 కోట్లతో శాసనకోట వద్ద నుంచి పైప్‌లైన్, మోటార్లు ఏర్పాటు చేస్తారు. అక్కడి నుంచి మురుగు నీటిని పంపింగ్ చేస్తారు. మిగిలిన సొమ్మును భూ సేకరణకు, చిన్న కాలువలను ప్రధాన కాలువలకు అనుసంధానం చేయడానికి తదితర వాటికి వెచ్చిస్తారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, మొక్కల పెంపకానికి, ఇతరత్ర అవసరాలకు ఉపయోగించనున్నారు.

**నిర్వహణ కష్టమే..**

పట్టణంపై అధికారులకు అవగాహన లేకపోవడంతో మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని కొట్నూరు చెరువులో ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలో ఉత్పత్తయ్యే మురుగు నీరులో ఎక్కువ భాగం పెన్నా నదిలోకి చేరుతుంది. శుద్ధి కేంద్రానికి లోతట్టు ప్రాంతమైన పెన్నా నదిలో (శాసనకోట గ్రామం) నుంచి పైపులైన్ ఏర్పాటు చేసి, మోటార్లతో మురుగు నీటిని పంపింగ్ చేస్తారు. ఇది చాలా ఖర్చుతో కూడుకొన్న పని. అక్కడి నుంచి మురుగు నీటిని ఎత్తిపోయడానికి మోటార్లు, ఆ తరువాత శుద్ధి చేయడానికి మోటారు పంపులు పనిచేయాలి. దీంతో నిర్వహణ ఖర్చు తడిసిమోపెడవుతుంది. దీనికి బదులుగా శాసనకోట వద్దనే భూసేకరణ చేసి, అక్కడే శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే, నిర్వహణ సులభతరమవుతుంది. కొట్నూరు చెరువుకు చేరే మురుగు నీటిని ఎలాంటి ఖర్చు లేకుండా తరలించవచ్చు.

పట్టణం: హిందూపురం
రోజుకు సరఫరా చేయాల్సిన నీరు 24 మిలియన్ లీటర్లు
రోజూ తయారయ్యే మురుగు నీరు 19 మిలియన్ లీటర్లు
జనాభా 1.78 లక్షలు

# వ్యక్తిగత సహాయకుల ఇష్టారాజ్యం

అనంతపురం:శింగనమల నియోజకవర్గంలో వ్యక్తిగత సహాయకుడిగా చెలామణి అవుతున్న వ్యక్తి వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. బదిలీల దగ్గర నుంచి చిన్నచిన్న పనుల వరకు అన్నింటికీ ఓ ధర నిర్ణయించారనే ఆరోపణలు ఉన్నాయి. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో భూవివాదాలకు సంబంధించి సెటిల్‌మెంట్లు చేస్తూ సొంత పార్టీ నాయకుల నుంచి కూడా డబ్బులు వసూలు చేస్తున్నారని కొందరు ఇటీవల ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. గుంతకల్లు నియోజకవర్గంలో ఓ ప్రజాప్రతినిధి బంధువులు మండలాలను పంచేసుకున్నారు. ఆయా మండలాల్లో వారే ప్రజాప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. మట్టి, ఇసుక మాఫియా వారి కనుసన్నల్లోనే నడుస్తోంది. నిత్యం భూవివాదాలకు సంబంధించి సెటిల్‌మెంట్లు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గుత్తి మండలంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి లేఅవుట్ వేయడంతోపాటు తొలగించడానికి వెళ్లిన అధికారులను బెదిరించినట్లు సమాచారం.ధర్మవరంలో వ్యక్తిగత సహాయకుడు, మరో సన్నిహితుడు అంతా తామై నడిపిస్తున్నారు. అధికారుల బదిలీలన్నీ వారిద్దరి కనుసన్నల్లోనే జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. వైకాపా నాయకులతో అంటకాగుతూ పరోక్షంగా సహకారం అందిస్తున్నారు. గతంలో భూ అక్రమాలకు పాల్పడిన వైకాపా నాయకులతో సెటిల్‌మెంట్లు చేసుకుని పార్టీలోకి చేర్చుకుంటున్నారు. తెదేపా నాయకులను పూర్తిగా పక్కనపెట్టి రాజకీయం నడిపిస్తున్నారనే విమర్శలున్నాయి. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్నట్లుగా ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధుల వ్యక్తిగత సహాయకులు వ్యవహరిస్తున్నారు. కీలక నేతలకు సమస్యలు చెప్పుకోవడానికి వచ్చినవారు ముందుగా పీఏల దర్శనం చేసుకోవాల్సిందే. వారు కరుణిస్తేనే పని జరుగుతుంది. వారిని దాటుకుని ప్రజాప్రతినిధుల్ని కలవాలంటే అసాధ్యమనే చెప్పుకోవాలి. కొంతమంది వద్ద పనిచేస్తున్న పీఏలు ఎంతోకొంత ముట్టచెబితే గానీ కనికరించడం లేదనే విమర్శలున్నాయి. ఉమ్మడి జిల్లాలోని కొందరు ప్రజాప్రతినిధులు పనిఒత్తిడి కారణంగా పీఏలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. దీన్ని అవకాశంగా




తీసుకుంటున్న పీఏలు నియోజకవర్గంలో అనధికార పెత్తనం చెలాయిస్తున్నారు. కొన్ని విషయాల్లో ప్రజాప్రతినిధులు చెప్పిన దానికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. హిందూపురం, ధర్మవరం, పుట్టపర్తి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లో ప్రైవేట్ సహాయకులు మరింత రెచ్చిపోతున్నారు.

**పనిచేసే వారిని పక్కనపెట్టేసి..**

ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం కష్టపడినా నాయకులు, కార్యకర్తలను సైతం ప్రజాప్రతినిధుల పీఏలు లెక్కచేయడం లేదు. నేతలను కలవడానికి వచ్చిన స్థానిక నాయకుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నారు. మద్యం దుకాణాల లైసెన్సులు, గ్రామాల్లో అభివృద్ధి పనుల కాంట్రాక్టుల్లోనూ పీఏలు జోక్యం చేసుకుంటూ స్థానిక నాయకులకు అన్యాయం చేస్తున్నారనే విమర్శలున్నాయి. గుంతకల్లు, ధర్మవరం నియోజకవర్గాల్లో పీఏలు వైకాపా నాయకులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారు. దీనిపై ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించి అక్రమాలకు పాల్పడుతున్న పీఏలను పక్కనపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# బదిలీ చేస్తే వెళ్లాలా..?

చిత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లా పాత తిరుపతి సర్కిల్ పరిధిలో 45–55 మంది ఉద్యోగులు రాజకీయ పలుకుబడి, పైరవీలు చేస్తూ ఉద్యోగ బాధ్యతలు విస్మరించినా ఉన్నతాధికారులు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. బదిలీ చేసినా కదలరు.. నోటి మాటతో కొందరు.. డిప్యూటేషన్ పద్ధతిలో మరికొందరు అధికారులు తిరుపతిని అంటిపెట్టుకున్నారు. వైకాపా హయాం నుంచి కొనసాగుతోన్న వీరి హవా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మార్పు రాలేదు. విధి నిర్వహణ పక్కన పెట్టేసి నిబంధనలు తోసిరాజంటున్నారు.




**మెమోలు ఇస్తే మాకేంటి..?**

బదిలీ చేసిన ప్రాంతంలో చేరకపోవడంపై ఓ ఉన్నతాధికారి కొందరికి మెమోలు జారీ చేసినా ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు. పైగా బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**పని లేకున్నా పాతుకుపోయి..**

వీరికి పనే ఉండదు. నిర్దేశిత విభాగమంటూ కేటాయించరు. కొందరు కార్యాలయానికే వెళ్లరు. సొంత పనులు చక్కబెట్టుకుంటూ.. పైరవీలు చేస్తున్నారు. ఇంకొందరైతే ఏకంగా యూనియన్ పేరిట కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పాత ఉమ్మడి జిల్లా తిరుపతి సర్కిల్ పరిధిలో 45 మంది డిప్యూటేషన్‌పై తిరుపతి సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. నోటిమాటతో 13 మంది ఇక్కడే ఉన్నారు.

చిత్తూరు నుంచి నలుగురు, పలమనేరు, పుంగనూరు, చంద్రగిరి, శ్రీకాళహస్తి, పుత్తూరు, అన్నమయ్య జిల్లా ములకలచెరువు నుంచి ఒకరు చొప్పున నోటిమాటతోనే తిరుపతిలో కొనసాగుతున్నారు.

డిప్యూటేషన్‌పై శ్రీకాళహస్తి నుంచి 13 మంది, చిత్తూరు, పుత్తూరు, అన్నమయ్య జిల్లా పీలేరు ప్రాంతాల నుంచి 30 మంది తిరుపతి సర్కిల్ కార్యాలయంలో తిష్ఠ వేసినా వారి లెక్క తేల్చలేదు.

# శ్రమ శక్తి సంఘాలకు పునరుజ్జీవం

చిత్తూరు : ఉపాధి పథకం అమల్లో శ్రమశక్తి సంఘాలు కీలకం కానున్నాయి. పనికి దరఖాస్తు విధానం, మస్టర్ వేయడం, చేసిన పనికి కొలతలు తీయడం వంటివి ఇక నుంచి పక్కాగా అమలు కానున్నాయి. బాధ్యులుగా సంబంధిత క్షేత్ర, సాంకేతిక సహాయకులు వ్యవహరించనున్నారు. ఈ నెలాఖరుకు సంఘాలను ఏర్పాటు చేసి, ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పనులు అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. మార్గదర్శకాలివే..గతంలో 50 కుటుంబాలను కలిపి శ్రమశక్తి సంఘంగా గుర్తించేవారు. ఇప్పుడు ఆవాసం వారీగా వేతనదారుల ఇష్టం మేరకు 50 మంది సభ్యులతో ఓ సంఘం ఏర్పాటు చేస్తారు. గతంలో ఏర్పాటు చేసిన సంఘాలను పరిగణనలోకి తీసుకుంటారు. సభ్యుల అంగీకారం మేరకు పేర్లు నమోదు చేస్తారు. వివరాలన్నింటినీ టీసీఎస్ సర్వర్‌లో నమోదు చేయాలి. ఒకసారి సంఘంగా ఏర్పడిన తర్వాత ఏడాది పాటు మార్పులకు అవకాశం లేదు. కొత్తగా జాబ్‌కార్డులు పొందిన వారిని సభ్యులుగా చేర్చుకోవాలి. సంఘ సభ్యులై ఉండి చదవడం, రాయడం వచ్చిన 50 ఏళ్ల లోగా వయసు ఉన్నవారు 2023–24లో కనీసం 25 రోజులు పనిచేసి ఉండాలి. రోజువారీ పనుల నిమిత్తం ఒక కూలీని తీసుకొచ్చేందుకు అదనంగా రూ. 1.50 చొప్పున ఇవ్వనున్నారు. సంఘంలోని 50 మందిని తీసుకొస్తే రోజుకు రూ. 75 అదనంగా అందుతాయి. జిల్లాలోని ఉపాధి వేతనదారులు అందరికీ పనులు కల్పించడమే లక్ష్యం. ఈ పథకం పారదర్శకంగా అమలు చేసేందుకు శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేయనున్నామని, రోజువారీ కూలీ కనీసం రూ. 300 వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా అధికారులు తెలిపారు.

జిల్లాలో మండలాలు: 31
ప్రభుత్వం జారీ చేసిన జాబ్‌కార్డులు: 2,67,000
ఉపాధి పొందుతున్న కూలీలు: 4,79,000
ఉపాధి పనులు చేసిన కుటుంబాలు: 1,44,000
వంద రోజుల పనిదినాలు పూర్తైనవారు: 8,101
రోజువారీ సగటు వేతనం: రూ. 258.51

# ఉమ్మడి జిల్లాలో రూ.110 కోట్ల లబ్ధి

తిరుపతి : ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం బకాయిలు విడుదల చేసి ఊరటనిచ్చింది. గత ఐదేళ్లలో ప్రభుత్వ ఉద్యోగులు.. హక్కులు, వేతనాలు, బకాయిల గురించి నోరుతెరిచే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం రాకతో సకాలంలో వేతనాలు చెల్లిస్తోంది. విశ్రాంత ఉద్యోగులకు జనవరి పెన్షన్ డిసెంబర్ 31వ తేదీనే జమ చేసింది. బకాయిల్లో కొంత సంక్రాంతికి ముందే ఉద్యోగుల ఖాతాల్లో జమచేసింది. మొత్తంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 44 వేలమంది ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 110 కోట్లు విడుదలైంది.

**పోలీసుల ఖాతాలకు బదిలీ**

రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నాలుగు సరెండర్ లీవులు (ఆర్జిత సెలవులు)లకు సంబంధించి ఒక సరెండర్ లీవుల బిల్లు మంజూరు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎస్సై స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు ఉన్న దాదాపు 3,600 మందికి రూ. 16.20 కోట్లు మంజూరు చేశారు. పోలీసు ఉద్యోగి బేసిక్ ప్రకారం రూ. 35 వేల నుంచి రూ. 60 వేల వరకు ఈ సొమ్ము జమయింది. ఇప్పటికే అధిక శాతం మంది ఖాతాల్లో నగదు జమయింది.

**ఉద్యోగుల సీపీఎస్ సొమ్ము జమ**

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులు పది శాతం వాటా నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) ట్రస్టుకు చెల్లిస్తే.. మరో పది శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. కూటమి ప్రభుత్వం రూ. 300 కోట్లు మంజూరు చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 30 వేల మందికి దాదాపు రూ. 32 కోట్లు జమయింది.

**జీపీఎఫ్ మంజూరుతో వెసులుబాటు**

జనరల్ ప్రొవిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) సొమ్మును సైతం వైకాపా ప్రభుత్వం మళ్లించి ప్రభుత్వం ఉద్యోగులకు తీరని అన్యాయం చేసింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రూ. 519 కోట్లు మంజూరు చేయగా.. అందులో ఉమ్మడి జిల్లాలో 18 వేల మందికి వెసులుబాటు కలగనుంది.

**విశ్రాంత ఉద్యోగులకు ఊతం** ఉమ్మడి జిల్లాలో సుమారు 29 వేల మంది విశ్రాంత ఉద్యోగుల ఖాతాల్లో గ్రాట్యుటీ, కమ్యూటేషన్లకు సంబంధించిన సుమారు రూ. 21 కోట్ల నగదు జమ చేశారు. గత ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం మంజూరు చేశారు.

# పక్కా ప్రణాళిక.. సబ్జెక్టులపై పట్టు..!

గాజువాక : డీఎస్సీ కోసం ఏడేళ్లుగా కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు విద్యార్థులు. కూటమి ప్రభుత్వం వారి ఆశలను నెరవేరుస్తూ ఇటీవల డీఎస్సీ పోస్టుల భర్తీకి ప్రకటన జారీ చేసింది. దీంతో జిల్లాలోని వేలాది మంది బీఈడ్, డీఈడ్ విద్యార్థులు ముమ్మర సాధనలో మునిగిపోయారు. ఏయూ, పౌరగ్రంథాలయాల్లో ఎటుచూసినా వారే కనిపిస్తున్నారు. ఎలాగైనా ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలని నిద్రాహారాలు మాని చదువుతున్నారు. అయితే ఒక్కో పోస్టుకు వందలాది మంది పోటీ పడుతున్న దశలో.. ఉద్యోగం సాధించడం అంత సులువు కాదని డీఎస్సీ శిక్షణ నిపుణులు చెబుతున్నారు. సబ్జెక్టులపై పట్టు సాధించి పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచిస్తున్నారు.


**సాధనతోనే గణితంలో విజయం**

గణితం విద్యార్థులు మూడో తరగతి నుంచి పదోతరగతి వరకు గణితం పాఠ్య పుస్తకాలను క్షుణ్ణంగా చదవాలి. తరగతి వారీగా కాకుండా ఉన్న సిలబస్ అంతా ఒక నోట్స్‌లో రాసుకుని ప్రతిరోజూ మననం చేసుకుంటూ సాధన చేయాలి. ముఖ్యంగా సరాసరి, నిష్పత్తి, సంఖ్యా పద్ధతులు, జామెట్రీ, సమీకరణాలు, కాలము మరియు పని, గణాంకాలు (సగటు, మధ్య, మోడ్ విలువ, శాతం), ప్రాచీన గణితం (సరళ వడ్డీ, చక్రవడ్డీ, లాభం, నష్టం, నిష్పత్తి, భాగం, గ్రాఫ్, ఛార్ట్స్, విశ్లేషణ నుంచి అధికంగా ప్రశ్నలు వస్తాయి. సాధనలో వేగంతోనే గణితంలో విజయం సాధించవచ్చు.

– టి.తులసీరావు, గణిత అధ్యాపకులు, బీసీ స్టడీ సర్కిల్

**ఒక ప్రశ్నకు నాలుగైదు విధాలుగా సన్నద్ధమవ్వాలి**

సాంఘికశాస్త్రంలో ఒక ప్రశ్నకు నాలుగైదు విధాలుగా సమాధానాలు తయారుచేసుకోవాలి. భూగోళ శాస్త్రంలో మొక్కలు, భూవాతావరణం అంశాలపై విద్యార్థులు దృష్టి పెట్టాలి. ముఖ్యంగా భారతదేశ భూగోళ వైవిధ్యం నుంచి అధికంగా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. చరిత్రకు వచ్చే సరికి ప్రాచీన భారతదేశం (సింధు నాగరికత, వేదకాలం), మధ్య యుగ భారతదేశం(మొఘలులు, రాజపుత్రులు), ఆధునిక భారతదేశం (బ్రిటీష్‌పాలన, స్వాతంత్ర్య పోరాటం) అధ్యాయాల నుంచి



అధికంగా ప్రశ్నలు వస్తాయి. రాజనీతిశాస్త్రం(పొలిటికల్‌సైన్స్)లో భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, కర్తవ్యాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధులు, కర్తవ్యాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. అర్థశాస్త్రంలో భారత ఆర్థిక వ్యవస్థ అనగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగం, పేదరికం, నిరుద్యోగం, సంక్షేమ పథకాలు, నూతన చట్టాలు, అంతర్జాతీయ సంబంధాలపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. ప్రతిరోజు వాటిని పునశ్చరణ చేయాలి. లేదంటే గుర్తున్నట్లే ఉంటుంది కానీ మరిచిపోతాం. – డాక్టర్ ప్రియాంక, సాంఘిక శాస్త్రం అధ్యాపకురాలు, బీసీస్టడీ సర్కిల్

**శ్రద్ధపెడితే సైన్స్‌లో అధిక మార్కులు**

జీవశాస్త్రంలో జంతు, వృక్ష వర్గీకరణ, రక్తంలో గ్రూపులు, జీవవైవిధ్యం, శరీరశాస్త్రంలో కీళ్లు, అవయవాలు అంశాలపై తరచూ ప్రశ్నలు వస్తున్నాయి. ఆహార పోషాంశాల్లో ఎక్కడి నుంచి ప్రశ్న వచ్చినా సమాధానం రాసేలా పట్టు సాధించాలి. మాదిరి ప్రశ్నపత్రాలు సాధన చేస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. రసాయన శాస్త్రంలో మూలకాలు, సంయోగ రసాయన క్రియలు, ఆమ్లాలు, క్షారాలు, పరమాణు నిర్మాణం, పీరియాడిక్ టేబుల్, భౌతిక, రసాయన మార్పులపై ఎక్కువ దృష్టి పెట్టాలి. భౌతిక శాస్త్రంలో శక్తి, శక్తి మార్పిడి, శక్తి మాధ్యమాలు, విద్యుత్, గమనికలు, శబ్దం, కాంతి, శ్రవణ శక్తి, ఉష్ణోగ్రత, థర్మోడైనమిక్స్ అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయాలి. తద్వారా డీఎస్సీలో మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. – సూర్యారావు, సైన్సు అధ్యాపకులు, బీసీస్టడి సర్కిల్

# చెత్తకుండీలా వరాహా నది

ఎలమంచిలి : వరాహనదిని ప్లాస్టిక్ వ్యర్థాలతో నింపేస్తున్నారు. గ్రామాల్లో సంపద కేంద్రాలను ఏర్పాటు చేసినా పంచాయతీ అధికారులు వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి ఎదురైంది. నదుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్రమాదకర రసాయనాలను గుట్టలుగా పోస్తున్నారు. ఫలితంగా నదీ జలాలు కలుషితం అవుతున్నాయి. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా పంచాయతీ అధికారు దృష్టి సారించడంలేదు. ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల సరిహద్దులో రాహనది ప్రవహిస్తోంది. ఇటు ఏటికొప్పాక, అటు



దార్లపూడి గ్రామాల్లో చెత్తంతా వాహనాల్లో తీసుకెళ్లి నదిలో డంపింగ్ చేస్తున్నారు. మాంస దుకాణాల్లో వ్యర్థాలను నదిలోనే జారవిడుస్తున్నారు. కాలం చెల్లిన పురుగు మందులు, రసాయనాలు, శీతల పానీయ సీసాలను పారబోస్తున్నారు. ఆ వ్యర్థాలతో నది గట్టుకు సమాంతరంగా గట్టు తయారవుతోంది. ఇవి నదిలోకి జారి నీటి ప్రవాహం వచ్చినప్పుడు సముద్రంలో కలుస్తోంది. వీటి కారణంగా తీరం అంతా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతోంది. గ్రామంలో వచ్చిన చెత్తతో సంపద తయారు చేయడానికి ప్రభుత్వం రూ. లక్షలు ఖర్చు చేసి కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిని అలంకారప్రాయంగా వదిలేశారు. ఏటికొప్పాక, దార్లపూడి రెండు పంచాయతీల్లోనూ ఈ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఏటికొప్పాక గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌ను ఈ విషయమై వివరణ కోరగా చెత్తను నిల్వ చేసేందుకు ప్రభుత్వ స్థలం గ్రామంలో లేకపోవడంతో నదిలో వేస్తున్నారన్నారు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, నదిలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# నాసిరకం పనులు.. అప్పనంగా బిల్లులు



అనంతపురం : గత వైకాపా హయాంలో రాక్రీట్ సంస్థకు హిందూపురం గృహనిర్మాణశాఖ అధికారులు దాసోహమయ్యారు. ఆ సంస్థ చేపట్టిన నాసిరకం నిర్మాణాలకు పూర్తిస్థాయి బిల్లులు మంజూరు చేశారు. ఉన్నతాధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే.. నాణ్యత పరీక్షలు చేయకుండానే బిల్లులకు ఆమోద ముద్ర వేసేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణం, బిల్లులు మంజూరుపై విజిలెన్స్ విచారణ చేపట్టారు. అయితే వైకాపా హయాంలో పనిచేసిన అధికారులే క్షేత్రస్థాయిలో ఇప్పటికీ పనిచేస్తుండటంతో విచారణ సజావుగా జరగలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో విచారణకు వచ్చిన విజిలెన్స్ అధికారులు హౌసింగ్ అధికారులు చెప్పిన వివరాలు రాసుకుని వెళ్లిపోయారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**పునాదుల సంఖ్యను ఎక్కువగా చూపి..**

కొటిపి లేఅవుట్‌లో 2,675 పునాదులు నిర్మించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో 2 వేలకు మించి లేవని స్థానికుల ద్వారా తెలుస్తోంది. అయినా పునాదుల సంఖ్యను ఎక్కువ చేసి చూపించారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఒక్కో పునాదికి రూ.50 వేల చొప్పున చెల్లించడం గమనార్హం. ఇలా రూ.కోట్లలో ప్రజాధనం దుర్వినియోగమైనట్లు స్పష్టంగా తెలుస్తోంది. హౌసింగ్‌శాఖ హిందూపురం పరిధిలో గతంలో పనిచేసిన అధికారులే ఇప్పటికీ కొనసాగుతున్నారు. అప్పట్లో రాక్రీట్ సంస్థకు అనుచిత లబ్ధి చేకూర్చిన అధికారులే ఇప్పటికీ కొనసాగుతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ విచారణను ఈ అధికారులు పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. విచారణకు వచ్చిన విజిలెన్స్ సిబ్బందికి తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

**నిబంధనల ఉల్లంఘన**

హిందూపురం పరిధిలోని కొటిపి లేఅవుట్‌లో 4,636 మందికి గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణ బాధ్యతలను అప్పటి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కుటుంబానికి చెందిన రాక్రీట్ సంస్థకు అప్పగించారు. వీటిలో 2,675 కాంక్రీట్ పునాదులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. వీటికిగాను ఇప్పటికే రూ.12.37 కోట్ల బిల్లులు రాక్రీట్ సంస్థకు చెల్లించారు. అయితే పునాదుల్లో ఏమాత్రం నాణ్యత కనిపించడం లేదు. నిబంధనల మేరకు 9 పిల్లర్లతో కాంక్రీట్ పునాది నిర్మించాల్సి ఉండగా.. చాలావరకు 6 పిల్లర్లు మాత్రమే వేశారు. పిల్లర్ల కోసం తవ్విన గుంతలు కూడా నిబంధనల మేరకు లేవు. 6 అడుగులు తవ్వాల్సిన చోట కేవలం 2 అడుగులు తవ్వి పిల్లర్లు నిర్మించారు. చాలా వరకు పునాదులకు సీసీ బెడ్డింగ్ వేయలేదు. పైపైన తవ్వి పునాదుల నిర్మాణం చేపట్టారు. పునాదుల నాణ్యతపై మరోసారి విచారణ జరపాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రకాశ్‌రెడ్డి అనుచరుడికే మళ్లీ పనులు**

గత ప్రభుత్వ హయాంలో హిందూపురం పరిధిలోని కొట్నూరు లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను రామగిరి మండలానికి చెందిన గుత్తేదారుకు అప్పగించారు. ఆయన తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డికి నమ్మినబంటు. గుత్తేదారు సోదరుడు ఇప్పటికీ ప్రకాశ్‌రెడ్డి వద్దే పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విజిలెన్స్ విచారణలో భాగంగా నిర్మాణాలను కొంతకాలం నిలిపివేశారు. అయితే హౌసింగ్ అధికారులు మళ్లీ ప్రకాశ్‌రెడ్డి అనుచరుడికే ఇళ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించడం గమనార్హం. ఇప్పటికే వారికి పెద్దమొత్తంలో బిల్లులు కూడా చెల్లించినట్లు సమాచారం. దీని వెనుక హిందూపురానికి చెందిన తెదేపా నాయకుల హస్తం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

**నాణ్యత బ్రహ్మాండంగా ఉంది..**

హిందూపురం పరిధి కొటిపిలో రాక్రీట్ సంస్థ నిర్మించిన పునాదుల్లో నాణ్యత బ్రహ్మాండంగా ఉంది. ఎక్కడా లోపాలు లేవు. బిల్లుల విషయంలోనూ అక్రమాలు జరగలేదు. చేసిన పనికే బిల్లులు మంజూరు చేశాం. కొన్ని పునాదులకు మాత్రం ఫిల్లింగ్ చేయకపోవడంతో ఆ మేరకు బిల్లులు నిలుపుదల చేశాం. కె.వెంకటనారాయణ, పీడీ, హౌసింగ్

# మాన్యం.. దైన్యం



శ్రీకాళహస్తి: పురాతన గుడిమల్లం ఆలయానికి సంబంధించిన మాన్యాలు అక్రమార్కుల పరమైనా యంత్రాంగం నిస్తేజంగా చూస్తోంది. దస్త్రాలు పక్కాగా ఉన్నా రాజకీయ ప్రాబల్యంతో ఏళ్లుగా కబ్జాదారులు సాగు చేసుకుంటున్నారు. ఆలయానికి ఆదాయం రాకపోవడం అటుంచితే.. దాతలు చేపట్టే అభివృద్ధి పనులకు అవసరమైన భూమి కోసం అధికారులు వెంపర్లాడాల్సిన పరిస్థితి. గుడిమల్లం ఆలయానికి సమీపంలోని గుడిమల్లం, గుండ్లకంఢ్రిగ, చెల్లూరు ప్రాంతంలో 28 ఎకరాలు అక్కడి రైతులు అక్రమంగా సాగు చేసుకుంటున్నారు. చుట్టుపక్కల దాదాపు 500 ఎకరాల్లో ఇప్పటికీ 360 ఎకరాలు ఆయా ప్రాంత రైతుల చేతుల్లో ఉన్నాయి. మిగిలిన భూములు అటవీ ప్రాంతంలో ఉన్నట్లు దస్త్రాలను బట్టి వెల్లడవుతోంది. ప్రస్తుతం ఆలయానికి సమీపంలో ఆక్రమణల్లో ఉన్న భూముల విలువ రూ.15 కోట్లకు పైమాటే. ఇప్పటికీ ఆలయ మాన్యం అనుభవిస్తున్న వారు ఆలయానికి ఒక్క పైసా చెల్లించకపోవడం గమనార్హం. ఇటీవల భూ వివాదంలోని నాలుగు ఎకరాల స్థలాన్ని సీసీఎల్ ఆలయానికి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేసింది. ఈ భూములు అనుభవిస్తున్న వారు అడ్డుకుంటున్నారు.

**దాతలున్నా.. స్థలమేదీ**

భక్తులు ఇటీవల ఆలయ అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు ముందుకొస్తున్నారు. కల్యాణ మండపాలు, అతిథిగృహాలు, విశ్రాంతి భవనాలతో పాటు కనీస వసతులు కల్పించేందుకు దాతలు ఆసక్తి చూపుతున్నా అవసరమైన స్థలం లేక అభివృద్ధికి అడుగులు పడటం లేదు.

**ఉన్నతాధికారులకు నివేదికలు**

ఆలయ మాన్యం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండటంపై ఉన్నతాధికారులకు నివేదించాం. సర్వే చేసి భూములు అప్పగించడం లేదా గుత్త చెల్లిస్తే అభివృద్ధి చేపట్టేందుకు వీలుంటుంది. ఇదే విషయాన్ని దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు తెలియజేశాం. – రామచంద్రారెడ్డి, ఈవో

**అభివృద్ధికి విఘాతం**

ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ హయాంలో రూ.2 కోట్ల నిధులు కేటాయించారు. ఘనంగా శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. అయితే నిధులు ఏమయ్యాయో తెలియకుండా పోయింది.


# వచ్చామా.. వెళ్లామా!

భీమవరం : రీసర్వేలో భూమి తగ్గిందని ఒకరు, అడంగల్ పేరు తప్పులు సరి చేయాలని మరొకరు... పాస్ పుస్తకం ఇప్పించాలని ఇంకొకరు.. ఇలా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఏళ్లుగా తిరుగుతూనే ఉన్నాం.' అంటూ వాపోతున్నారు రెవెన్యూ సదస్సులకు హాజరవుతున్న రైతులు.

**ప్రభుత్వ లక్ష్యం ఉన్నతమైనా..** ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడి కొంత మంది కింది స్థాయి సిబ్బంది తీరుతో భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. రెవెన్యూ సమస్యలు గ్రామ స్థాయిలో పరిష్కరించాలనే ఉద్దేశంతో ఈ నెల 13 నుంచి జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో సదస్సులు నిర్వహిస్తున్నారు. కానీ వీటిపై ముందస్తు ప్రచారం లేకుండా వినతులు తీసుకోవడానికి మాత్రమే అధికారులు పరిమితమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎఫ్ఎంబీ, అడంగల్, 22ఏ జాబితా, నివాస స్థలాల జాబితా, రెవెన్యూ గ్రామపటం, ఇతర వివరాలతో అధికారులు సదస్సులకు హాజరు కావాల్సి ఉంది. వీటిని సదస్సుల్లో ప్రదర్శించాల్సి ఉన్నా కొన్నిచోట్లే అమలవుతున్నాయి.

ఏదీ ప్రచారం.. తణుకు, ఇరగవరం, అత్తిలిలో నిర్వహిస్తున్న సదస్సులపై విమర్శలు వస్తున్నాయి. ఏదో వచ్చాం వెళ్లాం అన్నట్లుగా కార్యక్రమాలు ఉన్నాయని అర్జీదారులు వాపోతున్నారు. గతంలోనూ ఇవే అర్జీలను అధికారులకు ఇచ్చామని అయినా పట్టించుకోలేదని అంటున్నారు. కాళ్ల, వీరవాసరం, అన్నవరం తదితర చోట్ల మొదటి రోజు నిర్వహించిన సదస్సుల్లో కనీసం 20 ఫిర్యాదులు కూడా రాలేదంటే ప్రచారం ఏ విధంగా నిర్వహించారో అర్థం చేసుకోవచ్చు.

క్షేత్రస్థాయికి వెళ్లకుండానే.. గత ప్రభుత్వ హయాంలో రీసర్వే ప్రక్రియను అస్తవ్యస్తంగా చేశారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండానే సర్వే పూర్తయినట్లు



నివేదికలు సమర్పించడంతో తప్పులు దొర్లాయి. వీటిలో అత్యధికంగా భూముల విస్తీర్ణం తగ్గుదల, సరిహద్దు తేడాలు, సంయుక్త ఎల్‌పీ నంబర్ల కేటాయింపుపై రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు అందుతున్నాయి. ఆచంట మండలంలో కొన్ని గ్రామాల్లో రికార్డుల ప్రకారం సర్వే పూర్తయిందని చెబుతున్నారు. కానీ సర్వే రాళ్లు వేసి సంబంధిత రైతులకు భూమి అప్పగించ లేదు. సరిహద్దుల్లో సర్వే రాళ్లు వేయకుండా సర్వే పూర్తయిందంటే ఎలాగని రైతులు ప్రశ్నిస్తున్నారు. సదస్సుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని డీఆర్‌వో వెంకటేశ్వరరావు అన్నారు.

ఉండి మండలం ఎన్.ఆర్.పి. అగ్రహారంలో తనికెళ్ల వెంకటేశ్వరరావుకు ఎకరా 80 సెంట్ల భూమి ఉంది. రీ సర్వేలో 20 సెంట్లు తగ్గింది. సరి చేయాలని అర్జీ సమర్పించారు. డి.వి.ఎస్.గిరిధర్‌కు నాలుగు ఎకరాల భూమి ఉంది. అడంగల్‌లో ఎకరా 10 సెంట్లు వేరే రైతు పేరుతో నమోదైంది. ఆ తప్పులను సరి చేయాలని తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పెంటపాడు మండలం పడమరవిప్పర్రులో శీలా రామకృష్ణకు యానాలపల్లి కంఢ్రిగలో నాలుగున్నర ఎకరాల పొలం ఉంది. జగనన్న రీసర్వేలో నాలుగు సెంట్లు పక్కనున్న రైతుకు కలిసింది. సమస్య పరిష్కరించాలని రీసర్వే సదస్సులు, గ్రామసభల్లో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదు.

# విజ్ఞానం.. వినోదం

కశింకోట : కాసేపు సేదతీరేందుకు, ఆటవిడుపు కోసం పిల్లలతోపాటు పెద్దలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించేందుకు శారదావనం శరవేగంతో సిద్ధమవుతోంది. విద్యార్థులకు అడవులను ప్రత్యక్షంగా చూపించడం, పర్యావరణంపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా 600 ఎకరాల రిజర్వు అటవీ భూమిలో 25 ఎకరాల మేర అందమైన ఉద్యానాన్ని బయ్యవరం సమీపాన జాతీయ రహదారి పక్కన రూ.1.40 కోట్లతో పూర్తి చేశారు. రెండో విడత మరో రూ.60 లక్షలతో మరిన్ని పనులు జరుగుతున్నాయి.

అటవీ భూమిలో విద్యార్థులకు అటవీ సంపదను, మొక్కలను పరిచయం చేస్తూ మొక్కల పెంపకం చేపట్టారు. బొటానికల్ గార్డెన్‌తో పాటు జంతు ప్రదర్శనశాల ఏర్పాటుకు కృషి జరుగుతోందని జిల్లా అటవీశాఖ అధికారులు తెలిపారు. పర్యాటకులను ఆకర్షించేందుకు పలు సౌకర్యాలను కల్పిస్తున్నారు. సందర్శకుల కోసం పచ్చదనంతో నిండిన వాతావరణంతో పాటు ప్రకృతిసిద్ధంగా ఉండేలా చెక్కతో నిర్మిస్తున్న



అందమైన విశ్రాంత భవనం, చిన్నారులకు ఆటల ప్రాంగణం, ఆరోగ్యకరమైన స్వచ్ఛమైన నీటిని అందించే ప్లాంట్, థియేటర్ అడుగడుగునా ప్రశాంతతను, ఆహ్లాదాన్నిపంచే మొక్కలు, కుటీరాలు, ఫలహారశాల తదితర నిర్మాణాలన్నీ చెక్కతో చేయడం ప్రత్యేకతను సంతరించుకుంటోంది. సామాజిక అటవీశాఖ డీఎఫ్‌వో లక్ష్మణ, సబ్‌డివిజనల్ అటవీ అధికారి ఎ.సునీల్‌కుమార్, అనకాపల్లి అటవీ ప్రాంత అధికారి జ్యోతిర్మయి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

అటవీ సంపదపై అవగాహన కల్పించేందుకు..: సాధారణంగా పర్యాటకులకు అటవీప్రాంతంలో ప్రవేశం ఉండదు. ప్రజానీకానికి అడవులను, అటవీ సంపదపై అవగాహన కల్పించేందుకు శారదావనాన్ని అభివృద్ధి చేస్తున్నాం. విద్యార్థులకు పర్యావరణం, ప్రకృతి వనాలను పరిచయం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. ఇప్పటికే మొదటి విడత నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రెండో విడత పనులు ప్రారంభమయ్యాయి. వేసవి నాటికి పర్యాటకులకు ప్రవేశం కల్పించడమే ధ్యేయంగా శరవేగంతో పనులు జరుగుతున్నాయి.

– పొన్నాడ జ్యోతిర్మయి, జిల్లా అటవీరేంజ్ అధికారిణి

# చలిగాలులు.. చిరు జల్లులు

ఉండి : అన్నదాతలను అననుకూల వాతావరణం వేధిస్తోంది. చలి తీవ్రతకు తోడు మంగళవారం ఉదయం నుంచి మేఘాలు కమ్మేసి మధ్యమధ్యలో చిరుజల్లులు పడటంతో వ్యవసాయ పనులకు అంతరాయం ఏర్పడింది. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు సాగుదారులు పడరాని పాట్లు పడుతున్నారు. యంత్రాలతో ఒడ్డుకు చేర్చిన ధాన్యంలో వారం, పది రోజులైనా తేమశాతం నిర్ణీత స్థాయికి తగ్గకపోవడంతో విక్రయాలకు అవకాశం చిక్కడంలేదని రైతులు వాపోతున్నారు.

**తేమశాతంతో నష్టం..** జిల్లాలో 2.05 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగైంది. 80 శాతం విస్తీర్ణంలో పంట మాసూళ్లు పూర్తయ్యాయి. 4.10 లక్షల టన్నుల ధాన్యాన్ని ఆర్ఎస్‌కేల ద్వారా సేకరించాలనేది ప్రభుత్వ లక్ష్యం. 3,32,602 టన్నుల ధాన్యాన్ని (81.12 శాతం) కొనుగోలు చేయగలిగారు. ఈ నెల మొదటి వారంలో 'ఫెయింజల్' తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట, మురుగు కాలువ గట్లు, రహదారుల పక్కన పోసిన ధాన్యాన్ని పూర్తిగా ఆరకుండానే విక్రయించుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. నిబంధనల ప్రకారం తేమ 17 శాతం లోపు ఉన్న ధాన్యానికి కనీస మద్దతు ధర లభిస్తోంది. అంతకు మించితే ప్రతి ఒక్క శాతానికి రూ.23 చొప్పున ధర తగ్గిస్తారు. కొద్ది రోజులుగా చలితీవ్రత కారణంగా పగటి ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. మరోవైపు చిరిగిన సంచులిస్తున్న ప్రాంతాల్లో పట్టుబడి, ఎగుమతి, దిగుమతి సమయాల్లో కొంత ధాన్యం తరిగిపోయి నష్టపోతున్నట్లు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సేకరణ ఇలా..** జిల్లాలో ఒక్క పెంటపాడు మండలంలో మాత్రమే లక్ష్యానికి మించి ధాన్యాన్ని సేకరించారు. తర్వాత వీరవాసరం– 98, ఇరగవరం– 95, పాలకోడేరు– 94, పెనుమంట్ర– 89, పెనుమంట్ర– 88, ఉండి– 86, తణుకు– 84, గణపవరం మండలంలో 80 శాతం మేర ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో మాసూళ్లు ఆలస్యమవుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో సేకరణ కూడా తక్కువగా ఉంది. మండలాల వారీగా ఆకివీడు 23, యలమంచిలి 33, కాళ్లలో 45, నరసాపురం 50, మొగల్తూరు 57 శాతం మేర మాత్రమే ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి.

**చిరిగిన సంచులు వెనక్కి..!..** రైతు సేవాకేంద్రాల్లో చిరిగిన సంచులను వెనక్కి రప్పించేందుకుప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నాం. వాటి స్థానే అవసరమైన సంచులు పంపిస్తున్నాం. జిల్లాలో 81.12 శాతం ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేశాం. సరోజ, డీఎస్‌వో

**వరి కోతలు వాయిదా వేసుకోండి జేసీ**

అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతల్ని రెండు మూడు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకోవాలన్నారు. అలాంటి అవకాశం లేని చోట్ల రైతు సేవా కేంద్రాల ద్వారా తేమశాతానికి అనుగుణంగా ధాన్యం విక్రయించుకోవచ్చన్నారు.

# అధికారులూ..ఇవేం దారులు?!!

గాజువాక : ఇంటి ముందు సీసీ రోడ్డు నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బంది ఉండదని ఆ ప్రాంత ప్రజలు భావించారు. రోడ్డు నిర్మించాకగానీ తెలియలేదు.. కొత్త కష్టాలు మొదలయ్యాయని. గాజువాక 70వ వార్డు కుంచమాంబకాలనీ–తోకాడ మధ్య 260 మీటర్ల మేర 12 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్డు వేశారు. రహదారి, కల్వర్టులకు జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి రూ.1.67 కోట్లు మంజూరు కావడంతో ఈ పనులు పూర్తిచేశారు. అయితే ఈ రోడ్డును ఓ ప్రణాళిక ప్రకారం వేయకపోవడంతో కొత్త సమస్యలు తలెత్తాయి. నిర్మాణం తరువాత సమీప ఇళ్లల్లోని వారు రోడ్డుమీదికి రావడం కష్టమైపోతోంది. చాలాచోట్ల ఇళ్లకు..రోడ్డుకు మధ్య ఖాళీ ప్రదేశం ఉంది. అక్కడ ఇంకో రోడ్డు నిర్మించేంత ఖాళీ ఉంది. రోడ్డు ఎత్తులో...ఇళ్లు దిగువలో ఉన్నాయి. ప్రజల బాధలు పట్టించు కోకుండా... కేవలం 'రోడ్డు వేశాం.. మా పనైపోయింది' అనేలా చేస్తే ప్రయోజనం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాలువలు ఆధునికీకరించి ఇళ్ల వరకు ఎత్తు చేస్తామని జీవీఎంసీ అధికారులు చెప్తున్నా.. ఇప్పటికే రెండు నెలలు పూర్తికావడంతో ఇకముందు జరుగుతుందన్న నమ్మకం లేదని స్థానికులు చెప్తున్నారు.

# ప్రాశస్త్యం.. ప్రవర్ధమానం

శ్రీకాళహస్తి : పంచభూత లింగాల్లో మన రాష్ట్రంలో ఉన్న ఏకైక క్షేత్రంగా.. వాయులింగ క్షేత్రంగా ఖండాంతర ఖ్యాతి గడిస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయం దినదిన ప్రవర్ధమానం చెందుతోంది. ఇక్కడున్న ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా తెదేపా హయాంలో బృహత్తర ప్రణాళిక ఏర్పాటుకు ఆరేళ్ల కిందట బీజం పడింది. వైకాపా హయాంలో ప్రణాళికలు తరచూ మార్పడంతో ఐదేళ్ల పుణ్యకాలం పూర్తయింది తప్ప.. ఈ దిశగా అడుగులు పడిన దాఖలాలు లేకుండాపోయాయి. టెంపుల్ టూరిజం ప్రకటన నేపథ్యంలో పెరుగుతున్న రద్దీ, ఆదాయం తగ్గట్టుగా భక్తులకు కల్పించాల్సిన వసతులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది.

**ప్రశ్నార్థకంగా ప్రణాళిక అమలు**

ఆలయానికి వస్తున్న భక్తుల వసతుల దృష్ట్యా బృహత్తర ప్రణాళిక అమలు ఒక్కటే పరిష్కారం. తిరుమలకు వెళ్లే భక్తుల్లో 60 శాతం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వస్తున్నారు. వారాంతంలో రోజుకు 25 వేల మందికి పైగా వస్తున్నారు. వచ్చిన భక్తులకు సంతృప్తికర దర్శనం అన్నది మాటలకు పరిమితం అవుతోంది. రాహు, కేతు పూజలకు దాదాపు రెండు గంటలు, దర్శనం కోసం మరో రెండు గంటలు ఇలా భక్తులు దర్శనం పూర్తి చేసుకునేందుకు దాదాపు నాలుగు నుంచి ఆరు గంటలు శ్రమించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో భక్తులు కూర్చొని విశ్రాంతి తీసుకునేందుకు క్యూ సముదాయాలు లేవు. ఒక్కసారిగా ఆలయంలోకి వచ్చాక మళ్లీ వెనక్కి వెళ్లేందుకు వీల్లేని పరిస్థితి. మధుమేహ



వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బృహత్తర ప్రణాళిక అమలైతే ఇక్కడకు వచ్చే భక్తులకు 90 శాతం సమస్యలు తీరినట్లే మరి.

**రద్దీయే కాదు.. ఆదాయమూ ఘనమే**

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వస్తున్న భక్తుల సంఖ్యతో పాటు ఆలయానికి వచ్చే ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. అందుకు తగ్గ వసతులైతే లేవనే చెప్పాలి. రాహు, కేతు సర్పదోష క్షేత్రంగా విరాజిల్లుతున్న ఇక్కడి ఆలయానికి ఏటా వస్తున్న ఆదాయం, రద్దీ, పూజలకు పెరుగుతున్న ఆదరణ, హుండీ ఆదాయం అంకంతకూ పెరుగుతోంది.

**కూటమి ప్రభుత్వంలో ప్రక్షాళన దిశగా..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రధానంగా దళారుల నియంత్రణ, దర్శనార్థం వచ్చే భక్తులకు అవసరమైన సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 'ప్రసాద' పథకం ద్వారా అత్యంత ఆధునాతన వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. యూపీఐ చెల్లింపులు, ఏళ్లయినా ప్రారంభానికి నోచుకోని టాయిలెట్స్ అందుబాటులోకి తీసుకురావడం, ఆలయాల్లో శుభ్రత, పారదర్శక పాలన అందిస్తూ ముందుకెళ్తున్నారు.

**వసతులు అందుబాటులోకి తెస్తున్నాం**

భక్తుల సేవయే భగవంతుని సేవ. ఇప్పటికే సామాన్య భక్తులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులోకి తీసుకువస్తున్నాం. రద్దీ సమయంలో భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా క్యూ సముదాయాల ఏర్పాట్లను పరిశీలిస్తున్నాం. పాలకులు, భక్తుల సలహాలు, సూచనలతో ఆలయ అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.
– టి.బాపిరెడ్డి, ఈవో, శ్రీకాళహస్తీశ్వరాలయం

# బియ్యం అక్రమ రవాణాపై ఏదీ విజి'లెన్స్'?

తిరుపతి : చిత్తూరుకు చెందిన ఓ నాయకుడు అప్పటి పెద్ద మంత్రి అండతో రేషన్ బియ్యం తరలించేవారు. పుత్తూరు, శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆయా ప్రాంతాల్లో బియ్యం సేకరించి పంపేవారు. సూళ్లూరుపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు తమిళనాడు, గూడూరు డివిజన్ ప్రాంతాల్లో రేషన్ సేకరించి తరలించేవారు. ఐదేళు ఇష్టారాజ్యంగా దందా చేసిన వారిలో ఒకరిద్దరు మినహా మళ్లీ అక్రమ దందా సాగిస్తున్నట్లు సమాచారం. ఉప ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి ఆశ్చర్యపోయేలా వెలుగు చూస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ నిఘా కొరవడింది. రాష్ట్రంలో బియ్యం అక్రమ రవాణా మూలాలు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉన్నాయి. నగర,



పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.10–13 వరకు చెల్లించి సేకరిస్తున్నారు. డంపింగ్ ప్రాంతాల్లో భద్రపరిచి.. సరిహద్దులు దాటిస్తున్నారు. గత ఐదేళ్లు అడ్డదిడ్డంగా రేషన్ బియ్యం తరలించిన మాఫియా.. కూటమి ప్రభుత్వం కొలువైన కొద్ది రోజుల తర్వాత మళ్లీ అక్రమ రవాణాకు తెరతీశారు. చిత్తూరు, పుత్తూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట కేంద్రాలుగా రోజూ పదుల సంఖ్యలో వాహనాలు తరలిపోతున్నా విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టడం లేదు. గత ఆరు నెలల్లో ఐదు వాహనాలను మాత్రమే పట్టుకున్నారు.

**సమాచారం వస్తే స్థానిక పోలీసులకు..**

అక్రమ రవాణా సాగుతున్నట్లు విజిలెన్స్‌కు సమాచారం వస్తే స్థానిక పోలీసులకు చెప్పి విజిలెన్స్ అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. ఐదు టన్నుల కన్నా ఎక్కువగా ఉంటేనే విజిలెన్స్ దృష్టి సారిస్తోంది. అంతకన్నా తక్కువ ఉంటే స్థానిక పోలీసులు పట్టుకోవాలని అంటున్నారు. వారి మధ్య సఖ్యత లేకపోవడం వల్ల అక్రమ రవాణా సాగుతోంది. నిజానికి బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పౌర సరఫరాల శాఖ పూర్తిగా చోద్యం చూస్తోంది.

**సూత్రధారుల కోసం అన్వేషణ**

తిరుపతి ప్రాంతీయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేస్తున్న అనేక పనుల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా ఓ భాగం మాత్రమే. అయినా ఇటీవల తిరుపతి బొమ్మల క్వార్టర్స్ వద్ద లారీని పట్టుకున్నాం. సూళ్లూరుపేట వద్ద 2, నాయుడుపేట, దొరవారిసత్రం వద్ద మరో రెండు వాహనాలు పట్టుకుని పౌర సరఫరాల శాఖకు అప్పగించాం. బియ్యం తరలింపులో సూత్రధారులు ఎవరనే విషయంపై దర్యాప్తు జరుగుతుంది. – కరీముల్లా షరీఫ్, తిరుపతి ప్రాంతీయ అధికారి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

# వారికి కరెంటన్నా భయం లేదు




అనంతపురం : కూడేరు సెక్షన్ పరిధిలో విద్యుత్తుశాఖ ఏర్పాటు చేసిన వివిధ సామర్థ్యం ఉన్న 12 నియంత్రికలను దుండగులు పగులకొట్టి అందులో ఉండే కాపర్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. ఆరు నెలల కాలంలో ఇలాంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాధారణంగా కరెంటు సరఫరా అయ్యే సామగ్రి, పరికరాలను ముట్టుకోవాలంటే అందరూ భయపడతారు. విద్యుత్తు సరఫరా ఆయ్యే నియంత్రికలు, పరికరాలను ముట్టుకుంటే ఎక్కడ షాక్ కొట్టి ప్రాణాలు కోల్పోతామేమోనని ప్రతి ఒక్కరూ జంకుతారు. కొంతమంది మాత్రం విద్యుత్తు నియంత్రికలనే ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. వ్యవసాయ, గృహ సర్వీసులకు విద్యుత్తు సరఫరా ఇచ్చేందుకు పొలాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన నియంత్రికలను దుండగులు పగులకొట్టి (ధ్వంసం చేసి) వాటిలో ఉండే రాగి, ఆయిల్ వంటి వాటిని ఎత్తుకెళుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గత ఏడాది కాలంలో 16 కేవీ, 25 కేవీ, 63 కేవీ, 160 కేవీ సామర్థ్యం ఉన్న 80 నియంత్రికలను పగులకొట్టి వాటిలో ఉండే ఆయిల్, సామగ్రిని దొంగిలించారు. నియంత్రికలను దొంగలు ధ్వంసం చేస్తుండటంతో విద్యుత్తు సరఫరా లేక సాగు చేసిన పంటలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసం చేసిన నియంత్రిక స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడంలో విద్యుత్తు అధికారులు జాప్యం చేస్తున్నారని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం**

గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన నియంత్రికలకు సంబంధించి పోలీసుశాఖ వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదు. ఎఫ్ఐఆర్ పత్రం ఉంటే కొత్త నియంత్రిక ఏర్పాటు చేసేందుకు అంచనా తయారు చేసేందుకు వీలవుతుందని విద్యుత్తు అధికారులు చెబుతున్నారు. త్వరితగతిన అంచనా వేసి నియంత్రిక ఏర్పాటు చేయకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. పగులకొట్టిన వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతూ రైతులు విద్యుత్తు కార్యాలయాల చుట్టూ వ్యయ, ప్రయాసలకు ఓర్చి తిరుగుతున్నారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి వివిధ రకాల పంటలు సాగుచేశామని, అవి కళ్లముందే ఎండుతున్నాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

**రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు**

గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్న నియంత్రికలకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి కాపీ ఇవ్వాలని పోలీసు అధికారులకు విద్యుత్తు అధికారులు కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా త్వరగతిన కొత్తవి ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. నియంత్రికలు ఎక్కువగా పగులకొట్టిన ప్రాంతాల్లో విద్యుత్తు విజిలెన్స్ పోలీసులు సంబంధిత ప్రాంత రైతులతో కలిసి గస్తీ నిర్వహిస్తున్నారు. త్వరలోనే నియంత్రికకు నాలుగు వైపులా ట్యాగ్ వెల్డింగ్ చేయిస్తాం. ఇలా చేయడం వల్ల దుండగులు నియంత్రికను సులువుగా పగులకొట్టలేరు.
సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్తుశాఖ

**వారికి రూ.వేలల్లో ఆదాయం.. విద్యుత్తుశాఖకు రూ.లక్షల్లో నష్టం**

నియంత్రికలను ధ్వంసం చేసి అందులో ఉండే సామగ్రి, ఆయిల్‌ను దోచుకెళుతున్న దొంగలకు వచ్చేది రూ.వేలల్లో మాత్రమే. అయితే విద్యుత్తుశాఖకు మాత్రం రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. లీటరు ఆయిల్ ధర 108, కిలో కాపర్ రూ.1,000 ఉంటుంది. ఒక 25 కేవీ నియంత్రికలో 30 నుంచి 35 కేజీల కాపర్, 70 నుంచి 80 లీటర్ల వరకు ఆయిల్ ఉంటుంది. అయితే దోచుకెళ్లిన దొంగలు ఆయిల్, కాపర్‌ను అతి తక్కువ ధరకే అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని పోలీసులు చెబుతున్నారు. అక్కడక్కడ దొంగలు పట్టుపడినా పోలీసులు వారి నుంచి ఆయిల్, కాపర్ రికవరీ చేసి విద్యుత్తుశాఖకు అందజేసినా అది స్క్రాప్ కిందకు మాత్రమే వెళుతుందని విద్యుత్తుశాఖ అధికారులు తెలిపారు. ఏడాది కాలంలో వివిధ సామర్థ్యం గల నియంత్రికలు 80 వరకు దుండగులు ధ్వంసం చేయడంతో విద్యుత్తుశాఖకు రూ.80 లక్షల నష్టం వాటిల్లింది.

# డిస్ట్రిబ్యూటరీ కమిటీలన్నీ ఏకగ్రీవం



అనంతపురం : జిల్లా జలవనరుల శాఖలో డిస్ట్రిబ్యూటరీ కమిటీల(డీసీ) ఎన్నికలు పూర్తి అయ్యాయి. మంగళవారం అనంత, గుంతకల్లులో నిర్దేశిత డివిజన్ కార్యాలయాల్లో ఈ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఏవైన వివాదాలు, గొడవలు జరిగే అవకాశం ఉందన్న ఉద్దేశంతో పోలీసులు భారీగా మోహరించారు. ఒక రోజు ముందుగానే సంబంధిత కాలువల పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షుల (డబ్ల్యూయూఏ) మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో ఏ డీసీకి పోటీ తలెత్తలేదు. ఈనెల 14న జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధ్యక్షులుగా ఎంపికైన వారే డీసీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎంపిక చేశారు. ఆరు కమిటీలూ ఏకగ్రీవం అయ్యాయి. అయితే.. తాడిపత్రి ఉప కాలువ(టీబీసీ) డీసీ కమిటీ వ్యవహారంలో తెరచాటుగా కొంత వివాదం రాజుకున్నట్లు తెలుస్తోంది. అందుకే నిర్దేశిత సమయం ముగిసినా ఎంపికను పూర్తి చేశారు. హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ పర్యవేక్షణలో మొత్తమీ ఆరు డీసీ కమిటీలు ఎంపిక అయ్యాయి. అనంత లోకలైజేషన్ డివిజన్ ఆవరణలో ఈఈ రెడ్డిశేఖర్‌రెడ్డి, డీఈ రమణారెడ్డి ఆధ్వర్యంలో హెచ్ఎల్ఎంసీ, ఎమ్పీఆర్ దక్షిణ, ఉత్తర కాలువలు, డీసీ డివిజన్ కార్యాలయంలో ఈఈ అబ్దుల్ షమీమ్, డీఈ రాజశేఖర్ సారథ్యంలో టీబీసీ, గుంతకల్లులో జీబీసీ, ఆలూరు ఉప కాలువ కమిటీలకు ఎన్నికలు జరిగాయి. అన్ని చోట్లా ఒక్కొక్క నామపత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్లు సంబంధిత ఎన్నికల అధికారులు ప్రకటించారు.

**గడువు ముగిసినా.. ఎన్నిక**


తాడిపత్రి డీసీ మినహా.. అన్ని డీసీ కమిటీలు నిర్దేశిత సమయంలోనే పూర్తి అయ్యాయి. కానీ.. తాడిపత్రి ఉప కాలువ(టీబీసీ) కమిటీ మాత్రం నిర్దేశిత సమయం ముగిసిన తర్వాత ఎన్నిక జరగడం విశేషం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అధ్యక్ష స్థానానికి ఉదయం 9 నుంచి 9.15 గంటలోపే నామినేషన్ దాఖలు చేయాలి. ఉదయం 10.30 గంటల్లోపే ఎన్నిక పూర్తి చేయాలి. ఉపాధ్యక్ష స్థానానికి ఉదయం 11 నుంచి 11.15 గంటల్లోపే నామపత్రాలు దాఖలు పరచాలి. ఎంపిక మొత్తం 12.15 గంటల్లోపే పూర్తి చేయాలి. కాని.. టీబీసీ డీసీ ఎంపిక ప్రక్రియ మధ్యాహ్నం 12.08 గంటల తర్వాత మొదలైంది. అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు గడువు ముగిసిన తర్వాత నామినేషన్లు స్వీకరించడం విశేషం. నిర్దేశిత సమయానికి కేవలం పుట్లూరు మండలం కోమిటకుట్ల డబ్ల్యూయూఏ అధ్యక్షురాలు ప్రమీలమ్మ ఒక్కరే హాజరయ్యారు. మిగతా వారందరూ మధ్యాహ్నం 12 గంటల తర్వాతే వచ్చారు.

**కొత్త డీసీల సారథులు వీరే..**

హెచ్ఎల్ఎంసీ డీసీ అధ్యక్షుడిగా కె.కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి.రమేశ్‌బాబు, ఎమ్పీఆర్ దక్షిణ కాలువ డీసీ అధ్యక్షుడిగా కొర్రపాటి శేఖర్, ఉపాధ్యక్షుడిగా కె.చంద్రాయుడు, ఎమ్పీఆర్ ఉత్తర కాలువ డీసీ అధ్యక్షుడిగా కె.రాజారెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం.వెంకటేసు, టీబీసీ డీసీ అధ్యక్షురాలిగా కె.ప్రమీలమ్మ, ఉపాధ్యక్షుడిగా పి.సత్యనారాయణ రెడ్డి, జీబీసీ–జీఎస్‌బీసీ డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బి.మద్రయ్య, ఎ.రామకృష్ణ, ఆలూరు డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్.కిష్టప్ప, ఎం.రామాంజనేయులు ఎంపిక అయ్యారు.

# మార్కెట్‌కు తెస్తే.. నష్టాలే

పలమనేరు : టమాటాలను మార్కెట్‌కు తీసుకొస్తే చేతి నుంచి సొమ్ములు ఖర్చు చేయాల్సి వస్తోంది. మొన్నటి వరకు టమాటా పెట్టెలు మార్కెట్‌కు తెచ్చి విక్రయిస్తే వచ్చే సొమ్ములు పెట్టిన ఖర్చులకు సరిపోయేవి. ఇప్పుడు అదీ రావడం లేదు. దీంతో రైతులు పంటను తోటల్లోనే వదిలేస్తున్నారు. పలమనేరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో 9 వేల హెక్టార్లలో టమాటా సాగవుతోంది. ధరలు మాత్రం రైతులతో దోబూచులాడుతున్నాయి. మధ్యవర్తుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వస్తేనే పంటకు మంచి ధర లభిస్తుంది. తమిళనాడు నుంచి పెద్ద వ్యాపారులు రావడానికి ఇక్కడ మార్కెట్‌లో సరైన వసతి లేదు. పది చక్రాల లారీలు ఇక్కడ మార్కెట్‌కు సరిపోవు. దీంతో వారు సమీపంలోని కర్ణాటకలోని ఒడ్డిపల్లె మార్కెట్‌కు వస్తుంటారు. ప్రభుత్వం మార్కెట్ వసతి మెరుగు పరచాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని పలమనేరు మార్కెట్ కమిటీ



కార్యదర్శి సంజీవ్‌కుమార్ తెలిపారు.

**ఖర్చు మోపెడు** ఎకరా సాగుకు రూ.లక్ష వరకు ఖర్చవుతోంది. ఎకరాకు 500 నుంచి 600 బాక్సుల టమాటా పండుతోంది. 15 కిలోల పెట్టె ధర రూ.180 లెక్కన విక్రయిస్తే పెట్టిన ఖర్చు మాత్రమే వస్తుంది. రవాణా ఖర్చు అదనం. కుటుంబం మొత్తం ఇదే పని చేస్తున్నా కూలి కూడా గిట్టుబాటు కావడంలేదు.

# అక్కడ జలకళ.. ఇక్కడ వెలవెల

కుప్పం : జల వనరులను నిర్లక్ష్యం చేస్తే ఎలా ఉంటుందో కుప్పం నియోజకవర్గాన్ని.. సద్వినియోగం చేసుకుంటే ఎలా ఉంటుందో పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రాన్ని పరిశీలిస్తే ఇట్టే తెలుస్తుంది. వైకాపా హయాంలో కల్లబొల్లి మాటలు చెప్పడం మినహా జల సంరక్షణకు కనీస చర్యలు తీసుకోకపోవడంతో స్థానిక చెక్‌డ్యామ్‌లు బోసిపోతుండగా.. కర్ణాటకలో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంతో జలసంరక్షణ సాధ్యమైంది. ప్రభుత్వ విధానాల వల్ల భూగర్భ జలాల వృద్ధితో సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదని కన్నడవాసులు అంటున్నారు.

**జగన్ హయాంలో జలవనరులపై నిర్లక్ష్యం**

ఐదేళ్ల జగన్ హయాంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.కోట్లలో నిధులు ఖర్చు చేసినట్లు ఊదరగొట్టినా క్షేత్రస్థాయిలో జలసంరక్షణను గాలికొదిలేసింది. కుప్పంలో పాలారు.. పలమనేరు నియోజకవర్గంలో కైగల్, కౌండిన్య నదుల్లో జలసంరక్షణకు చర్యలు చేపట్టలేదు. రెండేళ్ల కిందట వర్షాలకు నదులు నిండినా.. జలసంపద అనతి కాలానికే వృథాగా తమిళనాడుకు చేరిపోయింది. ఆనకట్టల మరమ్మతులను విస్మరించడం.. కొత్తవాటి నిర్మాణాలకు నిధులు



విదల్చకపోవడంతో.. నదీ జలాల సద్వినియోగానికి అవకాశం లేకపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు** కూటమి ప్రభుత్వ పాలనలో నీటి వనరుల అభివృద్ధితోపాటు కొత్తగా ప్రాజెక్టులు సాకారమవుతాయని అన్నదాతలు ఆశిస్తున్నారు. నదీ జలాల సద్వినియోగంతోపాటు హంద్రీ– నీవా కాలువలో నీటిని పారించి.. సాగు,తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**హంద్రీ–నీవా పేరుతో మసిపూసి**

కుప్పం, పలమనేరు నియోజకవర్గాలకు నీళ్లిచ్చామంటూ.. జగన్ సర్కారు మసిపూసి మారేడుకాయ చేసింది. ముగింపు దశ పనుల పేరుతో దాదాపు రూ.వంద కోట్లను ఖర్చు చేసి ఆఖరికి సినిమా సెట్టింగ్‌ను తలపించే విధంగా కుప్పం బ్రాంచి కాలువలో నీటిని పారించింది. ప్రచారానికి సైతం రూ.కోట్లలో ఖర్చు చేసింది.

**అటు చూడు**

శాంతిపురం మండల సరిహద్దు కర్ణాటక పరిధిలోని సొక్కరబండ గ్రామం వద్ద 20 అడుగుల లోతైన బావిలో సమృద్ధిగా నీరుంది. ఎగువన చెరువులో నీటి నిల్వ వల్ల దిగువన బావులు, బోర్లలో కనీస మట్టంలోనే జలకళ సంతరించుకోవడంతో.. సాగు భూములు చక్కటి పంటలతో కళకళలాడుతున్నాయి. ఏడాదిలో రెండు.. మూడు పంటలు పండిస్తున్నారు.


**ఇటు మోడు** ఇది శాంతిపురం మండల కేంద్రానికి సమీపంలో బోసిపోయిన పాలారు చెక్‌డ్యాం. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 42 కి.మీ. పరిధిలోని పాలారులో 37 చెక్‌డ్యాంలు ఉండగా.. దాదాపు అన్నీ ఎండిపోయాయి. ఎగువ ప్రాంతంలో వర్షాలకు చెరువులు, కుంటలు నిండితే మిగులు జలాలు పాలారు చేరుతాయి. వైకాపా హయాంలో పాలారును పట్టించుకోలేదు. జలసంరక్షణకు చర్యలు చేపట్టకపోవడంతో ఈ ఏడాది శీతాకాలం ఆరంభంలోనే నీటి వనరులు ఒట్టిపోయాయి. వేసవికి మునుపే నీటి ఎద్దడి ఖాయమని జనం ఆందోళన చెందుతున్నారు.

# భూ విలువల సవరణకు కసరత్తు

చిత్తూరు : కొత్త ఏడాది 2025 జనవరి 1 నుంచి సవరించిన భూ విలువల అమలుకు స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల ప్రకారం పట్టణాలు, పల్లెల్లో ఒకేసారి అమలుకు సన్నద్ధమవుతోంది. కొత్త భూ విలువలు, నిర్మాణ విలువల సవరణపై యంత్రాంగం కసరత్తు మొదలెట్టింది. రిజిస్ట్రేషన్లు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, ప్రస్తుత ధరలు, గతంలో ఎన్నిచోట్ల పెంచారు, పెంపు శాతం ఎంత? అనే వివరాలపై అధ్యయనం చేస్తున్నారు.

**తాజాగా 10-15 శాతంలోపే**

సాధారణంగా ఏటా పట్టణాల్లో, రెండేళ్లకోసారి పల్లెల్లో భూ విలువల్ని సవరిస్తారు. గతంలో సవరణలు సక్రమంగా జరగలేదనే విమర్శల కారణంగా ఈ సారి విలువల సవరణను 10–15 శాతంలోపే చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. జేసీ పర్యవేక్షణలో జిల్లా కమిటీల ఆమోదం తెలిపిన తర్వాత.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సవరించిన విలువల్ని నోటీసులో ఉంచుతారు. వీటిపై ఈ నెల 24 వరకు అభ్యంతరాలు, సలహాలు స్వీకరిస్తారు. వీటిపై 27 వరకు పరిశీలన




జరుగుతుంది. తర్వాత 2025 జనవరి 1 నుంచి కొత్త విలువలు అమలవుతాయి. భూవిలువలు పెరిగిన క్రమంలో స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుముల్లో కాస్త పెరుగుదల ఉంటుంది. ఒకటో తేదీ నుంచి పెరిగే అదనపు మోత తప్పించుకునేందుకు ఈ నెలాఖరులోగా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని క్రయవిక్రయదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పోటెత్తే అవకాశం ఉంది.

**గతంలో ఇష్టానుసారం**

వైకాపా ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారం భూ విలువల్ని సవరించారనే విమర్శలు వచ్చాయి. గతంలో ఉన్న విలువపై కనిష్ఠంగా ఐదు శాతం నుంచి గరిష్ఠంగా 70 శాతం వరకు సవరణలు చేశారు. సవరించిన విలువల్ని 2023 జూన్ 1 నుంచి అమలు చేశారు. ఆ ప్రభావంతో గత వార్షిక లక్ష్యాల సాధనపై ప్రభావం చూపాయి. గత వార్షికంలో నిర్ణీత లక్ష్యాల్ని అధిగమించలేకపోయాయి. 2023–24 వార్షికాదాయ లక్ష్యం రూ.181 కోట్లు కాగా.. ఆర్జించింది రూ.92.52 కోట్లే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక స్థిరాస్తి రంగంలో కాస్త వేగం కనిపిస్తోంది.

# చీర కట్టులో నా సామిరంగ..!

కన్నడ ముద్దుగుమ్మ ఆషికా రంగనాథ్ క్రేజీ బాయ్ సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది. కన్నడ సినిమాల్లో ఎక్కువగా నటించిన ఈ అమ్మడు తమిళ్‌లో మొదటి సారి పట్టతు ఆసరన్‌లో నటించింది. 2022లో వచ్చిన ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. కన్నడంలో దక్కిన స్టార్‌డం నేపథ్యంలో తమిళ్, తెలుగు సినిమా ఇండస్ట్రీల్లో ఆఫర్లు వచ్చాయి. తెలుగులో ఈ అమ్మడు ఎంట్రీ ఇచ్చిన సమయంలో మంచి హీరోయిన్‌గా పేరు దక్కించుకుంటుందని, వరుసగా ఆఫర్లు సొంతం చేసుకుంటుంది అంటూ అంతా భావించారు. తెలుగులో ఈఅమ్మడు నటించిన నాగార్జున 'నా సామిరంగ' సినిమా బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ అయ్యింది. అందుకే ఈ అమ్మడు మళ్లీ టాలీవుడ్‌లో కనిపించడం లేదు. కొన్ని సినిమా ఆఫర్లు వచ్చినా చిన్నా చితకా అనే ఉద్దేశ్యంతో తిరస్కరించిందని సమాచారం అందుతోంది. స్టార్ హీరో సినిమాలో ఛాన్స్ కోసం ఆషికా



ఎదురు చూస్తుంది. ప్రస్తుతం ఇతర భాషల్లో రెగ్యులర్‌గా సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలతో పిచ్చెక్కిస్తోంది. ఇటీవల ఈ అమ్మడు షేర్ చేసిన సముద్రంపై షికారు ఫోటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఇప్పుడు చీర కట్టులో ఈ అమ్మడి యొక్క ఫోటో షూట్ చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఈ స్థాయి అందం ఆషికాకే సాధ్యం అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు తెర తీసే విధంగా ఈ అమ్మడి యొక్క చీర కట్టు ఫోటోలు ఉన్నాయి.

చీర కట్టులో నడుము నాభి అందం చూపిస్తే ఆ ఫోటోలు వైరల్ అవుతాయి. కానీ ఆషికా నడుము కనిపించకుండానే, నాభి చూపించకుండానే వైరల్ అవుతోంది. కలర్‌ఫుల్ చీర కట్టుతో ఈ అమ్మడు ఓ రేంజ్‌లో ఆకట్టుకుంది. అన్ని వర్గాల వారిని మెప్పించే విధంగా ఈమె అందంగా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. తెలుగులో మొదటి సినిమా నిరాశ పరచడంతో కనిపించకుండా పోయిన ఆషికా రంగనాథ్‌ను ప్రేక్షకులు మళ్లీ చూడాలని కోరుకుంటున్నారు. ముఖ్యంగా తెలుగులో ఈమెకు యంగ్ స్టార్ హీరోల సరసన ఆఫర్లు వస్తే చూడాలని, ఆమె ప్రతిభ, అందం ఆ సినిమాల్లో చూడాలని ఆశ పడుతున్న వారు చాలా మంది ఉన్నారు. ప్రస్తుతానికి కన్నడం, తమిళ్ సినిమాల్లో మాత్రమే నటిస్తున్న ఈ అమ్మడు ముందు ముందు మరిన్ని సినిమాలు చేస్తుందేమో చూడాలి.

# బాలయ్య వారసుడి ఫస్ట్-5 ఫిక్సైపోయాయా?

నందమూరి నటవారసుడు మోక్షజ్ఞ మొదటి ఐదు చిత్రాలు ముందే ఫిక్సై అయిపోయాయా? తనయుడిని బాలయ్య పక్కా ప్లాన్ తోనే రంగంలోకి దించుతున్నారా? అంటే అవుననే తెలుస్తోంది. ఇప్పటికే అధికారికంగా ప్రశాంత్ వర్మతో మోక్షజ్ఞ డెబ్యూ చిత్రాన్ని పట్టాలెక్కిస్తున్నట్లు ప్రకటించారు. అయితే అనూహ్యంగా ఆప్రాజెక్ట్ డైలమాలో పడిందనే ప్రచారం సాగుతంది. తప్పకుండా ఆ సినిమా ఉంటుంది? కానీ అది డెబ్యూ అవుతుందా? రెండవ సినిమా అవుతుందా? అన్నది ఆసక్తి కరంగా మారింది. ఎందుకంటే? మోక్షజ్ఞతో బాలయ్య అంతకు మించి ప్లాన్ చేస్తున్నాడనే కొత్త ప్రచారం తెరపైకి వస్తుంది. 'కల్కి 2898' దర్శకుడు నాగ్ అశ్విన్ తో తనయుడిని లాంచ్ చేసే ఆలోచనలో ఉన్నట్లు వినిపిస్తుంది. మరి ఇందులో నిజమెంతో తెలియాల్సి ఉంది. ఒకవేళ నాగ్ అశ్విన్ తో మొదటి సినిమా కాకపోతే



రెండవ సినిమా అయ్యే అవకాశం ఉంటుందిట. అలా ప్రశాంత్ వర్మ-నాగ్ అశ్విన్ మధ్య చిన్న గేమ్ నడుస్తోంది. ఈ రెండు సినిమాల తర్వాత మరో యువ మేకర్ వెంకీ అట్లూరితో సినిమా చేసేలా ఒప్పందం చేసుకున్నట్లు వెలుగులోకి వస్తోంది. వెంకీ సక్సెస్ ట్రాక్ చూసి బాలయ్య ఇలా అతడిని కూడా తెరపైకి తెస్తున్నట్లు వినిపిస్తుంది. అలాగే 'ఆదిత్య 999'కి సీక్వెల్ ఉంటుందని కూడా చాలా కాలం క్రితం ప్రకటించారు. అందులో మోక్షజ్ఞ నటిస్తాడని కూడా ప్రచారంలో ఉంది. ఇక బాలయ్యలో కొత్త యాంగిల్ ని తట్టి లేపిన బోయపాటి శ్రీనుతో తనయుడికి ఓ ప్రాజెక్ట్ సెట్ చేసి పెట్టారు. మోక్షజ్ఞ ఓ మూడు సినిమాల తర్వాత బోయపాటితో సినిమా చేస్తే బాగుంటుందని ఇలా అతడిని తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. మొత్తంగా మోక్షజ్ఞ కోసం బాలయ్య మొదటి ఐదు సినిమాలు ముందుగానే సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త ఏడాది 2025లో ఏదో ఒక సినిమాతో మోక్షజ్ఞ బొమ్మ థియేటర్లో పడటం అయితే ఖాయం.




# పరీక్షలతో సంబంధం లేకుండా ఫిబ్రవరి లాక్!




కొత్త ఏడాదిలో కొత్త సినిమాల రిలీజ్ అన్నది సంక్రాంతి సీజన్ తర్వాత మళ్లీ సమ్మర్ కే ఉంటాయి. వేసవి సెలవులు కలిసొస్తాయి అన్న కోణంలో ఎక్కువగా సమ్మర్ రిలీజ్ కే ఆసక్తి చూపిస్తుంటారు. విద్యార్థులు సహా ఫ్యామిలీ ఆడియన్స్ ఎక్కువగా థియేటర్ కి రావడానికి అవకాశం ఉంటుంది కాబట్టి నిర్మాతలు అలా ప్లాన్ చేస్తుంటారు. అయితే గత వేసవి కి మాత్రం సరైన ప్లానింగ్ లేకపోవడంతో ఒక్క సినిమా కూడా రిలీజ్ కాలేదు. రిలీజ్ లు లేక థియేటర్లు బంద్ పెట్టాల్సి వచ్చింది. ఈ సంక్రాంతి కూడా ఎలా ఉంటుందో చెప్పలేని పరిస్థితి. అగ్ర హీరోల సినిమాలు కొన్ని రిలీజ్ కి ఉన్నాయి కానీ! అవి రిలీజ్ అవుతాయా? లేదా? అన్న సందిగ్గం ఉంది . దీంతో టైర్ -2 హీరోలు, యంగ్ హీరోలు కొందరు వాళ్ల మీద ఆధారపడి తమ సినిమా రిలీజ్ లు పెండింగ్ లో పెట్టడం కంటే సేఫ్ గా రిలీజ్ చేసుకోవాలని చూస్తున్నారు. దీనిలో భాగంగా ఫిబ్రవరి నెలని సైతం లాక్ చేస్తున్నారు.వాస్తవానికి ఈ నెలలో రిలీజ్ లు ఉండవు. విద్యార్థుల పరీక్షల సీజన్. రూమ్ దాటి బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. ప్రాక్టీకల్స్...రాత పరీక్షలు అంటూ టెన్షన్ తో గడిపే నెల ఇది. తల్లిదండ్రులు కూడా అదే బిజీలో ఉంటారు. కానీ 2025 ఫిబ్రవరి మాత్రం రిలీజ్ లతో హోరెత్తుతుంది. ఫిబ్రవరి 6 అజిత్ నటించిన పట్టుదల రిలీజ్ అవుతుంది. ఆ మరుసటి రోజు 7న నాగచైతన్య హీరోగా నటిస్తోన్న తండేల్ భారీ అంచనాల మధ్య పాన్ ఇండియాలో రిలీజ్ అవుతుంది. ఈసినిమాపై అసాధారణమైన అంచనాలున్నాయి. ఈ సినిమాతో చైతన్య పాన్ ఇండియా స్టార్ అవ్వడం ఖాయమనే నమ్మకం అందరిలో ఉంది. అక్కడ నుంచి వారం రోజుల్లో ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని యంగ్ హీరో విశ్వక్ సేన్ లైలాతో ప్రేక్షకుల ముందు కొస్తున్నాడు. అదే రోజున కిరణ్ అబ్బవరం దిల్ రూబ, బ్రహ్మానందం నటించిన బ్రహ్మా ఆనందం రిలీజ్ అవుతు న్నాయి. ఫిబ్రవరి 21న మజాకా రిలీజ్ అవుతుంది.

అదే రోజున హాలీవుడ్ చిత్రం రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ కూడా రిలీజ్ అవుతుంది. 28న శబ్దం అనే డబ్బింగ్ సినిమా రిలీజ్ అవుతుంది. ఇలా ఫిబ్రవరి అంతా రిలీజ్ లు కనిపిస్తున్నాయి.

# సాంప్రదాయ చీర కట్టులో నిధి



నాగ చైతన్యతో కలిసి సవ్యసాచి సినిమాతో టాలీవుడ్‌లో అడుగు పెట్టిన నిధి అగర్వాల్ ఆ వెంటనే అఖిల్ సినిమా మిస్టర్ మజ్ను సినిమాలో నటించిన విషయం తెల్సిందే. బ్యాక్ టు బ్యాక్ అక్కినేని బ్రదర్స్‌తో నటించడంతో మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ నిధి అగర్వాల్ టాలీవుడ్‌లో టాప్ స్టార్ హీరోయిన్‌గా మాత్రం గుర్తింపు సొంతం చేసుకోలేక పోయింది. ఆ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరచినా నిధి అగర్వాల్‌కి ఆఫర్లు మాత్రం కంటిన్యూ అవుతూ వచ్చాయి. మిస్టర్ మజ్ను తర్వాత పూరి జగన్నాధ్ దర్శకత్వంలో ఇస్మార్ట్ శంకర్ సినిమాలో నటించే అవకాశం దక్కింది. రామ్ కి జోడీగా నటించిన ఇస్మార్ట్ శంకర్ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద ఇస్మార్ట్ శంకర్ సినిమా కమర్షియల్‌గా పెద్ద విజయాన్ని సొంతం చేసుకోవడంతో టాలీవుడ్‌లో నిధి అగర్వాల్ బిజీ అయ్యింది. తెలుగుతో పాటు తమిళ్‌లోనూ ఈమె నటించే అవకాశాలు సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకోలేక పోయినా తాజాగా పవన్ కళ్యాణ్‌కి జోడీగా హరి హర వీరమల్లు సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఆ సినిమాలో ఈ అమ్మడు రాజకుమారి పాత్రలో కనిపించబోతుంది. ఆ విషయాన్ని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. సినిమాలతో కాస్త తక్కువ కనిపించినా సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్‌గా సినిమాలు చేస్తూ కనిపిస్తూ ఉంది. అందంతో ఆకట్టుకోవడంతో పాటు తనకు ఉన్న ఆసక్తితో మోడలింగ్‌లోనూ రాణిస్తూ వస్తోంది. ఏ ఔట్ ఫిట్ ధరించినా భలే అందంగా కనిపించే నిధి అగర్వాల్ తాజాగా సాంప్రదాయబద్ధమైన చీర కట్టులో కనిపించి ప్రతి ఒక్కరిని సర్‌ప్రైజ్ చేసింది. అందమైన పట్టు చీర కట్టులో నిధి అగర్వాల్ ఆకట్టుకుంది అంటూ అంతా కామెంట్స్ చేస్తున్నారు. అందంగా ఉన్న నిధి అగర్వాల్‌కి ఆశించిన స్థాయిలో ఆపర్లు రాకపోవడం విచారకరం అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తో ప్రస్తుతం చేస్తున్న హరిహర వీరమల్లు సినిమా విడుదల తర్వాత కచ్చితంగా నిధి అగర్వాల్‌కి మంచి క్రేజ్ దక్కడం ఖాయం. సినిమాల్లో ఇక నుంచి బిజీ బిజీగా ఈ అమ్మడు నటించే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా యంగ్ హీరోలు, యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఈమె డేట్ల కోసం ఎదురు చూసే రోజు వస్తుంది అంటూ ఇలాంటి ఫోటోలు షేర్ చేసినప్పుడు ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటారు. ముందు ముందు నిధి అగర్వాల్ ఇదే అందంతో సోషల్ మీడియాలో సందడి చేస్తే కచ్చితంగా మరిన్ని సినిమాలు, అదీ కాకుండా ప్రముఖ స్టార్స్‌కి జోడీగా నటించే అవకాశాలు రావచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# అమ్మకు శ్రీలీల అమ్ములా!

తెలుగు హీరోయిన్ శ్రీలీల గురించి చెప్పాల్సిన పనిలేదు. స్టార్ లీగ్ లో చేరిన నెటి జనరేషన్ తొలి తెలుగు హీరోయిన్. అమ్మడు చాలా వేగంగా స్టార్ హీరోల చిత్రాలకు ప్రమోట్ అయింది. సాధారణంగా తెలుగు అమ్మాయిలకు అవకాశాలు ఇవ్వరు? అనే విమర్శ చాలా కాలంగా ఉంది. దాన్ని శ్రీలీల కాస్త బ్రేక్ చేసినట్లే కనిపిస్తుంది. ప్రస్తుతం అమ్మడి కెరీర్ కి తిరుగు లేదు. శ్రీలీల చలాకీ తనం....ట్యాలెంట్ తో ఇండస్ట్రీలో నెట్టుకొచ్చేస్తుంది. పుష్ప-2లో ఐటం పాటతో పాన్ ఇండియాలోనూ సంచలనం అయింది. ఈ పాట అమ్మడిని పాన్ ఇండియాలోనే ఎనలేని గుర్తింపును తీసుకొచ్చింది. మొదటి భాగంలో సమంత ఊపేస్తే రెండవ భాగంలో శ్రీలీల



ఊపేసింది. ఇకపై బాలీవుడ్ లో అవకాశాలు అందుకునే ఛాన్స్ ఉంది. ఇప్పటికే ఆ రకమైన ప్రయత్నాల్లో ఉంది. ఓ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లే వచ్చి చేజారింది. అయినా శ్రీలీల చలాకీతనంతో మరెన్నో అవకాశాలకు ఛాన్స్ ఉంది. ఇక అమ్మడు ఇంట్లో కూడా ఎంతో చలాకీగా ఉంటుంది. అమ్మను ఆట పట్టించడంలో ముందుంటుంది. అమ్మకు శ్రీలీల అంటే మహా గారం లా ఉంది. శ్రీలీలను వాళ్లమ్మ ముద్దుగా అమ్ములు అని పిలుస్తుంది. సాధారణంగా ఇలాంటి పిలుపులు పల్లెటూళ్లలో వినిపిస్తుంటాయి. కానీ సిటీ కల్చర్ లో పెరిగిన అమ్మాయిని ఇలా పిలడంతో? వాళ్లెంత డౌన్ టూ ఎర్త్ అన్నది అద్దం పడుతుంది. తల్లీ-కూతురు డాక్టర్లు. బెంగుళూరులో సొంత ఆసుపత్రులున్నాయి. శ్రీలీల నటి కాకపోయి ఉంటే అమ్మలా డాక్టర్ అయ్యేది. ఇప్పటికే ఆ కోర్సు కూడా పూర్తి చేసింది. కానీ తల్లి కుమార్తెను హీరోయిన్ చేయాలని చిన్ననాటి ప్లాన్ చేసి నటనవైపు అడుగులు పడలా చూసారు. అందుకే శ్రీలీల అంత గొప్ప డాన్సర్ అయింది. నటిగానూ ఆమెకు తిరుగు లేదు.

# కంబ్యాక్ లో బుట్టబొమ్మ మనసు గెలిచిన చిత్రం!

టాలీవుడ్ ని కాదని బాలీవుడ్ కి వెళ్లిన పూజాహేగ్డే అలియాస్ బుట్టబొమ్మ ఎంత వేగంగా వెళ్లిందో అంతే వేగంగా మళ్లీ పెవీలియన్ చేరిన సంగతి తెలిసిందే. లక్కీగా అమ్మడు అక్కడ ఎక్కువ సమయం వృద్ధా చేయకుండా సౌత్ ఇండస్ట్రీకి తిరిగి వచ్చింది. సాధారణంగా ఇలా వెళ్లి వచ్చిన వారికి తిరిగి అవకాశాలు ఇవ్వడం అన్నది అంత వీజీ కాదు. ఎంతో అదృష్టం ఉంటే తప్ప సాధ్యం కాదు. ఆవిషయంలో బుట్టబొమ్మ లక్కీ గాళ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. కంబ్యాక్ లో స్టార్ హీరోలతోనే అవకాశాలు అందుకుంటుంది. తెలుగులో నాగచైతన్యతో ఓ సినిమాకి సైన్ చేసింది. కోలీవుడ్ లో సూర్య 44వ చిత్రంలోనూ ఈ అమ్మడే హీరోయిన్. దళపతి విజయ్ 69వ చిత్రంలో సైతం పూజానే హీరోయిన్. ఇవి చేతిలో అధికారికంగా ఉన్న ప్రాజెక్ట్ లు. అనధికారంగా ఇంకా మూడు నాలుగు సినిమాలకు కమిట్ అయినట్లు సమాచారం. అమ్మడు



మాలీవుడ్ కి కూడా ఎంట్రీ ఇస్తుంది. అయితే వీటన్నింటిలో కల్లా బుట్టబొమ్మ మనసుకు దగ్గరైన రోల్ ఏది అంటే సూర్య 44వ చిత్రం అంటోంది. ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమా గురించి విషయాలు పంచుకుంది. ప్రేమ, యుద్దం, నవ్వు చుట్టూ తిరిగే కథ ఇది. ఈ మూడు అంశాల్ని ఆధారంగా చేసుకుని ఇంత వరకూ సినిమా రాలేదు. ఈ కథకు నా పాత్ర వెన్నుముఖ. ఇంత ప్రాధాన్యత ఉన్న దక్కడం నిజంగా అదృష్టం అనే చెప్పాలి అని తెలిపింది. సూర్య 44వ చిత్రాన్ని కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. దర్శకుడిగా కార్తీక్ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. రొటీన్ కి భిన్నమైన సినిమాలు తెరకెక్కించడంలో ఆయన స్పెషలిస్ట్. ఇప్పటివరకూ ఆయన తెరకెక్కించిన చాలా చిత్రాలు విజయాలు అందుకున్నవే. అలాంటి డైరెక్టర్ కి సూర్య లాంటి స్టార్ తోడవ్వడంతో 44పై అంచనాలు పీక్స్ కి చేరుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ కూడ పూర్తయింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536